www.vishvambhara.com
తెలుగు దినపత్రిక
# విశ్వంభర
అక్షరం సాక్షిగా..
సోమవారం
03-06-2024
సంపుటి : 01 | సంచిక : 30 | పేజీలు : 12 | వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్

V3 NEWS
లక్ష్యం సమాజహితం






## యాదాద్రి నర్సన్న లడ్డుకు మస్తు గిరాకీ

నిత్యం 50వేల వరకు చిన్న లడ్డూలు

ఒక్క మే నెలలోనే రూ.4.79 కోట్ల ఆదాయం

గంటల వ్యవధిలో లక్షల లడ్డూలు తయారీ

ప్రసాదానికి ఇప్పటికే భోగ్ గుర్తింపు



**విశ్వంభర, నల్లగొండ బ్యూరో:**

ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతున్న మహిమాన్విత స్వయంభూ యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకునే భక్తులు రోజురోజుకూ పెరుగుతున్నారు. సాధారణంగా ప్రతి రోజూ 30వేలు మంది భక్తులు, వారాంతపు, సెలవు దినాల్లో 65వేల మందికి పైగా దర్శించుకుంటున్నారు. ఏకశిఖర వాసుడిని దర్శించుకొని, మొక్కులు చెల్లించుకున్న భక్తులందరూ స్వామివారి లడ్డూ ప్రసాదాన్ని మహిమాన్వితంగా భావిస్తారు. స్వామివారికి లడ్డూ ప్రసాదాన్ని ఇంటికి తీసుకు వెళ్లడం ఆనవాయితీ. అయితే స్వామివారి ఆలయంలో ప్రసాదాల టోకెన్లు, ప్రసాదాల పంపిణీ ఒకేచోట ఉండడంతో స్వామివారి లడ్డూ, పులిహోర మిగతా3లో...

"తెలంగాణ కోసం ప్రాణాలు అర్పించిన అమరులకు నివాళులర్పిస్తున్నా.. బానిసత్వాన్ని తెలంగాణ భరించదు. సంక్షేమం ముసుగులో ప్రజాస్వామ్యాన్ని హరిస్తే తెలంగాణ సహించదు. ముళ్ల కంచెలు, ఇనుప గోడలు తొలగించాం. పాలనను ప్రజల దగ్గరకు తెచ్చాం. సచివాలయంలోకి సామాన్యుడు వచ్చేలా చేశాం. ఇందిరాపార్క్ దగ్గర ధర్నా చేసుకునేందుకు అనుమతిచ్చాం. పత్రి పక్షాలకు గౌరవం ఇచ్చాం" అంటూ తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగించారు.



### బిడ్డ ఇంట్లో శుభకార్యానికి

# తల్లికి హోదా కావాలా?!

## ఏ హెదా ఉందని మహాత్మా గాంధీని జాతిపితగా గుర్తించాం



సోనియాగాంధీని ఈ సమాజం తల్లిగా గుర్తించి, గౌరవిస్తుంది

మేమే సర్వ జ్ఞానులం అన్న భ్రమలు లేవు..

పదేండ్ల పాలనలో తెలంగాణ వందేళ్ల విధ్వంసం


- ప్రజల సంపద గుప్పెడు మంది చేతుల్లోనే ఉంది
- 'జయ జయహే తెలంగాణ'నే రాష్ట్ర అధికారిక గీతం
- తెలంగాణ అంటే ధిక్కారం, పోరాటం..
- అది రాష్ట్ర చిహ్నంలో ప్రతిబింబించాలి
- గ్రామీణ మహిళ రూపమే తెలంగాణ తల్లి
- గ్రీన్ తెలంగాణ 2050 మాస్టర్ ప్లాన్ తయారు చేస్తున్నాం
- రాష్ట్రాన్ని మూడు జోన్లుగా విభజించి అభివృద్ధి
- హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచేలా మూసీ సుందరీకరణ
- తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి

2

### మీ ధైర్యం.. సంకల్పమే

## తెలంగాణను ఇచ్చేలా చేసింది

- కరీంనగర్ ప్రజలకు 2004లో నేను హామీ ఇచ్చాను
- కాంగ్రెస్ పార్టీలో ఇబ్బందులు వచ్చినా వాగ్దానం నెరవేర్చాను
- ఢిల్లీ నుంచి వీడియో సందేశం పంపిన సోనియాగాంధీ
- ప్రజలకు రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన అధినేత్రి


2

### ఈ రోజు మనమందరం

## ప్రతిజ్ఞ చేద్దాం

- మేము లంచాలకు దూరంగా ఉంటాం
- లంచాల కోసం ఎన్నటికీ నిమగ్నమై ఉండబోం
- ప్రతిజ్ఞ చేయించిన గవర్నర్ సి.పి.రాధాకృష్ణ
- ఆవిర్భావ దినోత్సవంలో గవర్నర్ మొదటి ప్రసంగం


3



## టోల్ మోత స్టార్ట్

- అర్ధరాత్రి నుంచి అమల్లోకి వచ్చిన టోల్ ఛార్జీలు
- సగటున 5 శాతం పెంచుతున్నట్లు ప్రకటించిన ఎన్ హెచ్ఐఏ
- నెలవారీ పాసులు ఛార్జీలూ పెంపు
- పెంచిన ఛార్జీలు 2025 మార్చి 31వరకు అమలు
- భారంగా మారనున్న హైవేలపై ప్రయాణం

2



### ఉద్యమ రూపాలు గుర్తు చేసుకుంటే

## ఒళ్లు పులకరిస్తుంది

### ప్రొఫెసర్ జయశంకర్ ఆజన్మ తెలంగాణ వాది

- ఓడిపోయామని మోకాళ్ల ఎత్తు కూడా లేనోళ్లు ఏదేదో మాట్లాడుతుండ్రు
- ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే బీఆర్ఎస్‌కు 105 అసెంబ్లీ సీట్లు
- మహబూబ్ నగర్ ఎమ్మెల్సీ ఉపఎన్నికల్లో గెలిచాం..
- గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ విజయం ఖాయం
- తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో మాజీ సీఎం కేసీఆర్



**విశ్వంభర, హైదరాబాద్:**

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది వేడుకలను బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు గులాబీ దళపతి, మాజీ సీఎం కేసీఆర్ హాజరై తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించి రాష్ట్ర ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ .. ప్రొఫెసర్ జయశంకర్ ఆజన్మ తెలంగాణ వాది అని.. ఇలాంటి సమయంలో ఆయన్ను స్మరించుకోకుండా ఉండలేమని అన్నారు. '1999లో అంతకు ముందు కాలంలో తెలంగాణ అనుభవించిన బాధ ఊహించుకుంటే ఇప్పుడు దుఃఖం వచ్చే పరిస్థితి ఉంది. యావత్ తెలంగాణ కరువులు, వలసలు, కరెంట్ కోతలు, ఆత్మహత్యలు, మిగతా3లో...

### బీఆర్ఎస్ ఎమ్మెల్సీ

## ఘన విజయం

- మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ ఉపఎన్నికలో నవీన్ రెడ్డి గెలుపు
- కాంగ్రెస్ అభ్యర్థిపై 108 ఓట్ల తేడాతో బీఆర్ఎస్ విజయం
- తెలంగాణ ఆవిర్భావం రోజే విజయకేతనం ఎగురవేసిన గులాబీ పార్టీ


3

## అందెశ్రీ భావోద్వేగం

- జయజయహే తెలంగాణ గీతావిష్కరణ సమయంలో..
- రాష్ట్ర గీతాన్ని జాతికి అంకితం చేసిన సీఎం రేవంత్ రెడ్డి


2



## నేటి చికెన్ ధరలు

| ఫామ్ ధర | రిటైల్ |
|---|---|
| ₹ 145 | ₹ 167 |
| స్కిన్ | స్కిన్‌లెస్ |
| ₹242 | ₹276 |

### హరీశ్‌రావు దొంగచాటుగా అమెరికా వెళ్లి

## ప్రభాకర్ రావును కలిశాడు

- ట్యాపింగ్ కేసులో కేసీఆర్ అరెస్టు కాక తప్పదనే అల్లుడిని అమెరికా పంపాడు
- ప్రభాకర్ రావు అప్రూవర్‌గా మారితే ఇబ్బంది అవుతుందని భయం
- మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సంచలన వ్యాఖ్యలు


2

## క్షమాపణ చెప్పి ముక్కు నేలకు రాయాలే..

- నేను ప్రభాకర్ రావుని కలిసినట్టు నిరూపించు
- మతిభ్రమించి పబ్లిసిటీ కోసం మాట్లాడొద్దు
- నేను అధారాలతో అమరవీరుల స్తూపం వద్దకు వస్తా..
- నీ దగ్గర ఉన్న సాక్ష్యాలను, ఆధారాలను తీసుకొని రా..
- కోమటిరెడ్డికి హరీశ్ రావు సవాల్


2

## బీఆర్ఎస్‌లాగా కాంగ్రెస్ పిరాయింపులకు పాల్పడలేదు

- రానున్న రోజుల్లో బీఆర్ఎస్ కనుమరుగు అవ్వడం ఖాయం
- స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలిచినా నైతిక విజయం కాంగ్రెస్‌దే
- నవీన్ కుమార్ రెడ్డి విజయంపై స్పందించిన మంత్రి జూపల్లి కృష్ణారావు


2

# తల్లికి హోదా కావాలా?!

**విశ్వంభర, హైదరాబాద్:**

దశాబ్ది ఉత్సవాల శుభ సందర్భంలో... అమరుల ఆశయాలు, ప్రజల కలలు నెరవేర్చే దిశగా ప్రజా ప్రభుత్వం కొన్ని కీలక నిర్ణయాలు తీసుకున్నామన్నారు. స్వల్పకాలిక ఆలోచనలు కాదు... దీర్ఘ కాలిక ప్రణాళికలతో భవిష్యత్ కు పునాదులు వేస్తున్నాం. మొత్తం తెలంగాణకు "గ్రీన్ తెలంగాణ 2050 మాస్టర్ ప్లాన్" తయారు చేస్తున్నామని సీఎం రేవంత్ తెలిపారు.

**సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగం యథావిధిగా...**

మిత్రులారా... నాలుగు కోట్ల ప్రజల హృదయాలు ఆనందంతో ఉప్పొంగే పర్వదినం ఇది. తెలంగాణ అస్తిత్వానికి, ఆత్మగౌరవానికి పట్టాభిషేకం జరిగి దశాబ్ద కాలం పూర్తయింది. రాష్ట్ర సాధన కోసం ప్రాణాలు అర్పించిన అమరులకు ఈ సందర్భంగా నివాళి అర్పిస్తున్నాను. ఆరు దశాబ్దాల మన కలను నిజం చేసిన నాటి ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్, నాటి యూపీఏ ఛైర్ పర్సన్ సోనియాగాంధీలకు తెలంగాణ సమాజం తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ... అందరికి తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు. స్వేచ్ఛ తెలంగాణ జీవన శైలిలో భాగం. బానిసత్వాన్ని తెలంగాణ భరించదు. ప్రేమను పంచడం, పెత్తనాన్ని ప్రశ్నించడం మన తత్వం. ఆకలినైనా భరిస్తాం కానీ, స్వేచ్ఛను హరిస్తే సహించం. దాశరథి చెప్పినట్టు తెలంగాణ అమాయకపు నెరజాణే కానీ... అన్యాయం జరిగితే తిరగబడే నైజం కూడా మనకు ఉంది. సంక్షేమం ముసుగులో ప్రజాస్వామ్యాన్ని చెరబట్టాలని చూస్తే తెలంగాణ భరించదు. "ప్రాంతేతరుడు ద్రోహం చేస్తే పొలిమేరల వరకు తరిమికొడతాం... ప్రాంతం వాడే ద్రోహం చేస్తే ప్రాణాలతోనే పాతిపెడతాం" అన్న కవి కాళోజీ మాటలు అక్షర సత్యాలు.

**మేమే సర్వ జ్ఞానులం అన్న భ్రమలు లేవు..**

డిసెంబర్ 7, 2023న ప్రారంభమైన ప్రజా పాలనలో స్వేచ్ఛ పునరుద్ధరణకు మొదటి ప్రాధాన్యత ఇచ్చాం. ముళ్ల కంచెలు, ఇనుప గోడలు తొలగించాం. పాలకులు, పాలితుల మధ్య గోడలు బద్దలు కొట్టాం. మున్సిపల్ కౌన్సిలర్ నుండి... ముఖ్యమంత్రి వరకు ప్రజలకు అందుబాటులో ఉండే పాలన తెచ్చాం. మేం సేవకులం తప్ప పాలకులం కాదన్న నిజాన్ని నిరూపించాం. ప్రగతి భవన్ ను మహాత్మ జ్యోతిరావు పూలే ప్రజా భవన్ గా పేరు మార్చి... ప్రజలకు అందుబాటులోకి తెచ్చాం. అక్కడ ప్రతి మంగళ, శుక్రవారాల్లో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. ప్రజల సమస్య నేరుగా విని, పరిష్కరిస్తున్నాం. సచివాలయం లోకి ఈ రోజు సామాన్యుడు కూడా రాగలిగే పరిస్థితి తెచ్చాం. ఇందిరాపార్కులో ధర్నాచౌక్ కు అనుమతి ఇచ్చాం. మీడియాకు స్వేచ్ఛను ఇచ్చాం. ప్రతిపక్షానికి గౌరవం ఇచ్చాం. మా నిర్ణయాల్లో లోటుపాట్ల సమీక్షకు అవకాశం ఇస్తున్నాం. తప్పులు జరిగితే సరిదిద్దుకోవడానికి సిద్ధంగా ఉన్నాం. మేమే సర్వ జ్ఞానులం అన్న భ్రమలు లేవు. అందరి సలహాలను, సూచనలను స్వీకరించి, చర్చించి ముందుకు వెళుతున్నాం. ప్రజలకు స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమాన అవకాశాలు ఇవ్వాలన్నది మా ప్రభుత్వ ప్రాధాన్యత.

**తెలంగాణ తల్లి కష్టజీవి... కరుణామూర్తి**

జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ... అంటే, జన్మనిచ్చిన తల్లి, జన్మనిచ్చిన భూమి స్వర్గం కంటే గొప్పవి అని అర్థం. తెలంగాణ తల్లి నాలుగు కోట్ల ప్రజల ఆకాంక్షల ప్రతిరూపం. ఆ తల్లిని చూస్తే... మన కన్నతల్లి యాదిలోకి రావాలి. సగటు తెలంగాణ గ్రామీణ మహిళ రూపమే... తెలంగాణ తల్లి ప్రతిరూపంగా ఉండాలి. తెలంగాణ తల్లి కష్టజీవి... కరుణామూర్తి. ఈ రూపురేఖలతో తెలంగాణ తల్లి రూపానికి పునరుజ్జీవనం జరగాలి. త్వరలో ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించేలా తెలంగాణ తల్లి రూపం సిద్ధం అవుతుంది. ఇది సాంస్కృతిక పునరుజ్జీవనంలో భాగం. ఈ నిర్ణయాలు ఎవరికీ వ్యతిరేకం కాదు. ఒక జాతి ఆకాంక్షలకు ప్రతిరూపం మాత్రమే.

**ఆర్థిక పునరుజ్జీవనం :**

రాష్ట్ర సంపద పెంచి, పేదలకు పంచడానికి ఆర్థిక పునరుజ్జీవనం జరగాల్సిన అవసరం ఉంది. మేం అధికారం చేపట్టేనాటికి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ పూర్తిగా విధ్వంసమై ఉంది. 7 లక్షల కోట్ల రూపాయల అప్పుల ఊబిలో తెలంగాణ ఉంది. శాసనసభలో శ్వేత పత్రం పెట్టి వాస్తవాలు ప్రజల ముందు ఉంచాం. ఆర్థిక క్రమశిక్షణకు ప్రాధాన్యత ఇస్తూనే సంక్షేమం, అభివృద్ధిలో రాజీ పడటం లేదు. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు మొదటి తారీఖునే వేతనాలు ఇస్తున్నాం..

**డ్రగ్స్ పై ఉక్కు పాదం...**

తెలంగాణలో డ్రగ్స్ అన్న మాట వినిపించడానికి వీలు లేదని మేం సంకల్పం తీసుకున్నాం. డ్రగ్స్, గంజాయి విషయంలో ప్రభుత్వం అత్యంత కఠినంగా వ్యవహరిస్తోంది. టీ న్యాబ్ కు పూర్తి సహకారం, స్వేచ్ఛ ఇస్తున్నాం. అవసరమైన నిధులు ఇస్తున్నాం. డ్రగ్స్ విషయంలో ఎంతటి వారు ఉన్నా వదిలే సమస్యే లేదు. ఈ విషయంలో వ్యక్తిగతంగా నేను చాలా పట్టుదలతో ఉన్నాను. ఇది మన యువత భవిష్యత్ కు సంబంధించిన అంశం. అందుకే ఉక్కుపాదంతో అణచివేయాలని సంకల్పించాం. డ్రగ్స్ ఫ్రీ తెలంగాణకు ప్రభుత్వ పరంగానే కాదు... వ్యక్తిగతంగా నేను ప్రాధాన్యత ఇస్తున్నాను.

**ఉద్యోగాల కల్పనకు కట్టుబడి ఉన్నాం**

యువత ఉద్యోగ నోటిఫికేషన్లు, పరీక్షల నిర్వహణ పారదర్శకంగా నిర్వహించడానికి తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ను ప్రక్షాళన చేశాం. 70 రోజుల్లోనే 30 వేల మంది యువతకు ఎల్బీ స్టేడియంలో ఉద్యోగ నియామక పత్రాలు అందించాం. గ్రూప్ 1 నోటిఫికేషన్ ఇచ్చాం. ఈ నెల తొమ్మిదిన ప్రాథమిక పరీక్ష జరగబోతోంది. 11,062 పోస్టులతో మెగా డీఎస్సీ నిర్వహణకు నోటిఫికేషన్ ఇచ్చాం. వయో పరిమితిని 44 నుంచి 46 ఏళ్లకు పెంచాం. ప్రభుత్వంలో ఖాళీలను భర్తీ చేస్తాం.

**భద్రాద్రి రాముడి సాక్షిగా ఇందిరమ్మ ఇళ్లు...**

రాష్ట్రంలో లక్షల మంది ప్రజలు సొంత ఇళ్ల కోసం ఎదురు చూస్తున్నారు. వారి కలలు నెరవేర్చేందుకు భద్రాద్రి రాముడి సాక్షిగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభించాం. ఈ ఒక్క ఏడాదే 22,500 కోట్ల రూపాయలు వెచ్చించి... పేదల కోసం 4,50,000 ఇళ్లు నిర్మించబోతున్నాం. ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున ఇవ్వబోతున్నాం. ఇంటి స్థలం లేని వారికి స్థలం, స్థలం ఉన్న వారికి ఇంటి కోసం 5 లక్షల రూపాయల ఆర్థిక సాయం చేయబోతున్నాం.

**కాంగ్రెస్ ఎప్పుడూ రైతుల పక్షమే..**

రైతు బాగుంటే రాష్ట్రం పచ్చగా ఉంటుందని విశ్వసించే ప్రభుత్వం ఇది. గతంలో రైతుకు ఉచిత విద్యుత్, రుణమాఫీ చేసిన చరిత్ర మాది. ఆ ట్రాక్ రికార్డును ప్రజా ప్రభుత్వం కొనసాగిస్తోంది. రైతుకు ఆర్థిక సాయం పథకంలో భాగంగా 69 లక్షల మందికి చెప్పిన మాట ప్రకారం 7,500 కోట్ల రూపాయలు వారి ఖాతాల్లో జమ చేశాం. ఇటీవల అకాల వర్షాలతో పంట నష్టం జరిగితే ఎకరాకు 10 వేల రూపాయలు పరిహారం ఇచ్చాం. ధాన్యం సేకరణ కోసం 7,245 కేంద్రాలు తెరిచాం. ఎలాంటి షరతులు లేకుండా తడిసిన ధాన్యం కొంటున్నాం. తరుగు విషయంలో రైతు నష్టపోకుండా చూస్తున్నాం. నకిలీ విత్తనాలపై ఉక్కుపాదం మోపాం. వ్యవసాయానికి 24 గంటల నిరంతరాయ, నాణ్యమైన విద్యుత్ ఇస్తున్నాం. ధరణి పోర్టల్ పై స్పెషల్ డ్రైవ్ పెట్టి సమస్యలు పరిష్కరిస్తున్నాం.

**కృష్ణా, గోదావరి జలాల్లో వివాదం**

తెలంగాణ ముందు పలు సవాళ్లు కూడా ఉన్నాయి. కృష్ణా, గోదావరి జలాల్లో మన వాటా లెక్క తేల్చాల్సిన అవసరం ఉంది. పదేండ్లైనా నీటి పంపకాలు జరగలేదు. కేంద్రం పై ఒత్తిడి తెచ్చి త్వరగా నీటి వాటాలు సాధించుకుని, సాగునీటి ప్రణాళికలు సమర్థవంతంగా అమలు చేసుకోవాలన్నది ప్రజా ప్రభుత్వ ఆలోచన. హైదరాబాద్ ఉమ్మడి రాజధానికి ఈ రోజుతో కాలం చెల్లింది. ఆంధ్ర ప్రదేశ్ తో ఆస్తుల విభజనకు సంబంధించి సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించుకుంటాం.

**ప్రపంచ నెంబర్ వన్ బ్రాండ్‌గా హైదరాబాద్**

తెలంగాణ ప్రపంచానికి ఒక దిక్సూచి కావాలి. తెలంగాణ విజయ పతాక దేశ విదేశాలలో సగర్వంగా ఎగరాలి. "పల్లె కన్నీరు పెడుతోందో..." అని ఒకనాడు ఆవేదనతో పాడిన తెలంగాణ పల్లెలు ఇకపై పచ్చని పైరులతో, పాడి పంటలతో, రైతుల మొఖాలలో చిరునవ్వులతో వెలగాలి. ఒకనాడు పొట్ట చేత పట్టి పట్నంకు వచ్చిన యువత... రేపటి నాడు ప్రపంచానికి మన సత్తా చాటే శక్తిగా మారాలి. తెలంగాణ ఇతర రాష్ట్రాలతో కాదు ప్రపంచంతో పోటీ పడుతుందని నిరూపించాలి. మనకు శక్తి ఉంది, సత్తువుంది... తెలివి ఉంది, తెగింపు ఉంది, త్యాగాల చరిత్ర ఉంది. ఏం తక్కువ తెలంగాణకు. హైదరాబాద్ మన బ్రాండ్. ప్రపంచ నెంబర్ వన్ బ్రాండ్ గా హైదరాబాద్ ఎదగాలి. తెలంగాణను ప్రపంచానికి డెస్టినేషన్ గా మార్చాలన్న తపన ఉంది. దీనికి ప్రజల ఆశీస్సులతో పాటు... రాజకీయ, పరిపాలన, పత్రికా, న్యాయ, సామాజిక వ్యవస్థల సహకారం కావాలి. ఆ దిశగా ప్రతి ఒక్కరు, ప్రతి క్షణం ఆలోచన చేయాలని... ప్రజా ప్రభుత్వానికి మీ సంపూర్ణ సహకారం అందించాలి... అందరికీ తెలంగాణ దశాబ్ది ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు.



## గ్రీన్ తెలంగాణ 2050

**స్వల్పకాలిక ఆలోచనలు కాదు... దీర్ఘ కాలిక ప్రణాళికలతో భవిష్యత్‌కు పునాదులు వేస్తున్నాం. మొత్తం తెలంగాణకు "గ్రీన్ తెలంగాణ 2050 మాస్టర్ ప్లాన్" తయారు చేస్తున్నాం. రాష్ట్రాన్ని మూడు జోన్లుగా విభజిస్తున్నాం. హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో ఉన్న ప్రాంతం అర్బన్ తెలంగాణ, ఔటర్ రింగ్ రోడ్డు నుండి రీజినల్ రింగ్ రోడ్డు మధ్య ప్రాంతం సబ్ అర్బన్ తెలంగాణ, రీజినల్ రింగ్ రోడ్డు నుండి తెలంగాణ రాష్ట్ర సరిహద్దుల వరకు ఉన్నది గ్రామీణ తెలంగాణగా నిర్ధారించాం. మూడు జోన్లలో ఎక్కడ ఎలాంటి అభివృద్ధి జరగాలి... ఎక్కడ ఏ రకమైన మౌలిక సదుపాయాల కల్పన జరగాలన్నది ఈ మెగా ప్రణాళికలో విస్పష్టంగా ప్రకటిస్తాం.**

## మూసీ సుందరీకరణ...

**మూసీ సుందరీకరణ పథకం ద్వారా పరివాహక ప్రాంతాన్ని ఉపాధి కల్పన జోన్గా తీర్చిదిద్దబోతున్నాం. దీని కోసం ఇప్పటికే వెయ్యి కోట్ల రూపాయలు కేటాయించాం. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ ను ఈ పథకం మరోస్థాయికి తీసుకువెళ్లుతుందనడంలో సందేహం లేదు. పర్యాటకం, ఆర్థికం, పర్యావరణం ఈ మూడు కోణాలు ఇందులో ఉన్నాయి. ఎగువన ఉన్న ఉమ్మడి రంగారెడ్డి, దిగువన ఉన్న ఉమ్మడి నల్గొండ జిల్లాలలో సాగునీటి వనరుగా కూడా మూసీ ఉపయోగపడుతుంది. ప్రజల అవసరాలకు తగ్గట్టు మెట్రో విస్తరణ ప్రణాళికను ప్రకటించాం. రీజినల్ రింగ్ రోడ్డు త్వరిత గతిన పూర్తికి ప్రయత్నిస్తాం. తక్కువ ఖర్చుతో, ఎక్కువ నీరు ఇవ్వగలిగే సాగునీటి ప్రాజెక్టులకు తొలి ప్రాధాన్యత ఇస్తున్నాం. రాష్ట్ర ఆర్థిక పునరుజ్జీవనానికి అవసరమైన అన్ని నిర్ణయాలు తీసుకుంటాం.**

## ఏ హెదా ఉందని మహాత్మా గాంధీని జాతిపితగా గుర్తించాం

తెలంగాణ ప్రదాత, మనకు మాతృ సమానురాలైన సోనియాగాంధీని ఈ పండుగకు ప్రత్యేక అతిథిగా ఆహ్వానించాం. ఏ హెూదాలో సోనియాగాంధీని ఆహ్వానించారని అడుగుతున్నారు. బిడ్డ ఇంట్లో శుభకార్యానికి తల్లికి హెూదా కావాలా?! తల్లిని ఆహ్వానించడానికి బిడ్డకు ఒకరి పర్మిషన్ అవసరమా?! ఏ హెదా ఉందని, ఏ పదవిలో ఉన్నారని మహాత్మా గాంధీని మనం జాతిపితగా గుర్తించుకున్నాం?! తెలంగాణ చరిత్ర ఉన్నంత వరకు సోనియాగాంధీని ఈ సమాజం తల్లిగా గుర్తించి, గౌరవిస్తుంది. ఈ గడ్డతో ఆ తల్లి బంధం రాజకీయాలకు అతీతం. దశాబ్ది ఉత్సవాల శుభ సందర్భంలో... అమరుల ఆశయాలు, ప్రజల కలలు నెరవేర్చే దిశగా ప్రజా ప్రభుత్వం కొన్ని కీలక నిర్ణయాలు తీసుకుంది. సాంస్కృతిక పునరుజ్జీవనం, ఆర్థిక పునరుజ్జీవనం. ఈ రెండు ఇప్పుడు తెలంగాణ భవిష్యత్ నిర్మాణానికి కీలకాంశాలు. ఆ దిశగా మన ప్రభుత్వం అడుగులు వేస్తోంది.

## 'జయ జయహే తెలంగాణ'నే రాష్ట్ర అధికారిక గీతం

ఏ జాతికైనా తన సంస్కృతే తన అస్తిత్వం. ఆ సంస్కృతిని కాపాడటం ప్రభుత్వాల బాధ్యత. బోనం నుండి బతుకమ్మ వరకు... సాయుధ పోరాటం నుండి స్వరాష్ట్ర ఉద్యమం వరకు మన సంస్కృతి, మన చరిత్ర గొప్పవి. సమ్మక్క సారలమ్మ నుండి జోగులాంబ వరకు... భద్రాద్రి రాముడు నుండి కొమురం భీం వరకు, అమరుల త్యాగాలు, హక్కుల ఉద్యమాల వంటి వాటితో తెలంగాణ గొప్ప చారిత్రక వారసత్వాన్ని కలిగి ఉంది. ఈ సంస్కృతికి, చరిత్రకు పునరుజ్జీవనం జరగాలి. తెలంగాణ వచ్చి పదేండ్లైన ఇప్పటికీ మనకు రాష్ట్ర గీతం లేదు. ఉద్యమ కాలంలో ఉవ్వెత్తున స్ఫూర్తిని రగిలించిన... "జయ జయహే తెలంగాణ జననీ జయకేతనం..." గేయమే మన రాష్ట్ర అధికార గీతం కావాలని ఆ నాడు ఆశించాం. సహజ కవి అందెశ్రీ రచించిన ఈ గేయం మన రాష్ట్ర గేయంగా ఉంటుందని విశ్వసించాం. ప్రజల ఆకాంక్షల మేరకు ఈ పర్వదినాన "జయ జయహే తెలంగాణ..." గీతాన్ని రాష్ట్ర అధికారిక గీతంగా సగర్వంగా ప్రకటిస్తున్నాం. ఇది సాంస్కృతిక పునరుజ్జీవనానికి తొలి అడుగు.

## జాతి చరిత్రకు అద్దం చిహ్నం

చిహ్నం ఒక జాతి చరిత్రకు అద్దంపడుతుంది. జాతి చరిత్ర మొత్తం నిక్షిప్తమై ఉండేది చిహ్నంలో మాత్రమే. తెలంగాణ అంటే ధిక్కారం, పోరాటం. రాష్ట్ర అధికారిక చిహ్నంలో అది ప్రతిబింబించాలి. ఆ దిశగా ప్రజా ప్రభుత్వం నూతన చిహ్నాన్ని రూపొందించే పనిలో ఉంది. వివిధ వర్గాల నుండి వచ్చిన సూచనలు, సలహాలు పరిగణనలోకి తీసుకుని నూతన చిహ్నాన్ని రూపొందించే పనిలో ఉన్నాం. అదే విధంగా... ప్రభుత్వ అధికారిక ఉత్తర్వులు, సంస్థల సంక్షిప్త పేర్లు, వాహన రిజిస్ట్రేషన్ లో రాష్ట్రాన్ని సూచించే సంక్షిప్త అక్షరాలుగా టీజీ ఉండాలని ప్రజా ప్రభుత్వం నిర్ణయించింది. ఉద్యమ సమయంలో టీజీనే రాష్ట్ర సంక్షిప్త అక్షరాలుగా ప్రజలు నిర్ధారించుకున్నారు. యువత తమ గుండెలపై టీజీ అక్షరాలను పచ్చబొట్లుగా పొడిపించుకున్నారు. వారి ఆకాంక్షల మేరకు టీఎస్ స్థానంలో టీజీని పునరుద్ధరిస్తు ప్రజా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

## పదేండ్ల పాలనలో తెలంగాణ వందేళ్ల విధ్వంసం

జూన్ 2, 2014 నాడు తెలంగాణ భౌగోళిక ఆకాంక్ష నెరవేరింది. అంతటితో మనం లక్ష్యాన్ని చేరినట్టు కాదు. ఉద్యమ లక్ష్యాలు, అమరుల ఆశయాలు సాధించిన నాడే తెలంగాణ సాధనకు సార్థకత వస్తుంది. దశాబ్ద కాలం అన్నది ఒక మైలురాయి. ప్రజల ఆశలు, ఆశయాలు నెరవేర్చడంలో మనం ఎక్కడ ఉన్నాం అన్నది సమీక్షించుకోవాల్సిన సందర్భం ఈ దశాబ్ది ఉత్సవం. నేను రాజకీయ విమర్శల జోలికి పోను కానీ, చరిత్రను సమీక్షించుకున్నప్పుడే భవిష్యత్ కు పునాదులు వేసుకోగలం. తప్పొప్పులను గుర్తించి, దిద్దుబాటు చేసుకోవడం విజ్ఞుల లక్షణం. పదేండ్ల పాలనలో తెలంగాణ వందేళ్ల విధ్వంసానికి గురైంది. భౌతిక విధ్వంసం మాత్రమే కాదు. తెలంగాణ మూల స్వభావమైన స్వేచ్ఛ పై దాడి జరిగింది. సామాజిక న్యాయం మేడిపండు చందంగా మారింది. ప్రజలందరికీ చెందాల్సినరాష్ట్ర సంపద గుప్పెడు మంది చేతుల్లోకి చేరింది. తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలు విధ్వంసానికి గురయ్యాయి. ఆర్థిక విధ్వంసం సంగతి చెప్పనక్కర్లేదు. ఇది గతం... ప్రజలే, ప్రజల కోసం, ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రభుత్వం ఇప్పుడు తెలంగాణలో ఉంది. ప్రజా ప్రభుత్వంలో జరుపుకుంటున్న మొదటి ఆవిర్భావ దినోత్సవం ఇది. అందుకే ఈ ఆవిర్భావ దినోత్సవానికి చరిత్రలో ప్రత్యేక స్థానం ఉంటుంది.

---

# టోల్ మోత స్టార్ట్

**విశ్వంభర, హైదరాబాద్:** వాహనదారులకు ఇది బ్యాడ్ న్యూస్ అనే చెప్పాలి. ఆదివారం అర్ధరాత్రి నుంచి టోల్ చార్జీలను పెంచుతున్నట్లు జాతీయ రహదారుల ప్రాధికారిక సంస్థ (ఎన్ హెచ్ఐఏ) ప్రకటించింది. దేశవ్యాప్తంగా టోల్ ఛార్జీలను సగటున 5 శాతం పెంచుతున్నట్లు తెలిపింది. ఛార్జీల పెంపు నిర్ణయం కొద్ది రోజుల క్రితమే తీసుకున్నప్పటికీ ఎన్నికల కారణంగా వాయిదా వేసినట్లు పేర్కొంది. సార్వత్రిక ఎన్నికలు ముగియడంతో ఆదివారం అర్ధరాత్రి నుంచి టోల్ ఛార్జీల పెంపును అమలు చేయనున్నట్లు పేర్కొంది. ఏప్రిల్ 1 నుంచే టోల్ ఛార్జీలు పెంచాలని ఎన్ హెచ్ఐఏ నిర్ణయం తీసుకుంది. పెంచిన చార్జీలు 2025 మార్చి 31వరకు అమలు కానున్నాయి. అయితే, ఈ నిర్ణయాన్ని కేంద్ర జాతీయ రహదారులు, రోడ్డు రవాణా మంత్రిత్వ శాఖ ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లింది. ఎన్నికల నేపథ్యంలో ఛార్జీల పెంపు నిర్ణయాన్ని వాయిదా వేయాలంటూ ఎన్‌హెచ్ఐఏను ఎన్నికల సంఘం ఆదేశించింది. పెంచిన ఛార్జీలతో ఒక వైపు ప్రయాణానికి రూ.5, ఇరువైపులా కలిపి రూ.10, తేలికపాటి వాణిజ్య వాహనాలు ఒక వైపు ప్రయాణానికి రూ.10, ఇరువైపులా కలిపి రూ.20, బస్సులు, ట్రక్కులకు ఒకవైపు రూ.25, ఇరువైపులా రూ.35, పెంచారు. భారీ వాహనమైతే ఒకవైపు రూ.35, ఇరువైపులా రూ.50వరకు పెంచారు. నెలవారీ పాసులు రూ.330 నుంచి రూ.340కి పెంచారు.

# బీఆర్ఎస్‌లాగా కాంగ్రెస్ పిరాయింపులకు పాల్పడలేదు

**విశ్వంభర, మహబూబ్ నగర్:** రానున్న కాలంలో బీఆర్ఎస్ పార్టీ కనుమరుగు అవ్వడం ఖాయమని మంత్రి జూపల్లి కృష్ణారావు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి నవీన్ కుమార్ రెడ్డి విజయం సాధించడంపై ఆయన స్పందించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలిచినా నైతిక విజయం కాంగ్రెస్ పార్టీదేనని అన్నారు. కేవలం సాంకేతికంగా మాత్రమే నవీన్ కుమార్ రెడ్డి గెలిచారని కామెంట్ చేశారు. అయినా తమ అభ్యర్థి ఓడింది కేవలం 111 ఓట్లతోనే అని అన్నారు. స్థానిక సంస్థల్లో గతంలో 300 ఓట్లున్న కాంగ్రెస్ బలం 652 ఓట్లకు పెరిగిందని, ఆ విషయాన్ని ప్రత్యర్థి పార్టీ గ్రహించాలని అన్నారు. బీఆర్ఎస్‌లాగా తాము పార్టీ ఫిరాయింపులకు పాల్పడలేదని మంత్రి జూపల్లి స్పష్టం చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అత్యధిక స్థానాలు గెలవడం ఖాయమని, జూన్ 4న తరువాత బీఆర్ఎస్ పార్టీలో ఎవరూ మిగలరని మంత్రి జూపల్లి అన్నారు.

# హరీశ్‌రావు దొంగచాటుగా అమెరికా వెళ్లి ప్రభాకర్ రావును కలిశాడు

**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రాన్ని కుదిపేస్తున్న ఫోన్ ట్యాపింగ్ కేసులో సంచలన విషయాలను రహదారుల భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి బయటపెట్టారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్ అరెస్టు కాక తప్పదని ఆయన వ్యాఖ్యానించారు. ఈ కేసులో అన్ని నిజాలు బయటపడతాయన్న ఆయన, హరీశ్‌రావు దొంగచాటుగా అమెరికా వెళ్లి వచ్చారన్నారు. గత నెల 26న ఎమిరేట్స్ ఫ్లైట్ నంబరు ఈకే 525లో హరీశ్‌రావును కేసీఆర్ అమెరికాకు పంపారని ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్ చేసిన ఎస్ ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావును కలవడానికే హరీశ్ రావు అమెరికా వెళ్లారని, ఇండియాకు రాకుండా ఆపేందుకే ఆయనను పంపించారని చెప్పారు. ఎవరికి చెప్పకుండా అమెరికా వెళ్లాల్సిన అవసరం హరీశ్‌రావు ఏమొచ్చిందని మంత్రి కోమటిరెడ్డి ప్రశ్నించారు. ట్యాపింగ్ చేస్తూ భార్యాభర్తల మధ్య జరిగిన సంభాషణలను కూడా విన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభాకర్ రావు అప్రూవర్‌గా మారితే ఇబ్బంది అవుతుందని కేసీఆర్ భయపడుతున్నారని అన్నారు. అమెరికా వెళ్లి ప్రభాకర్ రావును కలవలేదని హరీశ్‌రావు ప్రమాణం చేస్తారా అని సవాల్ విసిరారు. ఎన్నిరోజులైనా కేసీఆర్‌ను వదిలిపెట్టేది లేదని, వెంటనే వచ్చి లొంగిపోవాలని ప్రభాకర్ రావుకు మాజీ సీఎం చెప్పాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ తెలంగాణ జిన్నా లాగా మారిపోయారని,



జిన్నా కూడా ఒకరోజు ముందే స్వాతంత్ర్య దినోత్సవాన్ని చేసుకునే వారని చెప్పారు.

# క్షమాపణ చెప్పి ముక్కు నేలకు రాయాలే..

**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మాజీ మంత్రి హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. హరీశ్ రావు దొంగచాటుగా అమెరికా వెళ్లి వచ్చారని, ఫోన్ ట్యాపింగ్ చేసిన ప్రభాకర్ రావును కలవడానికే వెళ్లారని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆరోపించిన విషయం తెలిసిందే.దీనిపై హరీశ్ రావు స్పందిస్తూ... కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మతిభ్రమించిందని చెప్పారు. అబద్ధాలతో ప్రభుత్వాలు నడుపుతున్నారని చెప్పడానికి ఆ ఆరోపణ ఒక ఉదాహరణ అని అన్నారు. తాను, తన కుటుంబ సభ్యులతో విదేశాలకు వెళ్లింది వాస్తవమని చెప్పారు. అయితే, ప్రభాకర్ రావును కలిసినట్టు వెంకట్ రెడ్డి అంటున్నారని తెలిపారు.తాను అమెరికా వెళ్లి ప్రభాకర్ రావుని కలిసినట్లు రుజువు చేస్తే అమరవీరుల స్తూపం ముందు ముక్కు నేలకు



రాయడానికి సిద్ధమని చెప్పారు. ఒకవేళ రుజువు చేయకపోతే కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి బహిరంగ క్షమాపణలు చెప్పి అమరవీరుల స్తూపం ముందు ముక్కు నేలకు రాయాలని సవాలు విసిరారు. తాను ఏ దేశం వెళ్లానో, ఏ హోటల్‌లో ఉన్నానో, తదితర వివరాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నానని చెప్పారు. తన పాస్‌పోర్ట్ సహా ఇతర వివరాలు తీసుకొని బహిరంగ చర్చకు వస్తానని అన్నారు. పాస్‌పోర్టులో ఇమిగ్రేషన్ ఇన్ అండ్ అవుట్ వివరాలు ఉంటాయని తెలిపారు. కనీస జ్ఞానం లేకుండా పబ్లిసిటీ కోసం కోమటిరెడ్డి మాట్లాడటం చౌకబారుతనమని చెప్పారు. కోమటిరెడ్డి దగ్గర ఉన్న వివరాలతో రుజువు చేయాలని, ఆధారాలతో రావాలని డిమాండ్ చేశారు. కోమటిరెడ్డి చెప్పిన తేదీన, చెప్పిన సమయానికి అమరవీరుల స్తూపం వద్దకు వస్తానని, ఆధారాలతో మీరు రావాలని అన్నారు. చిల్లర వ్యాఖ్యలు చేయడం మాని పాలనపై దృష్టి సారించాలని హితవు పలికారు.

# అందెశ్రీ భావోద్వేగం

**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో భాగంగా పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అందె శ్రీ రచించి.. కీరవాణి స్వరకల్పన చేసిన జయజయహే తెలంగాణ గీతాన్ని విడుదల చేశారు. ఈ గీతాన్ని జాతికి అంకితం చేశారు సీఎం రేవంత్ రెడ్డి. మొత్తం 2 నిమిషాల 32 సెకన్ల నిడివితో ఈ పాటను రిలీజ్ చేశారు. పాట విడుదల సందర్భంగా రచయిత అందె శ్రీ భావోద్వేగానికి గురయ్యారు.జై తెలంగాణ అంటూ నినదించారు. ఉద్యమ సమయంలో తెలంగాణ రాష్ట్రాన్ని ఆకాంక్షిస్తూ రాసిన ఈ పాటకు.. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా అందెశ్రీ మార్పులు చేశారు. ఇక ఈ పాటకు కీరవాణి సంగీతం అందించడంతో కొంత వివాదం కూడా నడిచింది. మొత్తంగా జయజయహే తెలంగాణ అంటూ ప్రారంభమయ్యే ఈ గీతం..సుఖశాంతుల తెలంగాణ సుభిక్షంగా ఉండాలి..ప్రతిదినమది తెలంగాణ ప్రజల కలలు పండాలే.. జై తెలంగాణ.. జైజై తెలంగాణ అంటూ ముగుస్తుంది.

# మీ ధైర్యం.. సంకల్పమే తెలంగాణను ఇచ్చేలా చేసింది

**విశ్వంభర, ఢిల్లీ :** రాష్ట్ర ప్రజలకు కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియా గాంధీ రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర సాధన కోసం ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగాలను గుర్తు చేసుకున్నారు. ఈ మేరకు వీడియో సందేశాన్ని విడుదల చేసిన సోనియా... రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా తమ పార్టీ పనిచేస్తుందన్నారు. "తెలంగాణ రాష్ట్ర సోదరసోదరీమణులందరికీ నమస్కారం. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ప్రాణాలు అర్పించిన మహనీయులందరికీ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా..శ్రద్ధాంజలి ఘటిస్తున్నాను. ప్రత్యేక రాష్ట్ర కల సాకారాన్ని కాంగ్రెస్ పార్టీ నెరవేస్తుందని కరీంనగర్ ప్రజలకు 2004లో నేను హామీ ఇచ్చాను. ఈ వాగ్దానంతో మా పార్టీలో అంతర్గతంగా అసమ్మతి చెలరేగింది. చాలా మంది నేతలు మా పార్టీని కూడా వీడారు. కానీ ప్రత్యేక రాష్ట్రం కోసం మీ ధైర్యం, సంకల్పం... తెలంగాణ ఇచ్చి తీరాలనే శక్తి సాహసాలు, ప్రేరణను నాకు కల్పించాయి. రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ సర్కారు ప్రజలకిచ్చిన గ్యారంటీలను అమలు చేయడంలో కార్యసిద్ధులై ఉంటారని మీ అందరికీ నేను హామీ ఇస్తున్నాను. రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా... తెలంగాణ ప్రగతి, ఉజ్వల భవిష్యత్తు కోసం శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను." అని సోనియా గాంధీ తెలిపారు.

# యాదాద్రి నర్సన్న లడ్డుకు మస్తు గిరాకీ

(మొదటి పేజీ తరువాయి)

ప్రసాదాలు పొందేందుకు భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రసాద విక్రయశాల వద్ద రద్దీ ఎక్కువగా ఉండడంతో చాలామంది భక్తులు ప్రసాదాలను కొనుగోలు చేయకుండానే వెనుతిరుగుతున్నారు. అయితే కలియుగ దైవం తిరుమల తిరుపతి శ్రీవేంకటేశ్వరస్వామి అంటే గుర్తుకు వచ్చేదీ స్వామి వారి లడ్డూ ప్రసాదం. తిరుమల తిరుపతి లడ్డూ తర్వాత రుచి, శుచిలో భక్తులు ఎక్కువగా ఇష్టపడేదీ శ్రీ యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి లడ్డూ ప్రసాదం. అయితే ఇపుడు మహిమాన్విత యాదాగిరిశుడి లడ్డూ ప్రసాదానికి బాగా డిమాండ్ పెరిగింది.

**ఒక్క మే నెలలోనే రూ.4.79 కోట్ల ఆదాయం..**

సంబోధ్యావుడి దర్శనానికి వచ్చే భక్తులకు అనుగుణంగా ప్రసాదాల విక్రయంపై దేవస్థానం అధికారులు దృష్టికి సారించారు. కొండ పైన శివాలయం పక్కన నూతనంగా ప్రసాదాల టికెట్ కౌంటర్‌ను ఏర్పాటు చేశారు. దర్శనానికి విచ్చేసిన భక్తులంతా కూడా కౌంటర్ వద్దకు వెళ్లకుండా ఒక్క సభ్యుడు మాత్రమే వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. దీంతో ప్రసాదాల విక్రయాలను గతంతో పోలిస్తే గణనీయంగా పెరిగాయి. ఆలయ అధికారులు తీసుకున్న నిర్ణయంతో ఏప్రిల్ నెలతో పోలిస్తే మే నెలలో రూ.1,74,63,580 అధికంగా ప్రసాదాల విక్రయాలు జరిగాయి. ప్రసాదాల నాణ్యతపై కూడా అధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు. ప్రసాదాల టోకెన్లు, పంపిణీకి ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయడంతో ఆదివారంతో ఇతర సెలవు దినాల్లోనూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తడంలేదు. ఏప్రిల్ నెలలో ప్రసాదాల విక్రయం ద్వారా రూ.3,05,08,630 కోట్లు రాగా, మే నెలలో రూ.4,79,72,210 ఆదాయం సమకూరింది.



**అధునాతన యంత్రాలు.. గంటల్లో లక్షల లడ్డూలు**

యాదాద్రి క్షేత్రంలో లడ్డూలను తయారు చేసేందుకు ప్రత్యేకంగా ఆధునాతన యంత్రాలను వినియోగిస్తున్నారు. తిరుమల తరహాలో ప్రసాదాలు సిద్ధం చేసేందుకు చెన్నై, పుణె, ముంబై, రాజమండ్రి నుంచి అధునాతన యంత్రాలను తెప్పించారు. బూందీ, పాకం తయారీ యంత్రాలు శరవేగంతో పనిచేస్తాయి. లడ్డూలు కట్టేందుకు, పులిహోర కలిపేందుకు కూడా యంత్రాలనే వినియోగిస్తున్నారు. ముడి పదార్థాలను యంత్రాల్లో వేయడం వరకే సిబ్బంది పని. మిగతా ప్రక్రియ మొత్తం యంత్రాలే నడిపిస్తాయి. సిద్ధమైన ప్రసాదాలు కన్వేయర్ బెల్టు ద్వారా విక్రయ కౌంటర్లకు చేరవేస్తారు. లడ్డూలను నిల్వ చేసే పాత్రలను శుభ్రం చేసేందుకు సైతం ప్రత్యేక యంత్రాలను అమర్చారు. లడ్డూ తయారీ యంత్రం వందమంది నలభీములకు సమానం. 16 గంటల వ్యవధిలో సుమారు 500 కిలోల పప్పును పిండిగా పట్టి, బూందీగా కొట్టి, పాకం పెట్టి, జీడిపప్పు, కిస్మిస్, యాలకుల పొడి దట్టించి, లడ్డూ కట్టి ఏకంగా 50 వేల నుంచి లక్ష లడ్డూలను సిద్ధం చేస్తుంది. ఇక పులిహోర విషయానికి వస్తే.. భారీ ఆవిరి యంత్రాల్లో బియ్యం వేస్తే చాలు. నలభై నిమిషాల్లో మల్లె పువ్వులాంటి అన్నం సిద్ధమవుతుంది. ఈ అన్నాన్ని మిక్సింగ్ బ్లెండర్ సాయంతో పులిహోరగా కలుపుతారు. వడల తయారీకి కూడా ప్రత్యేక యంత్రాలు ఏర్పాటు చేశారు.

**ప్రసాదాల టోకెన్ల అవకతవకలను అరికట్టేందుకు..**

తమ ఇలవేల్పుగా భావించి యాదాద్రి లక్ష్మీ నరసింహ స్వామిని భక్తులకు ప్రసాదాల సజావుగా ఉండేందుకు దేవస్థానం చర్యలు తీసుకుంటోంది. స్వామి వారి ప్రసాదాల విక్రయానికి సంబంధించిన రశీదు బుక్‌లను గతంలో దేవస్థానం ఆధ్వర్యంలో ముద్రించేవారు. ప్రసాదాల కొనుగోలు రశీదుల ముద్రణ బాధ్యతలు సెంట్రల్ బ్యాంకు ఆఫ్ ఇండియాకు అప్పగించారు. తద్వారా రశీదులు రీసైక్లింగ్ కాకుండా అడ్డుకట్ట పడిందని భావిస్తున్నారు. ఈ నిర్ణయంతో ప్రసాదాల విక్రయాలు పెరిగాయి. శివాలయం ఎదురుగా నూతనంగా ప్రసాదాల కొనుగోలు కోసం ప్రత్యేకంగా ప్రసాదాలను భక్తులు కొనుగోలు చేస్తున్నారు.

**యాదాద్రి ప్రసాదానికి భోగ్ గుర్తింపు...**

ఇప్పటికే శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ప్రసాదానికి జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. తిరుమల తిరుపతి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి లడ్డు తర్వాత యాదాద్రి లడ్డూ ప్రసాదాన్ని భక్తులు అమితంగా ఇష్టపడతారు. కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ పరిధిలోని ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) నుంచి భోగ్(బ్లిస్‌ఫుల్ హైజీనిక్ ఆఫరింగ్ టు గాడ్) జాతీయ స్థాయి గుర్తింపు పత్రం పొందింది. ఇదిలావుంటే.. యాదాద్రి దేవస్థానంలో పెద్ద లడ్డూ ప్రసాదం కోసం డిమాండ్ పెరుగుతోంది. చిన్న లడ్డూలు 100 గ్రాములు, పెద్ద లడ్డూలు 500 గ్రాముల పరిమాణంలో తయారు చేస్తున్నారు. నిత్యం 20 వేల నుంచి 30 వేల వరకు పెద్ద లడ్డూలు, 50 వేల వరకు చిన్న లడ్డూలు విక్రయిస్తున్నారు. ఇక శని ఆదివారాలు, ఉత్సవాల సమయంలో భక్తుల రద్దీని బట్టి ఈ డిమాండ్ రెండు మూడు రెట్లకుపైగా ఉంటుంది. లడ్డూ ప్రసాదానికి డిమాండ్ పెరగడంతో రోజూ ఉదయం నుంచి రాత్రి 7 గంటల వరకు తయారు చేస్తున్నారు. భక్తుల రద్దీ పెరుగుతున్న నేపథ్యంలో మరికొంత మందిని నియమించారు. కాగా దేవస్థానానికి వచ్చే ఆదాయంలో సగానికిపైగా లడ్డూ ప్రసాదం నుంచే సమకూరుతుందని అధికారులు వెల్లడించారు.



## ఓట్ల లెక్కింపు తర్వాత బీఆర్ఎస్ ఖాళీ

- కేసీఆర్‌కు తెలంగాణ ప్రజలపై ఏమాత్రం ప్రేమలేదు
- ప్రపంచంలోనే వింతన్న మేడిగడ్డ మూడేళ్లలో కూలిపోయింది
- చేపలు, గొర్రెల పంపిణీ పేరిట వేలకోట్ల అవినీతి
- మీడియాతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

**విశ్వంభర, హైదరాబాద్ :** లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపు తర్వాత బీఆర్ఎస్ ఖాళీ అవుతుందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి జోస్యం చెప్పారు. హైదరాబాద్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు తెలంగాణ ప్రజలపై ఏమాత్రం ప్రేమలేదని విమర్శించారు. అధికారంలోకి వచ్చాక కేసీఆర్ చేపలు, గొర్రెల పంపిణీ పేరిట వేలకోట్ల రూపాయలను తిన్నారని ఆరోపించారు. ప్రపంచంలోనే వింత అని చెప్పిన మేడిగడ్డ మూడేళ్లలో కూలిపోయిందని ఎద్దేవా చేశారు. వందల ఎకరాలు ఉన్న వారికీ రైతుబంధు వేశారని 70వేల మంది టీచర్లు రిటైర్ అయినా డీఎస్సీ నిర్వహించలేదని కోమటిరెడ్డి దుయ్యబట్టారు. మంత్రి పదవి రాలేదనే కారణంతోనే అప్పట్లో తెలంగాణ ఉద్యమాన్ని చేపట్టారని, అమాయకులను రెచ్చగొట్టారంటూ ఆరోపించారు. ఉద్యమ సమయంలో కేసీఆర్ భోజనం చేయాలంటూ రూ.లక్ష వసూలు చేసేవారని అన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేసీఆర్, ఆయన కుటుంబం సోనియాగాంధీ కాళ్లు మొక్కారని గుర్తుచేశారు. తెలంగాణ ప్రజలంతా సోనియాగాంధీకి రుణపడి ఉండాలని కేసీఆర్ చెప్పిన మాటలను గుర్తుచేశారు. పంద్రాగస్టుకు తాము రూ.2లక్షల రుణమాఫీ చేస్తున్నామని వెల్లడించారు.

## జూన్ 2నే అద్భుతమైన మెజారిటీతో గెలిచాం: మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి



**విశ్వంభర, మహబూబ్‌నగర్ :** మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానంలో బీఆర్ఎస్ విజయం సాధించడం పట్ల మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి స్పందించారు. మహబూబ్ నగర్ జిల్లాలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్ర ఏర్పాటు జరిగిన జూన్ 2నే బీఆర్ఎస్ పార్టీ అద్భుతమైన మెజారిటీతో విజయం సాధించిందని చెప్పారు. ఓట్లు వేసిన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు. తాము ఈ విజయాన్ని అమరవీరులకు అంకితం ఇస్తున్నామని చెప్పారు. నవీన కుమార్ రెడ్డికి అభినందనలు చెబుతున్నట్లు తెలిపారు. ఈ ఎన్నికల్లో విజయాన్ని ముందే ఊహించామని చెప్పారు. పూర్తి మెజారి బీఆర్ఎస్‌కే ఉందని అన్నారు. గతంలో గోల్ మాల్ చేసి ఎమ్మెల్సీగా గెలిచిన అనుభవం మేరకు రేవంత్ రెడ్డి పోటీ పెట్టారని తెలిపారు. నైతికంగా సంఖ్య లేకున్నా పోటీలో నిలబెట్టారని అన్నారు. ఇప్పటికైనా భాషను, రాజకీయాలను మార్చుకోవాలని హితవు పలికారు. ఈ ఎన్నిక ఫలితం సీఎం రేవంత్ రెడ్డికి చెంప పెట్టని చెప్పుకొచ్చారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజున తనకు గెలిపించినదుకు ప్రజాప్రతినిధులకు ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

## ఈ రోజు మనమందరం ప్రతిజ్ఞ చేద్దాం

**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పది సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం పరేడ్ గ్రౌండ్స్ లో అధికారికంగా నిర్వహిస్తుంది. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా పాల్గొన్న గవర్నర్ సి.పి.రాధాకృష్ణ మాట్లాడుతూ..... "ఈ రోజు మనం మన గొప్ప రాష్ట్రమైన తెలంగాణా 10వ ఆవిర్భావ దినోత్సవాన్ని జరుపుకుంటున్నాము అని తెలిపారు. ఈ రోజు మనమందరం ప్రతిజ్ఞ చేయాలి. తెలంగాణ, భారత మాత యొక్క సమగ్ర అభివృద్ధి కోసం మేము లంచాలకు దూరంగా ఉంటాము. లంచాల కోసం ఎన్నటికీ నిమగ్నమై ఉండమని ,మేము పరిపాలనను అత్యంత పారదర్శకంగా ఉంచడానికి ప్రయత్నిస్తామని ప్రతిజ్ఞ చేయాలని గవర్నర్ పిలుపునిచ్చారు. కాగా ఇటీవల ఎన్నికల సమయంలో నూతన గవర్నర్ గా సి.పి.రాధాకృష్ణన్ తెలంగాణ బాధ్యతలు చేపట్టారు. కాగా ఈ రోజు మొట్టమొదటి సారి ఆయన తెలంగాణ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు.

## క్యూఆర్ కోడ్ మార్చేసి రూ.4కోట్లు కొట్టేశారు

**విశ్వంభర, హైదరాబాద్:** డిజిటల్ యుగంలో మోసాలు కూడా అప్ డేట్ అవుతున్నాయి. ఒకప్పుడు దొంగతనాలు ఉండేవి. కానీ ఇప్పుడు అంతా ఆన్ లైన్ మోసాలే జరుగుతున్నాయి. తాజాగా ఓ సంస్థ ఉద్యోగులు క్యూ ఆర్ కోడ్ ను మార్చేసి ఒకటి కాదు రెండు కాదు ఏకంగా రూ.4 కోట్లు కొట్టేశారు. చివరకు సదరు కంపెనీ నిర్వహించిన ఆడిట్‌లో అసలు నిజం వెలుగు చూడడంతో యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు సమగ్రంగా విచారణ జరిపి ఇద్దరు ఉద్యోగులే నిందితులు అని తేల్చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ కొండాపూర్‌లోని 'ఇస్తారా పార్క్స్ ప్రైవేట్ లిమిటెడ్' సంస్థ ఆతిథ్య రంగంలో సేవలందిస్తోంది. నగరంలో ఒంటరిగా ఉండే ఉద్యోగుల కోసం ఈ సంస్థ 'కోలివింగ్ ప్రాపర్టీస్' పేరుతో అద్దె గృహాలు సైతం నిర్వహిస్తోంది. ఈ సంస్థకు దేశవ్యాప్తంగా 16 నగరాల్లో ఫుడ్ కోర్టులు కూడా ఉన్నాయి. కాగా, నగర పరిధిలో 'కోలివింగ్ ప్రాపర్టీస్'లో పని చేసే ఉద్యోగులు.. వినియోగదారుల నుంచి డిజిటల్ విధానంలో 'క్యూఆర్ కోడ్' ద్వారా మాత్రమే స్వీకరించాలి. ఈ నగదు నేరుగా సంస్థ ఖాతాలో జమవుతుంది.అయితే, చెంగిచెర్లకు చెందిన యసిరెడ్డి అనిల్ కుమార్, సికింద్రాబాద్ కు చెందిన రాజ్ కుమార్‌లు ఈ సంస్థలో గతేడాది మార్చి నుంచి ఫ్లోర్ మేనేజర్లుగా పని చేస్తున్నారు. వినియోగదారుల నుంచి సంస్థ డిజిటల్ విధానంలో చెల్లింపులు స్వీకరిస్తోందని గమనించిన వీరిద్దరూ కంపెనీ క్యూఆర్ కోడ్స్ మార్చేశారు. ఇస్తారా స్థానంలో ఇస్తరా, ఇస్తా పేరుతో ఉండే నకిలీ క్యూఆర్ కోడ్స్ ఏర్పాటు చేశారు. హైదరాబాద్‌లోని అవుట్ లెట్స్‌లో ఈ నకిలీ క్యూఆర్ కోడ్స్ ఉంచారు. ఈ క్రమంలో వినియోగదారులు చెల్లించిన సంస్థ సొమ్మంతా వీరిద్దరి వ్యక్తిగత ఖాతాల్లో జమయ్యేవి. ఇలా కంపెనీ సొమ్ము రూ.4.15 కోట్లు కాజేశారు. అనిల్ ఒక్కడి ఖాతాలోనే రూ.2 కోట్లు తన ఖాతాలోకి మళ్లించుకున్నాడు. ఈ సొమ్ములో రూ.40 లక్షలతో ఓ ప్లాటు, మోసానికి సహకరించిన తన సహోద్యోగాలకు రూ.70 లక్షలు, మరికొందరికి రూ.60 లక్షలు చెల్లించాడు. తన సొంత అప్పులు తీర్చుకున్నట్లు పోలీసుల విచారణలో అంగీకరించినట్లు తెలుస్తోంది. రాజ్‌కుమార్ రూ.10 లక్షల కంపెనీ సొమ్ము తన ఖాతాల్లోకి మళ్లించుకున్నాడు. ఆదాయానికి సంబంధించిన పద్దులపై సంస్థ యాజమాన్యం ఆడిట్ నిర్వహించగా ఈ మోసం వెలుగుచూసింది. ఇస్తారా పార్క్స్ ప్రతినిధి ఈవోడబ్ల్యూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితులపై చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై కేసు నమోదు చేసి విచారించిన పోలీసులు ఇద్దరు నిందితులు అనిల్, రాజ్ కుమార్‌లను అరెస్ట్ చేసి రిమాండుకు తరలించారు. కాగా, వ్యాపార సంస్థలు ఎప్పటికప్పుడు ఆర్థిక కార్యకలాపాలు పర్యవేక్షించాలని.. సీసీ కెమెరాలతో నిరంతరం నిఘా ఉంచాలని పోలీసులు సూచిస్తున్నారు.

## కానిస్టేబుల్ కిష్టయ్య కుమార్తెకు కేసీఆర్ రూ.24 లక్షలు సాయం

- 2009లో తెలంగాణ కోసం ప్రాణత్యాగం చేసిన కానిస్టేబుల్ కిష్టయ్య
- సీఎం అయ్యాక ఆయన కుటుంబాన్ని ఆదుకున్న కేసీఆర్
- కిష్టయ్య కుమార్తె ఎంబీబీఎస్ విద్యకు సాయం
- ఇప్పుడు పీజీ వైద్య విద్యకు మరోసారి ఆర్థిక సాయం



**విశ్వంభర, హైదరాబాద్:** నాడు 2009లో తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిన సమయంలో ఆమరణదీక్షకు కూర్చున్న కేసీఆర్ ను అరెస్ట్ చేయగా, ఆ మరుసటి రోజే తెలంగాణ ఉద్యమం కోసం కిష్టయ్య అనే కానిస్టేబుల్ తుపాకీతో కాల్చుకుని ఆత్మ బలిదానం చేశాడు. కిష్టయ్య మృతితో ఆయన కుటుంబం పెద్ద దిక్కులేక అలమటించింది. తన కుమార్తెను డాక్టర్ చేయాలన్నది కానిస్టేబుల్ కిష్టయ్య కల. వైద్య విద్య అంటే ఎంతో ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. ఈ నేపథ్యంలో, 2014లో తెలంగాణ ఏర్పడ్డాక సీఎం అయిన కేసీఆర్... అమర వీరుడు కానిస్టేబుల్ కిష్టయ్య కుటుంబాన్ని ఆదుకున్నారు. కిష్టయ్య కుమార్తె ప్రియాంక ఎంబీబీఎస్ వైద్య విద్యకు సాయం అందించారు. 2021లో ఎంబీబీఎస్ పూర్తి చేసిన ప్రియాంక... హౌస్ సర్జన్ విద్యను కూడా పూర్తి చేసింది. అనంతరం కరీంనగర్ జిల్లాలోని ఓ ప్రభుత్వ ఆసుపత్రిలో కాంట్రాక్టు వైద్యురాలిగా విధుల్లో చేరింది. ప్రస్తుతం ఆమెకు వైద్య విద్యలో పీజీ చేసే అవకాశం వచ్చింది. ఈ క్రమంలో కేసీఆర్ మరోమారు కానిస్టేబుల్ కిష్టయ్య కుటుంబానికి అండగా నిలిచారు. హైదరాబాద్ నంది నగర్ లోని తన నివాసానికి వచ్చిన కిష్టయ్య కుటుంబ సభ్యులను ఆత్మీయంగా ఆహ్వానించారు. పీజీ వైద్య విద్య కోసం మెడికల్ కాలేజీలో కట్టాల్సిన రూ.24 లక్షల ఫీజు చెక్కును కానిస్టేబుల్ కిష్టయ్య కుటుంబ సభ్యులకు అందించారు. తద్వారా కేసీఆర్ తన పెద్ద మనసు చాటుకున్నారు. అంతేకాదు, వారితో కలిసి భోజనం చేశారు. ఇక, కానిస్టేబుల్ కిష్టయ్య కుమారుడు రాహుల్ ఉద్యోగం చేస్తుండగా, ఆ ఉద్యోగం వివరాలను కూడా కేసీఆర్ అడిగి తెలుసుకున్నారు.

## తెలంగాణ ఏర్పాటుకు ముగ్గురు మహిళల పాత్ర కీలకం : సీఎం రేవంత్ రెడ్డి



**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడి నేటికి 10 సంవత్సరాలను పూర్తి చేసుకుంది. ఈ క్రమంలో జూన్ 2 దశాబ్ది వేడుకల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ అవతరణ దినోత్సవాలను పరేడ్ గ్రౌండ్స్ లో అట్టహాసంగా నిర్వహించింది. ఈ వేడుకల్లో అందేశ్రీ రచించిన జయ జయహే తెలంగాణ పాటను తెలంగాణ రాష్ట్ర గేయంగా సీఎం రేవంత్ జాతికి అంకితమిచ్చారు. ఈ క్రమంలో ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు కృషి చేసిన వారిని ఆయన కొనియాడారు. ఇందులో భాగంగా ప్రత్యేక తెలంగాణ బిల్లు ఏర్పాటులో ముగ్గు మహిళలు కీలక పాత్ర పోషించారని వారిలో సోనియా గాంధీ, మీరా కుమార్, సుష్మా స్వరాజ్ పాత్రలు అత్యంత ముఖ్యమైనవని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అలాగే ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు కోసం యూపీఏ చైర్ పర్సన్ సోనియా గాంధీ మొట్టమొదటి త్యాగం చేశారని గుర్తు చేశారు. అలాగే లోక్ సభ స్పీకర్ గా మీరా కుమార్ సహకారం అందించారని.. నాటి లోక్ సభలో ప్రత్యేక తెలంగాణ బిల్లుకు బీజేపీ ఎంపీ సుష్మాస్వరాజ్ సంపూర్ణ మద్దతు ఇచ్చి తెలంగాణ బిల్లును ఆమోదింపజేశారని సీఎం రేవంత్ గుర్తు చేశారు.

# ఉద్యమ రూపాలు గుర్తు చేసుకుంటే ఒళ్లు పులకరిస్తుంది

(మొదటి పేజీ తరువాయి)

చేనేత కార్మికుల ఆకలి చావులకు నెలవుగా ఉండేది. సరైన వ్యూహం లేకపోవడం వల్లే 1969 ఉద్యమం విఫలమైంది. 2001లో కాదు. 1999లోనే తెలంగాణ ఉద్యమం ప్రారంభమైంది. ఉద్యమ రూపాలు గుర్తు చేసుకుంటే ఇప్పటికీ ఒళ్లు పులకరిస్తుంది.' అని కేసీఆర్ భావోద్వేగ వ్యాఖ్యలు చేశారు.

**తెలంగాణ పాటతో పుట్టింది..**

మన భాష మాట్లాడుతుంటే నవ్వుతారో ఏమో అనుకునే స్థాయి ఆనాడు ఉండేదని కేసీఆర్ అన్నారు. గతంలో తెలంగాణ అనే పదాన్ని పలకొద్దని అప్పటి స్పీకర్ అసెంబ్లీలో అన్నారని, ఇక్కడి భాష స్వచ్ఛమైన తెలుగు కాదని కొందర హేళన చేశారని గుర్తు చేశారు. 'వలసలు పోతుంటే ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వం, నాయకులు కనీసం ఆపలేదు. స్ట్రీట్ ఫైట్ కాదు స్టేట్ ఫైట్ అయితే చేస్తా అని వచ్చా. మళ్లీ ఉద్యమం నేను మొదలుపెట్టా. అనేక పోరాటాల తర్వాత ప్రత్యేక రాష్ట్రం సాధించుకున్నాం. పాతాళంలో ఉన్న తెలంగాణను పైకి తీసుకొచ్చాం. పాటతోనే మొత్తం తెలంగాణ చరిత్ర తెలిసేది. చరణంలోనే మొత్తం తెలవాలి. అందుకే తెలంగాణ పాటతో పుట్టింది' అని కేసీఆర్ వెల్లడించారు.

**'వందశాతం మళ్ళీ బీఆర్ఎస్సే'**

ఈ గులాబీ జెండాది 25 ఏళ్ల సుదీర్ఘ ప్రస్థానం అని కేసీఆర్ అన్నారు. 'బీఆర్ఎస్ మహావృక్షం. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయాక కొంత నైరాశ్యంలో ఉన్నాం. ఆ తర్వాత నేను బస్సు యాత్ర మొదలుపెట్టగానే మళ్లీ అదే గర్జన కనిపించింది. మోకాళ్ల ఎత్తు కూడా లేనోళ్లు ఏదేదో మాట్లాడుతున్నారు. బీఆర్ఎస్ ఖతం అయితది అంటున్నారు. వందకు వంద శాతం మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం వస్తుంది. రైతు బంధు ఊరికనే ఇవ్వలేదు. స్థిరీకరణ కోసం ఇచ్చాం. చేప పిల్లలు, గొర్రెలు ఇస్తుంటే కూడా అవమానించారు. బీఆర్ఎస్ హయాంలో గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పరిపుష్టం చేశాం. ఎన్ని చేసినా కొంత విష గాలి వస్తుంది. ఆ గాలికి జనం కొంత అటు వైపు మొగ్గుచూపారు. గులాబీ జెండా పుట్టిందే తెలంగాణ రక్షణ కోసం. ప్రజలు ఏ పాత్ర ఇస్తే ఆ పాత్రలో పని చేయాలి. కరెంట్ విషయంలో ప్రభుత్వం తీరు బాధాకరం. రైతులకు విత్తనాలు గత పదేళ్లలో సక్రమంగా ఇచ్చాం. మళ్లీ ఇప్పుడు కాంగ్రెస్ హయాంలో లైన్లో నిల్చోవాల్సిన పరిస్థితి వచ్చింది. ఈ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయి. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే బీఆర్ఎస్ కు 105 అసెంబ్లీ సీట్లు వస్తాయ్. మహబూబ్ నగర్ ఎమ్మెల్సీ గెలిచాం. నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాకేష్ రెడ్డి విజయం ఖరారైంది. లోక్ సభ ఎన్నికల్లో ఎన్ని సీట్లు వచ్చినా ఇబ్బంది లేదు. నూతన ఉద్యమ పంథా అవివాహకరించాల్సిన అవసరం ఉంది. తెలంగాణ ప్రజల పరిరక్షణే ధ్యేయంగా పనిచేద్దాం' అంటూ కేసీఆర్ గులాబీ శ్రేణులకు పిలుపునిచ్చారు.



**ఎగ్జిట్ పోల్స్ గోల్ మాల్ గా మారాయి..**

మహబూబ్ నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం సాధించడం మంచి పరిణామం. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాకేష్ రెడ్డి విజయం ఖాయం. సీఎం రేవంత్ రెడ్డి సొంత జిల్లాలో బీఆర్ఎస్ గెలిచింది. ఎగ్జిట్ పోల్స్ గోల్ మాల్ గా మారాయి. బీఆర్ఎస్ పార్టీకి ఎన్ని సీట్లొచ్చినా ప్రజలతోనే ఉంటాం. రాష్ట్రాన్ని సాధించిన పార్టీ బీఆర్ఎస్. కాంగ్రెస్ వాళ్ళతో ఏం కాదు. గెలిచామన్న నమ్మకం కాంగ్రెస్ నేతల్లో లేదు. సీఎం రేవంత్ రెడ్డికి, మంత్రులకు బుద్ధిఉంటే గత ప్రభుత్వంలో ఎట్లా కరెంటు నడిచిందో అట్లా నడపమని చెప్పలేరా? ఆరు నెలల్లో ఒక్క పాలసీ ప్రకటించలేదు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో మొదటి క్యాబినెట్ లో 42 నిర్ణయాలు తీసుకున్నాం. కాంగ్రెస్ ప్రభుత్వంలో లొల్లి తప్ప ఏం లేదు. లోగో విషయంలో అందరితో మాట్లాడి నిర్ణయం తీసుకున్నాం. నేను ఒక్కడినే నిర్ణయం తీసుకోలేదు. త్వరలోనే రెండు రోజుల పాటు బీఆర్ఎస్ వార్షికోత్సవాన్ని జరుపుకుందాం ఓపిక ఉన్నంత వరకు తెలంగాణ రాష్ట్రం కోసమే పనిచేస్తానని కేసీఆర్ అన్నారు.

# బీఆర్ఎస్ ఎమ్మెల్సీ ఘన విజయం

**విశ్వంభర, మహబూబ్‌నగర్:** సీఎం రేవంత్ రెడ్డికి సొంత జిల్లాలో ఎదురుదెబ్బ తగిలింది. మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉపఎన్నికలో బీఆర్ఎస్ ఘన విజయం సాధించింది. పార్టీ అభ్యర్థి నవీన్‌కుమార్ రెడ్డి 108 ఓట్ల మెజార్టీతో విజయాన్ని కైవసం చేసుకున్నారు. మొదటి ప్రాధాన్యత ఓట్లతోనే ఆయన గెలుపొందడం విశేషం. బీఆర్ఎస్ తరపున నవీన్‌కుమార్ రెడ్డి పోటీ చేయగా, కాంగ్రెస్ పార్టీ నుంచి మన్నె జీవన్ రెడ్డి, స్వతంత్ర అభ్యర్థిగా సుదర్శన్‌గౌడ్ బరిలో నిలిచారు. ఈ పోటీకి బీజేపీ దూరంగా ఉన్నది. మొత్తం 1437 మంది ఓటు హక్కు వినియోగించుకోగా ఇద్దరు ఎంపీటీసీలు ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు. ఉమ్మడి జిల్లా స్థానిక ప్రజాప్రతినిధుల ఎమ్మెల్సీగా ఉన్న కసిరెడ్డి నారాయణరెడ్డి గత నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ మారారు. అనంతరం ఆయన కల్వకుర్తి ఎమ్మెల్యేగా గెలుపొందడంతో ఎమ్మెల్సీ స్థానం ఖాళీ అయిన విషయం తెలిసిందే. దీంతో మార్చి 28వ తేదీన ఎన్నికలు నిర్వహించారు. బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపుతో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున సంబురాలు మిన్నంటాయి. కాగా, తెలంగాణ ఆవిర్భావం రోజే బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి విజయం సాధించడం పట్ల ఆ పార్టీ శ్రేణులు సంతోషం వ్యక్తం చేస్తున్నాయి.

## తెలంగాణ తల్లి పై నాకు కాపీ రైట్ హక్కు లేదు.

# మార్చుకోవచ్చు.. అయితే!



తెలంగాణ తల్లి పై నాకు కాపీ రైట్ హక్కు లేదు. పలువురి సూచనలతో తెలంగాణ తల్లి రూపొందించబడింది. మొదట గ్రామీణ తల్లి రూపమే రూపొందించారు. అది వార పత్రికలో ముఖ చిత్రంగా వెలువడింది. మెమెంటోలకు క్యాలెండర్లకు విస్తరించింది. భరత మాత రాజ మాత. దేవతలకు రాజమాతలకు కిరీటాలున్నట్టుగానే భరత మాతకు కిరీటం ఉంది. భరత మాత ముద్దు బిడ్డ అయిన తెలంగాణ తల్లి కూడ రాజమాత కనక కిరీటం ఉండాలనే చర్చ జరిగింది. అలా రాజనీతిగా సకల హంగులతో తెలంగాణ నగలు బట్టలు మట్టెలు, కొహినూర్ వజ్రం జాకోబు వజ్రం వడ్డాణం, మక్క కంతులు, బతుకమ్మ , వెండి కడెం అన్ని తెలంగాణ సంస్కృతి చిహ్నంగా బతుకమ్మ తల్లికి ప్రతి రూపంగా సమన్వయం చేశాము. ఆకు పచ్చ చీరతో కాంతులీనిన తెలంగాణ తల్లి రూప కల్పనలో చివరి ఘట్టంలో వచ్చి ఆలె నరేంద్ర భరత మాత ముద్దు బిడ్డ కనక తెలంగాణ తల్లి చీర కూడ అదే విధంగా వుంటే బాగుందన్నారు. ఆ ప్రతిపాదన మిగతా వారు మౌనంగా ఆమోదించారు.

**తెలంగాణ తల్లి విగ్రహం పెద్దదే..**

తొలుత పెద్ద సైజు క్యాలండర్లు వేయించాను. క్యాలెండర్ లో ఉన్న విధంగా విగ్రహం కష్టం అని కొంత ఎత్తు తగ్గించి ఊరూరా ఒకే సైజు విగ్రహాలు పెట్టారు. గోదావరి ఖని బస్టాండ్ ఎదుట నేను అనుకున్న సైజులో విగ్రహం చేయించి ఆవిష్కరించారు. ఆ తరువాత తెలుగు యూనివర్సిటీ ఆవరణలో ఆ విధంగా విగ్రహం రూపొందించారు. గ్రామీణ తల్లి రూపంతో తొలి విగ్రహం బేగం పేట అనే గ్రామంలో యువకులు పెట్టారు. విజయశాంతి చేత ఆవిష్కరింప చేసారు.

**ఎవరికి తోచిన విధంగా వారికి..**

తెలంగాణ తల్లి ఫ్లెక్సీ బ్యానర్లు వేసి ప్రదర్శించినపుడు కొందరు కొన్ని అభ్యంతరాలు వెలిబుచ్చారు. మా లంబడ తల్లి లా వుండాలన్నారు. మా అమ్మ వలె వుండాలి గదనే అన్నాడు గద్దర్. రైతు బిడ్డలా వుండాలన్నారు. ఎవరికి నచ్చినట్టు వారు చిత్రించి మా తెలంగాణ తల్లి అని రాసుకోండి. కులానికొక తల్లి కూడా పెట్టుకోవచ్చు. అయితే రాజ మాతగా తెలంగాణ తల్లి ఎవరి తల్లిలా వుండదు. దేవతలలో దేవత వలె కాజకురీటంతో వెలుగొందుతుంది. తెలంగాణ తల్లి గద్దరి తల్లిలా వుండదు. పాశం యాదగిరి తల్లిలా వుండదు. ఏలె సక్ష్మణ్, వైకుంఠం, కాపు రాజయ్య వేసిన గ్రామీణ అమాయక తల్లి లా వుండదు. తెలంగాణ తల్లి ఒక రాజ మాత. మన దేవతల వలె ఒక పవిత్ర భావన కలిగే దేవతా రూపం. దేవతల బొమ్మలన్నీ 30 ఏళ్ల వయసులో నేవుంటాయి. అమృతం తాగారు కనక వారికి వృద్ధాప్యం లేదు. ఆధునిక కాలంలో కూడ 20 ఏళ్లకు పెళ్లయితే 26 ఏళ్లకు ఇద్దరు పిల్లలతు జన్మనిచ్చిన తల్లి అవుతుంది. అందువల్ల గద్దర్ తల్లిలా వుండదు , గద్దర్ కూతురు ా. ంటుంది అని వివరించాను.

భిన్నాభిప్రాయాల్లో ఇవి కొన్ని. కొందరు తెలంగాణ తల్లికి మట్టెలు మంగళ సూత్రం పెట్టారు భర్త ఎవరు అని ప్రశ్నించిన వారు లేక పోలేదు. ఎల్లమ్మ పోచమ్మ మొదలైన మాతృ దేవతలకు పూజలు చేస్తాము. తెలంగాణ తల్లి కూడ ఒక మాతృదేవత. మన బతుకమ్మ నెత్తకున్న మన తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక అని చెప్పడం జరిగింది.

**ఇది ఇక్కడితో ఆగిపోతుందా..?**

తెలంగాతల్లిని మార్చు కోవాలంటున్నారు. ఇది ఇక్కడితో ఆగి పోతుందనుకోకూడదు. తల్లులను ఎప్పటికప్పుడు మార్చుకునే సంస్కృతికి బీజం వేసిన వారవుతారు. తన తల్లి రూపం బాగా లేదని పిల్లలు భావించి తమ తల్లిని మార్చుకోవాలనే ఆలోచన కలిగితే ఆ తల్లి మనసు ఎంత క్షోభిస్తుందో! అది ఎక్కడికి దారి తీస్తుందో! తెలంగా తల్లి ఇపుడొక అమూర్త భావన కాదు. నిర్దిష్ట రూపంతో వెలసిన తల్లి అని మరిచి పోరాదు. తెలంగాణ తల్లి రూపం మార్చాలనే ఆలోచన రాజకీయంగా విపక్షాలకు ఉద్యమాలు చేయడానికి ఆయుధాలు అందించిన వారవుతారు. కిరీటం తొలగిస్తే రాజ్యాధికారం పడి పోయిన తల్లిగా కనిపించవచ్చు. రూపం మార్చితే మా తల్లి వలె లేదనే వారు ఆందోళన చేయ వచ్చు. తల్లి అనే సెంటుమెంటు తో కూడుకున్న వ్యవహారం. పాత విగ్రహాలు తొలగిస్తే అంబేద్కర్ విగ్రహం ను అగౌరవ పరిస్తే కదిలినట్టు ప్రజలు పెద్ద ఎత్తున విరుచుక పడవచ్చు. చేయ వలసిన అర్జంటు పనులెన్నే వున్నాయి. వాటన్నిటిని వ్యాసాల్లో లేఖల్లో సూచించాను. నిరద్యోగ సమస్య, శిథిలమవుతున్న విద్యారంగం, గ్రామీణులకు స్థానికంగా ఉపాధి కల్పన వంటి వాటి పై కృషి చేసి ప్రజల మన్నన పొందడం అవసరం. విషయాలు వివరించాను. ముందే చెప్పినట్టు తెలంగాణ తల్లి నాకు కాపీ రైట్ హక్కు లేదు. తెలంగాణ తల్లి మనందరి తల్లి. ఎలా ఉన్నా తల్లి తల్లే.



- బి. ఎస్.రాములు
బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, తెలంగాణ
ఫోన్ : 8331966987

## బీపీటీ ధాన్యానికి రూ.1000 బోనస్‌ను

# వెంటనే ప్రకటించాలి



సన్న రకం (BPT)ధాన్యానికి రూ.1000 బోనస్‌ను వెంటనే ప్రకటించడంతోపాటు రాష్ట్రంలోని పేద ప్రజలందరికీ సన్న బియ్యం ఉచితంగా అందించేందుకు ప్రణాళికలు రూపొందించాలని సమాచార హక్కు వికాస సమితి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తుంది.

రాష్ట్ర ప్రభుత్వం అర్హులందరికీ చౌక ధరల దుకాణాల ద్వారా సన్న బియ్యాన్ని అందజేయడం నెరవేరాలంటే సన్న రకం ధాన్యానికి క్వింటాల్ కు రూ.1000 బోనస్ ప్రకటించడం ద్వారా సన్న రకం ధాన్యం సాగు విస్తీర్ణం పెరుగుతుంది. తద్వారా చౌకధరల దుకాణాల్లో సన్న బియ్యం పంపిణీ సాధ్యమవుతుంది.

ప్రస్తుతం దొడ్డు రకం బియ్యాన్ని ఎక్కువ మంది వినియోగించడం లేదు. మళ్ళీ ఆ బియ్యం రీసైక్లింగ్ అవుతున్నవి. అక్రమాలను ఆపేందుకు ఎన్నో ఇబ్బందులు తప్పడంలేదు. కాబట్టి పేదలందరికీ సన్న బియ్యం పంపిణీ చేయాలి.

సన్న బియ్యం ఇవ్వాలంటే సన్న రకం దాన్యం పండించే రైతులకు ప్రోత్సహించాలి. రైతులకు సన్న ధాన్యంలో మేలు రకాలను ఎంపిక చేసి విత్తనాలు సబ్సిడీలో అందించాలి. అదేవిధంగా పంటకు మద్దతు ధర ఇవ్వడంతో పాటు క్వింటాలుకు కనీసం వెయ్యి రూపాయల బోనస్ ఇవ్వాలి.

తద్వారా రైతులకు సన్నధాన్యాన్ని పండించడానికి ఆసక్తి పెరుగుతుంది. సన్యాధాన్యాన్ని ప్రభుత్వం సేకరించి సీఎంఆర్ ద్వారా మిల్లింగ్ చేసి రాష్ట్రంలోని పేదలకు సన్నబియ్యం అందజేయడం సులభమవుతుంది. సన్న రకం ధాన్యానికి బోనస్ ఇవ్వడం ద్వారా ప్రభుత్వంపై అధిక భారం పడుతుంది అనుకుంటే.. ఒక క్వింటాలు ధాన్యాన్ని మిల్లింగ్ చెయ్యడం ద్వారా మిల్లర్ 65 కేజీల బియ్యం ప్రభుత్వానికి మిల్లర్ ఇవ్వడం జరుగుతుంది. అంటే అదనంగా వెయ్యి ఖర్చుతో 65 కిలోల సన్న బియ్యం వస్తాయి. ప్రస్తుతం కేజీ సన్న బియ్యానికి మార్కెట్లో ప్రస్తుతం 60 రూపాయల వరకు ధర ఉంది. చౌకధరల దుకాణాల ద్వారా ప్రస్తుతం రేషన్ బియ్యం కిలో ఒక రూపాయికి ఇస్తున్నారు. దీనిని సవరించి ప్రభుత్వం రైతులకు ఇచ్చిన క్వింటాలుకు 1000 రూపాయలు బోనస్ ఇవ్వడం ద్వారా భారం పడకుండా సన్న బియ్యాన్ని కిలోకు 1+15=16 రూపాయలు, లేదా కిలో 20 రూపాయలకు ఇచ్చిన పేదలు 20 రూపాయలు చెల్లించి సన్న బియ్యం సంతోషంగా తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నారు. ధర విషయంలో అభ్యంతరం ఉన్న వారికి యథావిధిగా దొడ్డు రకం బియ్యాన్ని ప్రస్తుతం ఇస్తున్న రూపాయికి కిలో ఇవ్వండి. సన్న రకం బియ్యాన్ని కిలో రూ.20కు ఐనా ప్రజలందరూ సంతోషంగా వినియోగించుకుంటారు.

ప్రతి ప్రభుత్వ పథకం ప్రధాన లక్ష్యం పేదలకు లబ్ధి చేకూరాలి. కాబట్టి చౌకధరల దుకాణాల ద్వారా ప్రస్తుతం ప్రజలకు ఇస్తున్న దొడ్డు బియ్యాన్ని తగ్గించి, సన్నా రకం బియ్యాన్ని ఇచ్చేందుకు పాలకులు దృష్టి పెట్టాలని కోరుతున్నాం.

ప్రస్తుత ప్రభుత్వం సీఎంఆర్ విషయంలో చర్యలకు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న తరుణంలో ఈ విషయంపై ప్రభుత్వం, ప్రజలందరూ చర్చ చేయాలి. నచ్చినవారు పాలకులకు, సంబంధిత శాఖల అధికారులకు రిపోర్టులను ప్రభుత్వానికి అందజేసేలా పాలకులు సానుకూల ఆదేశాలు జారీ చేయాలి. ప్రజల మేలు కోసం, ప్రజా ధనం రక్షణ కోసం కోరుతున్నాం.



- డాక్టర్ యర్రమాద కృష్ణారెడ్డి,
ఎంఏ, ఎంసీజే, ఎల్ఎల్బీ
సమాచార హక్కు వికాస సమితి
వ్యవస్థాపక అధ్యక్షుడు
ఫోన్ : 99496 49766

## ప్రపంచంలోనే అతిపెద్ద బ్యాంకుగా

# ఎస్‌బీఐ

**'భారతీయ స్టేట్ బ్యాంకు లేదా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా భారత దేశంలోనే అతిపెద్ద బ్యాంకు. బ్రాంచీల సంఖ్య, పనిచేయు సిబ్బంది ప్రకారం ఇది ప్రపంచంలోనే అతిపెద్ద బ్యాంకు. 1806లో కోల్‌కతలో స్థాపించబడిన ఈ బ్యాంకు భారత ఉపఖండంలోనే పురాతనమైన బ్యాంకుల్లో ఒకటి. ఈ బ్యాంకు దేశీయ, అంతర్జా తీయ, ప్రవాస భారతీయ సేవలను అందిస్తుంది. 1955లో భారత ప్రభుత్వం ఈ బ్యాంకును జాతీయం చేసి తన అధీనంలోకి తీసుకుంది. ఇటీవల కాలంలో స్టేట్ బ్యాంకు రెండు ప్రధాన చర్యలను చేపట్టింది... పనిచేయు సిబ్బంది సంఖ్యను కుదించడం, రెండవది కంప్యూటరీకరణ.**




స్టేట్ బ్యాంకు 21 జూన్, 1806న కలకత్తా బ్యాంకు స్థాపన గావించగా, 21 జనవరి, 1809న బ్యాంక్ ఆఫ్ బెంగాల్‌గా మార్పు చేశారు. 15 ఏప్రిల్, 1840న బ్యాంక్ ఆఫ్ బాంబే స్థాపన, 11 జూలై, 1843న బ్యాంక్ ఆఫ్ మద్రాస్ స్థాపన గావించారు. 27 జనవరి, 1921న మూడు బ్యాంకులను కలిపి ఇంపీరి యల్ బ్యాంకుగా మార్పు గావించారు. గోరేవాలా కమిటీ సిఫార్సు మేరకు ఇంపీరియల్ బ్యాంక్ 1955లో జాతీయం చేయబడింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాగా పేరు మార్చబడింది.

11 జూలై, 1955న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్థాపన (జాతీయం చేయబడిన తొలి బ్యాంకు), 1959లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అనుబంధ బ్యాంకుల చట్టం జారీ కాగా 8 పూర్వపు రాష్ట్ర అనుబంధ బ్యాంకులను వాటి శాఖలను తన అధీనంలోకి తెచ్చుకుంది. 1980 కేరళలో బ్యాంక్ ఆఫ్ కొచ్చిన్ ఆర్థిక ఇబ్బందిలో ఉన్నప్పుడు దానిని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో విలీనం చేశారు. 29 జూన్, 2007న స్టేట్ బాంకులో ఉన్న మొత్తం రిజర్వ్ బ్యాంకు షేర్ హోల్డింగ్‌ను స్వాధీనం చేసుకుంది. భారతీయ స్టేట్ బ్యాంకుకు గతంలో 7 అనుబంధ బ్యాంకులు ఉండేవి. అవన్నీ సాధారణంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ... అనే పేరుతో ప్రారంభమై చివరన ఆయా బ్యాంకుల ప్రధాన స్థావరం ఉన్న నగరాల పేర్లతో అంతమౌతుంది. ఇవి 1959లో జాతీయం చేయడానికి ముందు ఆయా సంస్థాన రాజ్యాలకు చెందినవి. మొదటి పంచవర్ష ప్రణాళికలో గ్రామీణాభివృద్ధి లక్ష్యాన్ని సాధించుటకు ప్రభుత్వం ఈ బ్యాంకులన్నింటినీ కలిపి స్టేట్ బ్యాంక్‌గా మార్పు చేసింది. ఈ బ్యాంకులన్నింటికీ ఒకే లోగో ఉంటుంది. స్టేట్ బ్యాంక్ ను ఇవన్నీ మాతృ సంస్థగా పరిగణిస్తాయి. 2008 లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ సౌరాష్ట్ర, 2009 లో స్టేట్ బ్యాంక్ ఇండోర్ మాతృసంస్థ లో విలీనం అయ్యాయి. మిగిలిన 5 అనుబంధ బ్యాంకులు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ బికనూర్ & జైపూర్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాదు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండోర్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ మైసూర్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ పాటియాలా, స్టేట్ బ్యాంకు ఆఫ్ సౌరాష్ట్ర, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ట్రావెంకోర్ 2016 లో విలీనమయ్యాయి.

విదేశాలలో ...ఆస్ట్రేలియా, ఇజ్రాయెల్, ఆస్ట్రేలియా, బహరీన్, బంగ్లాదేశ్, బెల్జియం, కెనడా, దుబాయ్, ఫ్రాన్స్, జర్మనీ, హాంగ్‌కాంగ్, ఇజ్రాయెల్, జపాన్, చైనా, మాల్దీవులు, సింగపూర్, దక్షిణాఫ్రికా, శ్రీలంక, ఓమన్, బహమాస్, ఇంగ్లాండు, అమెరికా లాంటి దేశాల్లో ఎస్‌బీఐ సేవలు అందిస్తున్నది. విలీనం తర్వాత ఎస్‌బీఐ సంస్థ క్రింద ఇప్పుడు 23000 కంటే ఎక్కువ శాఖలను, 2,70,000 కంటే ఎక్కువ మంది ఉద్యోగులను కలిగి ఉంది. ఎస్‌బీఐ డిపాజిట్ కూడా 26 లక్షల కోట్లకు పెరిగింది. ముంబై ప్రధాన కార్యాలయం ద్వారా స్టేట్ బ్యాంకు 36 రాష్ట్రాలు/కేంద్రం పాలిత ప్రాంతాల్లో 29236 శాఖలను కలిగి ఉంది. 63వేల ఏటీఎంల సౌకర్యంతో 316,021.20 కోట్ల ఆదాయాన్ని కలిగి ఉంది. ప్రత్యక్షంగానే గాక ఆన్ లైన్ ద్వారా సమర్థ వంతంగా సేవలను అందిస్తోంది.

## మెరుగైన వైద్యం

# ప్రజలందరి హక్కు



**కొన్ని దశాబ్దాలుగా గ్రామీణ వైద్యం పేరుతో తెలంగాణలో వైద్యంలో జరిగిన దోపిడీని అరికట్టే విధంగా తెలంగాణ రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ తీసుకుంటున్న చర్యలు వారికి సహకరిస్తున్న ఐఎంఏ, హెచ్ఆర్డీఏ లాంటి సంఘాలనుచూసి ఒక సగటు వైద్యుడిగా గర్వపడుతున్నాను. వైద్యం అంటే ఒక నాలుగు ఇంజెక్షన్లు, ఒక సెలైన్ బాటిల్ ఇవ్వడం కుట్లు వేయడం కాదు. వైద్యం అంటే రోగి లక్షణాలు పట్ల అవగాహన, వారిని పరీక్షించే నైపుణ్యం, అవసరమైన టెస్ట్ లు చూసి రోగం నిర్ధారించిన తరువాత చికిత్స చేయడం, చికిత్స వల్ల వచ్చే కాంప్లికేషన్స్ మీద కూడా అవగాహన వుండి వాటిని నివారించడం లేక ఎదుర్కోవడం సరైన వైద్యం. ఇది కనీసం MBBS ఆ పైన క్వాలిఫికేషన్ వున్న డాక్టర్లు మాత్రమే చెయ్యవలసిన పని.**

ఏదో ఒక డాక్టర్ దగ్గర చీటీలు రాస్తూ సూదులు వేస్తూ నాలుగు మందుల పేర్లు బట్టి పట్టి, వాటినే ప్రతి రోగిపై ప్రయోగించి, వాటి వల్ల వొచ్చే దుష్ప్రభావాలను కూడా సొమ్ము చేసుకోవడం అర్హత లేని కొందరు చేస్తున్న వైద్యం, వైద్య సేవ ఎలా అవుతుంది.

**గ్రామీణ వైద్యులుగా చెలామణి అవుతున్న కొందరు దళారులు పదే పదే చెప్పే మాటలు**

**1) మేము గ్రామీణ ప్రాంతాల్లో అందుబాటులో వుంటాము..**

కానీ వాస్తవానికి ఈ రోజు వీరు గ్రామీణ ప్రాంతాల్లో కాదు టౌన్స్ సిటీస్ లో కూడా విస్తరించారు. పేద ప్రజలను, అమాయకులను టార్గెట్ చేసుకొని వారి ముందు డాక్టర్ అని పెట్టుకుంటూ అశాస్త్రీయమైన వైద్య విధానాలను, చికిత్సలు ట్రీట్మెంట్ చేస్తూ అడ్డగోలుగా సంపాదిస్తున్నారు. వీరు ప్రభుత్వ హాస్పిటల్స్ మీద విషప్రచారం చేసి పేద ప్రజల్ని ప్రభుత్వ వైద్యానికి దూరం చేస్తున్నారు, వీరికి అధికంగా కమిషన్ ఇచ్చే ప్రైవేటు హాస్పిటల్స్ కు రోగులకు సిఫార్సు చేస్తూ వైద్యాన్ని దందాగా నడుపుతున్నారు. ఇది సమాజానికి ఏ మాత్రం మంచిది కాదు..

**2) మేము సేవ చేస్తున్నాం అని చెప్పే ఏ గ్రామీణ వైద్యుడు ఉచితంగా వైద్యం చేయడు,**

రోగిని పరీక్షించడానికి ఫీజు మాత్రం తీసుకోరు. కానీ రోగి యొక్క రోగం నిర్ధారణకు రకరకాల పరీక్షలు అని, మందులు అని డబ్బులు వసూలు చేస్తారు. వారు సరైన మందులు ఇవ్వక పోవడంతో రోగం తగ్గక పోతే.. వారికి అత్యధికంగా 40 శాతం వరకు కమిషన్ ఇచ్చే ప్రైవేటు హాస్పిటల్స్ లో చేర్పించి వేల రూపాయలు కమిషన్లు పొందుతున్నారు. వైద్యులు గతి లేక హాస్పిటల్ నిర్వహణ భారాన్ని మోయలేక ఈ దళారులు చెప్పినట్టు వింటారు.

**3) మేము గ్రామీణ ప్రాంతాల్లో ఎమర్జెన్సీ చికిత్స చేస్తాం..**

అసలు ఎమర్జెన్సీ అంటే ఏమిటి, ఎమర్జెన్సీలో ఏమి చేయాలి, ఎలా రోగాన్ని పసిగ్గటాలి, ఎలా వైద్యం చేయాలి, ఇవేమీ తెలియకుండా ఎమర్జెన్సీ మేనేజ్ చేస్తారా? అసలు ఎమర్జెన్సీలో రోగి వద్ద నైపుణ్యం కలిగిన డాక్టర్ ఉండాలి. కానీ కనీస అర్హత లేని వీరి వద్ద కాదు. వీరు ఎమర్జెన్సీ పేరుతో గుండెపోటును గ్యాస్ నొప్పి అనుకొని గ్యాస్ ఇంజెక్షన్ లు ఇవ్వడం అపెండిక్స్, పేగుకు చిల్లు అని, సాధారణ కడుపు నొప్పి అని నొప్పి తగ్గడానికి కొన్ని సూదులు ఇవ్వడం, జ్వరం వచ్చినపుడు స్టెరాయిడ్స్ ఇవ్వడం లాంటివి చేస్తారు. వాటి వల్ల రోగం ముదిరిపోవడమో లేక ప్రాణాలు పోవడమో జరుగుతుంది.

**4) మేము భ్రూణ హత్యలను నివారిస్తున్నాం అని చెప్పడం**

ఇది పచ్చి అబద్ధం, గర్భిణులను స్కానింగ్ కు పంపి ఆ స్కానింగ్ చేసే డాక్టర్ ను ప్రభావితం చేసి, డబ్బుల అశజూపి, సెక్స డిటర్మినేషన్ చేసి ఇల్లీగల్ అబార్షన్ లు చేసే వ్యవస్థ నడుపుతున్నారు. తెలంగాణ రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ (TSMC) చేస్తూన్న తనిఖీలో ఈ దారుణాలు ఎన్నో వెలుగు చూసాయి. సాక్ష్యాలతో సహా వున్నాయి.. ఇంకా బుకాయింపులు ఆపాలి..

వీరు ఎలాంటి అవసరం లేకుండా ఇచ్చే యాంటి బయాటిక్స్ (antibiotics) వల్ల మొండి ఇన్ఫెక్షన్ లు ప్రబాలుతున్నాయి. వీరు ఇచ్చే నొప్పి తగ్గించే సూదులు వల్ల రోగుల కిడ్నీలు పాడవుతున్నాయి. స్టెరాయిడ్స్ వల్ల అనేక దుష్ప్రభావాలు కలుగుతున్నాయి.

**మరి ఇన్ని సంవత్సరాలుగా వైద్య శాఖ ఏం చేస్తుంది..**


సాక్షాత్తు జిల్లా అధికారులు వారి మీటింగ్ లకు ముఖ్య అతిథులుగా హాజరైవారికి సలహాలు ఇచ్చి పూర్తి అండగా వుంటారు. వైద్య విధానంలో పాటించే నియమ నిబంధనలు, అర్హత గల వారితో హాస్పిటల్స్ నడపాలని ఆదేశాలు ఇవ్వరు. రాజకీయ నాయకుల వొత్తిడులకు, డబ్బు ప్రభావానికి లోనవుతూ.. చర్యలు తీసుకోవడంలో శ్రద్ధ పెట్టడం లేదు. అర్హత గల వైద్యుల్ని ఎన్నో వొత్తిడిలకు గురి చేసి వారికి నచ్చిన విధంగా, తప్పనిసరిగా వారు కోరిన శాతాన్ని కమిషన్ ఇచ్చేలా చేస్తున్నారు.

**ఇపుడు సగటు పౌరుడు తెలుసుకోవాల్సింది ఒకటే..**

గ్రామీణ పట్టణ ప్రాంతం భేదం లేకుండా ప్రతి పౌరుడికీ నాణ్యమైన వైద్యం అందించే బాధ్యత ప్రభుత్వానిది, వైద్యుడిది కాదు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సంఖ్య పెంచడం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో డాక్టర్లు అందుబాటులో వుండడం. డాక్టర్ల సంఖ్య పెంచడం వంటి నిర్ణయాలు తక్షణమే ప్రభుత్వాలు తీసుకోవాలి.. మా ఈ పోరాటం మా బ్రతుకు కోసం కాదు.. ప్రతీ పౌరుడికి నాణ్యమైన వైద్యం అందాలనేది మా ప్రధాన లక్ష్యం.

**దళారిలు లేని వైద్య వ్యవస్థ..**

దానికోసం ఎంత తీవ్రమైన పోరటానికైన సిద్ధంగా ఉన్నాం. మెరుగైన వైద్యం, తక్కువ ధరలకే వైద్య చికిత్సలు అందాలని కోరుకునే ప్రతి పౌరుడు వైద్యం పై, వైద్య విధానాలు, నూతన పద్ధతులు స్పెషలైజేషన్ విధానాలపై కొంత అవగాహన పెంచుకోవాలి. అర్హత గల డాక్టర్లతో వైద్యం చేయించుకోవాలి. అర్హత లేని డాక్టర్లపై, అనుమతులు లేని, నిబంధనలు పాటించని హాస్పిటల్స్ పై అధికారులకు ఫిర్యాదులు చెయ్యాలి. మెరుగైన, తక్కువ ఫీజులకు వైద్యం అందించే హాస్పిటల్స్ గురించి తెలుసుకొని అవగాహనతో వైద్యం చేయించుకోవాలని కోరుతున్నాం.



- డాక్టర్ జూకూరు శ్రీకాంత్ వర్మ
(ఎంబీబీఎస్, ఎంస్) టీఎస్ఎంసీ సభ్యుడు,
తెలంగాణ ఫారెన్ మెడికల్ గ్రాడ్యుయేట్
కమిటీ చైర్మన్

# ఎమ్మెల్సీ ఉపఎన్నికలో బీఆర్ఎస్ గెలుపుపై హర్షం



## ఆయా నియోజకవర్గాల్లో సంబురాల్లో బీఆర్ఎస్ నాయకులు

**విశ్వంభర, నారాయణఖేడ్/షాద్‌నగర్ జూన్ 2:** మహబూబ్ నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నియోజకవర్గం ఉప ఎన్నికలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి నవీన్‌కుమార్ రెడ్డి గెలుపొందడంపై ఎంపీపీ జంగం శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీపీ మాట్లాడు తూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిపై 111 ఓట్లతో గెలుపొం దడం సంతోషకరమని, తెలంగాణాలో బీఆర్ఎస్ పార్టీ మరిన్ని విజయాలు సాధిస్తుందని, ప్రజలంతా బీఆర్ ఎస్ వైపే ఉన్నారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు జంగం రాఘవులు, మాజీ సర్పంచ్ గజవాడ నర్సింలు, నాయకులు యాకుబ్. పండరి, వెంకయ్య తదితరులున్నారు.



### నవీన్‌రెడ్డికి షాద్‌నగర్‌లో ఘన స్వాగతం

రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లో ఎమ్మెల్సీగా గెలుపొందిన నాగర్ కుంట నవీన్ రెడ్డికి షాద్‌నగర్ ముఖ్య కూడలిలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ పూలమాలతో పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. నవీన్‌రెడ్డి సొంత నియోజకవర్గం షాద్‌నగర్ కావడంతో అభిమానుల సందడి నెలకొంది. షాద్ నగర్ ముఖ్య కూడలికి ఆయన అంబేడ్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు.

### 24వార్డులో సంబురాలు

ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి గెలుపు బీఆర్ఎస్‌కు మరింత బలాన్ని ఇస్తుందని 24వార్డు కౌన్సిలర్ రేటికల్ నందీశ్వర్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ ఉపఎన్నికలో నవీన్ రెడ్డి గెలుపుతో వార్డులో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు సంబురాలు ఘనంగా చేసుకున్నారు.

### జ్యోతిరావు పూలే, అంబేద్కర్ లకు ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డి నివాళి

షాద్‌నగర్ నియోజకవర్గంలోని కొత్తూరులో నవీన్ చారి, బీఆర్ఎస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు జంగ గళ్ళ శివకుమార్, సిటీ కేబుల్ వెంకటేష్, బండి శ్రావణ్, తుప్పర రవి, కృష్ణ, అనిల్, సాగర్, ఉదయ్, చరణ్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.





### బీఆర్ఎస్ నాయకుల సంబురాలు

**విశ్వంభర, ఆమనగల్లు జూన్ 2:** ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ ఘన విజయం సాధించింది. సమీప కాంగ్రెస్ అభ్యర్థి జీవన్ రెడ్డి పై బీఆర్ఎస్ అభ్యర్థి నవీన్ కుమార్ రెడ్డి 111 మొదటి ప్రాధాన్యత ఓట్ల తో ఘనవిజయం సాధించి ఎమ్మెల్సీ స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. ఎమ్మెల్సీ ఎన్నికతో బీఆర్ఎస్ శ్రేణుల్లో ఉత్సాహం రెట్టింపైయింది. ఇదివరకు ఉమ్మడి మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీగా కసిరెడ్డి నారాయణరెడ్డి టీఆర్ఎస్ పార్టీ నుంచి గెలుపొందారు. అయితే కసిరెడ్డి సార్వత్రిక ఎన్నికల్లో కల్వకుర్తి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యేగా గెలుపొందిన విషయం తెలిసిందే. అయితే ఇటీవలే ఈ ఎమ్మెల్సీ స్థానంలో ఉప ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికలకు ఈరోజు లెక్కింపు జరిగింది. 111 ఓట్ల ఆధిక్యతతో బీఆర్ఎస్ అభ్యర్థి నవీన్ కుమార్ రెడ్డి ఘన విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో ఓట్లు వేసిన ప్రతి ఒక్కరికి అభినందిస్తూ, ఈ ఎన్నికల కోసం కష్టపడి పనిచేసిన కార్యకర్తలను అభిమానులను అందరికీ గ్రామీణాభివృద్ధి స్టాండింగ్ కమిటీ జిల్లా సభ్యులు, కడ్తాల్ మండల జడ్పీ జర్పుల దశరథ్ నాయక్ ధన్యవాదాలు తెలిపారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించి టపాకులను పేల్చారు.

## ప్రత్యేక రాష్ట్రంతో ప్రజల ఆకాంక్ష నెరవేరింది


• సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షుడు జగపతిరావు



**విశ్వంభర, మహబూబ్ నగర్:** ప్రత్యేక రాష్ట్ర సాధనతో తెలంగాణ ప్రజల ఆకాంక్ష నెరవేరిందని, ఇంకా ఎంతో అభివృద్ధి సాధించుకోవాల్సిఉందని సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షుడు జగపతిరావు అన్నారు. తెలంగాణ ఆవిర్భావ శతాబ్ది దినోత్సవ సందర్భంగా ఆదివారం స్థానిక సీనియర్ సిటిజన్ ఫోరం కార్యాలయం ముందు జాతీయ జెండాను ఆవిష్కరించి ఆయన ప్రసంగించారు. తెలంగాణ ప్రజల అస్తిత్వానికి ముప్పు ఏర్పడినప్పుడు ప్రజల ఆక్రోశం హింసాత్మకంగా మారి సమాజ మనుగడను ప్రశ్నించినందునే ఉద్యమ పరిస్థితులు నెలకొన్నాయని ఆయన అన్నారు. శాంతియుత మార్గాన సాధించుకున్న తెలంగాణ పుష్టిగా ఉన్న అభివృద్ధి వనరులను ఉపయోగించుకొని దేశంలోనే అత్యున్నత స్థాయికి ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నస్కంటి నాగభూషణం,రాజసింహుడు, బాల కృష్ణ, అక్కినేని నారాయణరావు, సిద్ధిరామప్ప, జి.నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

## రాచకొండ సీపీ కార్యాలయంలో రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు

**విశ్వంభర, మల్కాజిగిరి :** తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాచకొండ కమిషనరేట్ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సీపీ తరుణ్ జోషి రాచకొండ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ప్రజల పోరాటాలు, ఆకాంక్షలకు అనుగుణంగా స్వరాష్ట్రం ఏర్పడిందని, ప్రత్యేక రాష్ట్ర పోరాటాన్ని తాను స్వయంగా చూశానని పేర్కొన్నారు. ఈ పదేళ్లలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసుశాఖలో ఎన్నో నూతన కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని పేర్కొన్నారు. మౌలిక వసతుల కల్పన తో పాటు సిబ్బంది నియామకం, శిక్షణ తరగతులు, సమర్థవంతమైన విధానాల ద్వారా నేరశాతం తగ్గిందన్నారు. పోలీసు శాఖలోని అన్ని విభాగాల అధికారులు మరియు సిబ్బంది కలిసికట్టుగా పని చేస్తూ ఉండడం వల్లే రాష్ట్రం ప్రశాంతంగా ఉందన్నారు. పోలీసుల కృషి వల్లే లోక్ సభ ఎన్నికలతో పాటు రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు కూడా ప్రశాంతంగా జరిగాయని అభినందించారు. కార్యక్రమంలో డీసీపీ అడ్మిన్ ఇందిర, ఏసీపీలు పోలీసు అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



## సల్మాన్ ఖాన్ హత్య కుట్ర కేసులో ఐదో నిందితడు .అరెస్ట్

**విశ్వంభర, సినిమా :** బాలీవుడ్ స్టార్ సల్మాన్ ఖాన్ హత్య కుట్ర కేసులో మరో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. దీంతో, అరెస్ట్ చేసిన నిందితుల సంఖ్య ఐదుకు చేరింది. బిష్ణోయ్ గ్యాంగ్ కు చెందిన దీపక్ గొగాలియా అలియాస్ జానీ వాల్మీకిని రాజస్థాన్‌లో పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో ఇటీవలే బిష్ణోయ్ గ్యాంగ్ కు చెందిన నలుగురిని ముంబై పోలీసులు అరెస్టు చేశారు. గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్, అతడి సోదరుడు అన్మోల్, మరో గ్యాంగ్‌స్టర్ గోల్డీబ్రార్ సహా 17మందిపై కేసు నమోదు చేశారు. ముంబైలోని బాంద్రాలో సల్మాన్ ఇంటి దగ్గర ఈ ఏడాది ఏప్రిల్‌లో కాల్పుల ఘటన తీవ్ర కలకలం సృష్టించింది. అయితే, ఈ కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు, మరో హత్య కుట్ర గురించి తెలిసింది. సల్మాన్ ఖాన్ కారుపై ఏకే-47 తుపాకులతో దాడి చేసేందుకు బిష్ణోయ్ గ్యాంగ్ ప్లాన్ చేసినట్లు సమాచారం అందింది. ఇందుకోసం బిష్ణోయ్ గ్యాంగ్ పాకిస్థాన్‌కు చెందిన ఓ వెపన్స్ సప్లయిర్ నుంచి తుపాకులు కొనుగోలు చేసినట్లు పోలీసు వర్గాల తెలిపాయి. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి పన్వేల్‌లోని సల్మాన్ ఫామ్‌హౌస్ పరిసర ప్రాంతాల్లో బిష్ణోయ్ గ్యాంగ్‌కు చెందిన వ్యక్తులు రెక్కీ నిర్వహించినట్లు దర్యాప్తులో తేలింది. సల్మాన్ కదలికలను ఎప్పటికప్పుడు చేరవేసేందుకు 60-70 మంది నిత్యం రెక్కీ నిర్వహిస్తున్నట్లు పోలీసు వర్గాలు తెలిపాయి.

## కిష్టయ్య కుటుంబానికి అండగా మాజీ సీఎం కేసీఆర్

**విశ్వంభర, హైద్రాబాద్ 2 :** తెలంగాణ కోసం ప్రాణాలను అర్పించిన అమరుడు కానిస్టేబుల్ కిష్టయ్య కుటుంబానికి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మరోసారి అండగా నిలిచారు. కిష్టయ్య ప్రాణ త్యాగంతో కుటుంబ పెద్దను కోల్పోయిన కుటుంబానికి నేనున్నానని ఆనాడే మాట ఇచ్చిన కేసీఆర్, ఇచ్చిన మాటను నిలుపుకుంటూ వస్తున్నారు. కానిస్టేబుల్ కిష్టయ్య కూతురు వైద్య విద్య కోసం కేసీఆర్ ఆర్థిక సాయం చేశారు. ఎంబీబీఎస్ చదివించిన కేసీఆర్ పీజీ కోర్సుకు కూడా ఆర్థిక మద్దతు నిచ్చారు. నాడు ఎంబీబీఎస్ పూర్తి చేసుకున్న కిష్టయ్య కూతురు ప్రియాంక ఇప్పుడు పీజీ చదువుతున్నది. అందుకు మెడికల్ కాలేజీలో కట్టాల్సిన ఫీజు కోసం కావలసిన 24 లక్షల రూపాయల చెక్కును నేడు నందినగర్ లో కిష్టయ్య కుటుంబానికి కేసీఆర్ అందించారు. అనంతరం వారితో కలిసి భోజనం చేశారు. అమ్మను కష్ట పెట్టకుండా చూసుకోండని కిష్టయ్య పిల్లలకు బాధ్యత గుర్తు చేసిన కేసీఆర్.





## ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ స్మృతులను గుర్తు చేసుకున్న మాజీ పార్లమెంట్ సభ్యులు

**విశ్వంభర, హైదరాబాద్ జూన్ 2 :** తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని మినిస్టర్స్ క్వార్టర్స్ లోని రవాణా శాఖ మంత్రి శ్రీ పొన్నం ప్రభాకర్ నివాసంలో ఆదివారం మధ్యాహ్నం కాంగ్రెస్ పార్టీ మాజీ పార్లమెంట్ (2009లో) సభ్యుల ఆత్మీయ కలయిక కార్యక్రమం జరిగింది. సమావేశానికి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జి దీపాదాస్ మున్షి, అప్పటి పార్లమెంట్ సభ్యులైన ప్రస్తుత శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, టీపీసీసీ క్యాంపెయిన్ కమిటీ చైర్మన్ మధుయాష్కి గౌడ్, ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, జి వివేక్, అంజన్ కుమార్ యాదవ్, సురేష్ షెట్కర్, సిరిసిల్ల రాజయ్య హాజరయ్యారు.కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ సభ్యులుగా ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పార్లమెంట్ లోపలా, బయటా చేసిన తమ పోరాట స్మృతులను వారు నెమరేసుకున్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఇవ్వాలని పార్టీ అధినేత్రి సోనియాగాంధీతో పాటు పార్టీ అధిష్టాన పెద్దలను ఒప్పించి.. రాష్ట్రాన్ని సాధించే వరకు పోరాడిన తీరుని గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ అందరిని ప్రత్యేకంగా సన్మానించారు.

## ట్యాంక్ బండ్ వద్ద వైభవంగా ఆవిర్భావ వేడుకలు

**విశ్వంభర, హైదరాబాద్ :** ట్యాంక్ బండ్ వద్ద తెలంగాణ ఆవిర్భావ వేడుకలు వైభవంగా జరిగాయి. ట్యాంక్ బండ్ వద్దకు నగరవాసులు భారీగా చేరుకున్నారు. వేడుకల్లో గవర్నర్ రాధాకృష్ణన్ పాల్గొన్నారు. కార్నివాల్, ఫైర్ క్రాకర్స్ షో ఏర్పాటు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి 10 నిమిషాల పాటు ట్యాంక్ బండ్‌పై ఏర్పాటు చేసిన స్టాల్స్ ను సందర్శించారు. అనంతరం స్టేజ్ షోస్ నిర్వహించారు. జయ జయహే తెలంగాణ గేయానికి ట్రైనీ పోలీసులతో ఫ్లాగ్ వాక్ నిర్వహించారు. తెలంగాణ గేయ రచయిత అందెశ్రీ, సంగీత దర్శకుడు కీరవాణికి సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ట్యాంక్ మండ్ పై రాత్రి 10 నిమిషాల పాటు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది ఫైర్ క్రాకర్స్ షో. ట్యాంక్ బండ్ వైపునకు వచ్చే వాహనాలను పోలీసులు దారి మళ్లించారు. ట్యాంక్ బండ్ పై 1.5 కిలోమీటరు పొడవున కళారూపాల ప్రదర్శన ఏర్పాటు చేశారు. ట్యాంక్ బండ్ పరిసరాల్లో వర్షం కురుస్తున్నప్పటికీ కళా ప్రదర్శలు కొనసాగుతున్నాయి.

## శిల్పారామంలో తెలంగాణ అవతరణ దినోత్సవం

**విశ్వంభర, హైదరాబాద్ జూన్ 2 :** ఉప్పల్ శిల్పారామంలో ఆదివారం తెలంగాణ టూరిజం కాంట్రాక్టు ఔట్సోర్స్ ఉద్యోగుల సంగం రాష్ట్ర జనరల్ సెక్రటరీ సబ్ రాజమౌళి ఆధ్వర్యంలో తెలంగాణ దశాబ్ది అవతరణ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రచయిత సుద్దాల అశోక్ హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన పాట మొదలై నేటికీ 30 ఏండ్లైందని, ఆనాడు మొదట రాసిన పాట ఒసై రాములమ్మ సినిమాలో రామసక్కని తల్లి రాములమ్మో ..! అనేపాట దర్శక రత్న దాసరి నారాయణ రావు గారు ఇచ్చిన అవకాశాని గుర్తుచేసుకున్నారు. తెలంగాణ యశ ఇప్పుడు హీరో హీరోయిన్లు కూడా పలికే విధంగా ఎదిగిందని గుర్తు చేశారు. ఆనాటి నుంచి ఇప్పటి ట్రిబుల్ ఆర్ సినిమాలో కొమురం భీముడో అనే పాట వరకు రెండువేల సినిమాలో మూడు వేల పాటల వరకు రాశానని తెలిపారు. ఇంకా టూరిజం కాంటాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను ప్రభుత్వం వెంటనే ప్రభుత్వ ఉద్యోగులుగా తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శిల్పారామం స్పెషల్ ఆఫీసర్ కిషన్ రావు మరియు వారి బృందానికి నిర్వాహకుడు రాజమౌళి ధన్యవాదములు తెలిపారు.



## సెట్విన్‌ను బలోపేతం కోసం కార్మిక శాఖ అండగా ఉంటుంది

రాష్ట్ర కార్మిక శాఖ అదనపు కమీషనర్ గంగాధర్

**విశ్వంభర, హైదరాబాద్ జూన్ 02:** రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థ సెట్విన్ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు 90 వేల మంది సంఘటిత, అసంఘటిత రంగానికి చెందిన కార్మికుల పిల్లలకు నైపుణ్యత కలిగిన కోర్సులలో శిక్షణ ఇవ్వడం జరిగిందని రాష్ట్ర కార్మిక శాఖ అదనపు కమీషనర్, తెలంగాణ బిల్డింగ్ అండ్ ఆధర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు సీఈఓ డాక్టర్ ఈ.గంగాధర్ అన్నారు. ఆదివారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థ సెట్విన్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేదికలను ఘనంగా నిర్వహించారు. సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కే.వేణుగోపాల్ రావు అధ్యక్షతన జరిగిన కార్యమంలో డాక్టర్ గంగాధర్ చేతుల మీదుగా వివిధ కోర్సులలో శిక్షణ పొంది ఉత్తమ ప్రతిభ కనబరిచిన యువతీ యువకులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందించారు. ఎన్.ఏ.ఏ.సీ సెట్విన్, కార్మిక శాఖ సంయుక్తంగా విజయవంతమైన వివిధ కోర్సులలో శిక్షణ ఇవ్వడం జరిగిందని అన్నారు. నైపుణ్యత కోర్సులలో శిక్షణ పొందిన వారు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా తయారు కావాల్సిన అవసరం ఉందని అన్నారు. సెట్విన్ మేనేజర్ మహమ్మద్ అబ్దుల్ మొయిజ్, సూపరింటెండెంట్ లు ప్రసాద్ రావు, రాధా కృష్ణ, కోఆర్డినేటర్ నవీన్ కుమార్, అసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

## నేరాల అదుపునకు సీసీ కెమెరాల పాత్ర కీలకం

**విశ్వంభర, ఆమనగల్లు జూన్ 2 :** నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని, దీంతో నేరాలను కట్టడి చేయవచ్చని ఆమనగల్లు మున్సిపాలిటీ 15వ వార్డు కౌన్సిలర్ చెక్కల లక్ష్మణ్ అన్నారు. రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు మున్సిపాలిటీ 15వ వార్డు ఉదయ్ నగర్ కాలనీ నల్లల భావి వద్ద వార్డు కౌన్సిలర్ చెక్కల లక్ష్మణ్ సహకారంతో సీసీ కెమెర ఏర్పాటు చేయడం జరిగింది. సీసీ కెమెరాలను ఆమనగల్లు ఎస్సై బలరాం నాయక్ ప్రారంభించారు. కానిస్టేబుల్ రఘు, నాగయ్య, వెంకటయ్య, సోమరాజు యాదగిరి, గుండ్రాతి గుండాలు, నర్సింహా, సత్తయ్య, వెంకటేశ్, శ్రీకాంత్, శ్రీను, కృష్ణయ్య, పాతకోట రాజు, విజయ్ కాలనీవాసులు పాల్గొన్నారు.

## తెలంగాణ ప్రజల ఆకాంక్షలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలి

- ఆప్ కన్వీనర్ దిడ్డి సుధాకర్

**విశ్వంభర, బషీర్ బాగ్ జూన్ 2 :** గత బీఆర్ఎస్ ప్రభుత్వం నీళ్లు, నిధులు, నియామకాలు అందించక రాష్ట్ర ప్రజలకు దగా చేసిందని, నేటి కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజల ఆకాంక్షలను గట్టిగా కృషి చేయాలనీ ఆప్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ కోరారు. లిబర్టీ, ఆప్ రాష్ట్ర కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా డాక్టర్ దిడ్డి సుధాకర్ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో ఆప్ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు బుర్ర రాము గౌడ్, డా. సోలొమన్ రాజ్, మహిళా విభాగం అధ్యక్షురాలు హేమ జిల్లోజు, యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్ ముల్లంగి, అధ్యక్షులు అక్షయ్ రెడ్డి, అధికార ప్రతినిధి జావేద్ షరీఫ్, నేతలు దర్శనం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ట్యాంక్ బండ్‌పై వైభవంగా తెలంగాణ ఆవిర్భావ వేడుకలు







**విశ్వంభర, హైదరాబాద్ :**

ట్యాంక్ బండ్ వద్ద తెలంగాణ ఆవిర్భావ వేడుకలు వైభవంగా జరిగాయి. ట్యాంక్ బండ్ వద్దకు నగరవాసులు భారీగా చేరుకున్నారు. వేడుకల్లో గవర్నర్ రాధాకృష్ణన్ పాల్గొన్నారు. కార్నివాల్, ఫైర్ క్రాకర్స్ షో ఏర్పాటు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి 10 నిమిషాల పాటు ట్యాంక్ బండ్ పై ఏర్పాటు చేసిన స్టాల్స్ ను సందర్శించారు. అనంతరం స్టేజ్ షోస్ నిర్వహించారు. జయ జయహే తెలంగాణ గేయానికి ట్రైనీ పోలీసులతో ఫ్లాగ్ వాక్ నిర్వహించారు. తెలంగాణ గేయ రచయిత అందెశ్రీ, సంగీత దర్శకుడు కీరవాణికి సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ట్యాంక్ మండ్ పై రాత్రి 10 నిమిషాల పాటు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది ఫైర్ క్రాకర్స్ షో. ట్యాంక్ బండ్ పై 1.5 కిలోమీటరు పొడవున కళారూపాల ప్రదర్శన ఏర్పాటు చేశారు. ట్యాంక్ బండ్ పరిసరాల్లో వర్షం కురుస్తున్నప్పటికీ కళా ప్రదర్శలు కొనసాగుతున్నాయి. రాష్ట్ర అవతరణ వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమాలను ప్రజలు ఆసక్తిగా తిలకిస్తున్నారు. ఉదయం పెరేడ్ గ్రౌండ్ లో జరిగిన వేడుకల్లో విధి నిర్వహణలో ప్రతిభ, ధైర్యసహాసాలు ప్రదర్శించిన అధికారులకు సీఎం మెమొంటోలు అందజేసి సత్కరించారు.























ఆత్మకూరు(ఎం): యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలంలో తెలంగాణ రాష్ట్రం కోసం ఉధృతంగా ఉద్యమం సమయంలో రాష్ట్ర సాధన కోసం అర్ధ నగ్న ప్రదర్శనలో పాల్గొన్న ఆఖిలపక్ష నాయకులు (ఫైల్)



## ఘనంగా రాష్ట్ర ఆవిర్భావ
# దశాబ్ది వేడుకలు

విశ్వంభర, హైదరాబాద్/బషీర్ బాగ్/నారాయణఖేడ్/షాద్‌నగర్/ఆమనగల్లు/ఆత్మకూరు(ఎం): తెలంగాణ ఆవిర్భావ ఉత్సవాలను రాష్ట్రం అంతటా ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గన్ పార్క్ లోని అమరవీరుల స్థూపం వద్ద ప్రముఖులు నివాళులర్పించారు. ఆయా నియోజకవర్గాల్లోని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, పార్టీ కార్యాలయాల్లో జాతీయ జెండా ఆవిష్కరించారు. పలు చోట్లు తెలంగాణ తొలి దశ, మలి దశ ఉద్యమంలోని ఉద్యమకారులను సన్మానించారు. కాంగ్రెస్ నాయకులు సోనియా గాంధీ చిత్రపటానికి పాలాభిషేకాలు నిర్వహించారు.



























# ఆధ్యాత్మిక చింతనతోనే చెడుగుణాలు దూరం

**● బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయాధ్యక్షుడు లక్ష్మణ్**



**విశ్వంభర, హైదరాబాద్ జూన్ 2 :** మనిషిలో చెడుగుణాలను దూరం చేసి మంచి మార్గం దిశలో నడిపించడంలో ఆధ్యాత్మికత ఎంతో ఉపయోగపడుతుందని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయాధ్యక్షుడు డా.కే లక్ష్మణ్ అన్నారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకొని సీనియర్ జర్నలిస్ట్ డీఆర్ఎస్ నరేంద్ర ఆధ్వర్యంలో నారాయణగూడలోని కేశవ మెమోరియల్ ప్రాంగణంలో నిర్వహించిన శ్రీ హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో నరేంద్రమోదీ నేతృత్వంలో నీతి, నిజాయితితో కూడిన ప్రభుత్వ పదేండ్ల పాలన వలన భారత్‌కు ప్రపంచ ఖ్యాతి లభించిందని పేర్కొన్నారు. రాబోవు రోజుల్లోనూ తిరిగి ఎన్డీయే ప్రభుత్వం అధికారం చేపట్టి దేశం విశ్వగురువుగా వెలుగొందుతుందని లక్ష్మణ్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఆధ్యాత్మికవేత్త సామర్ల వేంకటేశ్వర్లు మాట్లాడుతూ.. మొట్టమొదటిసారిగా సర్జికల్ స్ట్రైక్ చేసింది హనుమంతుడని చమత్కారంగా తెలియజేశారు. ప్రముఖ రచయిత తెలుగు ఉపన్యాసకులు భాస్కర యోగి శ్రీ ఆంజనేయ తత్వం గురించి వివరించారు. కార్యక్రమ నిర్వాహకులు డీఆర్ఎస్ నరేంద్ర మాట్లాడుతూ.. కేంద్రంలో మరోసారి నరేంద్రమోదీ అధికారంలోకి రావాలనే సంకల్పంతో ఈ పారాయణం చేపట్టామని తెలియజేశారు. ఆంజనేయ స్వామి ఉపాసకులు పాత వేంకట రమణ ఆలపించిన హనుమాన్ చాలీసాను భక్తులు తన్మయత్వంతో ఆస్వాదించారు. కార్యక్రమానికి మాజీ మంత్రి సీ కృష్ణా యాదవ, బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు ఎన్ గౌతంరావు, ఉపాధ్యక్షుడు కన్నే రమేశ్ యాదవ్, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు వినోద్ కుమార్, ఆనంతలక్ష్మీ, నాయిని బుచ్చిరెడ్డి తదితరులతో పాటు శ్రీ ఆంజనేయ సేవాసమితి కార్యవర్గ సభ్యులు అశోక్, సునీల్, శ్రీకాంత్, రాజేందర్, రాజురెడ్డి, ఆర్యుల శ్రీనివాస్, సాయికిరణ్, అభిషేక్, పెద్దసంఖ్యలో హాజరయ్యారు.



# బీఆర్ఎస్‌తోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యం

**మాజీ ఎంపీపీ శ్రీనివాస్ యాదవ్**

**విశ్వంభర, తలకొండపల్లి :** తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం 14 సంవత్సరాల తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడి సాధించిన ఘనత మన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కే దక్కుతుందని మాజీ ఎంపీపీ శ్రీనివాస్ యాదవ్ అన్నారు. తెలంగాణ రాష్ట్రం సిద్ధించి 10 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా తెలంగాణ భవన్లో నిర్వహించిన దశాబ్ది ఉత్సవాల ముగింపు వేడుకల్లో కల్వకుర్తి నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు తలకొండపల్లి మాజీ ఎంపీపీ శ్రీనివాస్ యాదవ్, ఆమనగల్ ఏఎంసీ మాజీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి లు హాజరై తెలుగు తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కష్టపడి సాధించుకున్న తెలంగాణ కష్ట సుఖాలు కేవలం కేసీఆర్ కే తెలుస్తాయని, ఆనాడు ప్రత్యేక తెలంగాణ వాదాన్ని విస్మరించిన నాయకులే నేడు గద్దెనెక్కి పదవులు అనుభవిస్తున్నారని ఎద్దేవా చేశారు. అలాంటి నాయకులకు రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పి బిఆర్ఎస్ ను ఆదరిస్తే మన ప్రాంతానికి మళ్ళీ మంచి రోజులు వస్తాయని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. అదేవిధంగా ఉమ్మడి మహబూబ్నగర్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా జీవన్‌రెడ్డి గెలుపొందడంతో తలకొండపల్లి మండలంలోని బారాస కార్యకర్తలు, నాయకులు బాణాసంచాలు కాలుస్తూ స్వీట్లు పంచి పెట్టి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో భాస్కర్‌రావు, మహేష్ పాల్గొన్నారు.




# ప్రపంచ శాంతికి అన్ని మతాలు కృషి చేయాలి

**విశ్వంభర, బషీర్‌బాగ్ జూన్ 2:** ప్రపంచ శాంతికి సర్వ మతాలు కృషి చేయాలని అహమ్మదీయ ముస్లిం కమ్యూనిటీ మహిళా విభాగం పిలుపునిచ్చింది. బషీర్‌బాగ్‌లోని రాయల్ టన్ హోటల్లో నవ సమాజ నిర్మాణంలో మహిళల కీలక పాత్ర అనే అంశంపై సర్వధర్మ సమ్మేళనాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన అంతుల్ వసి సుమాయిల మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా మహిళలందరూ ఒకే చోట చేరి శాంతి కోసం కృషి చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ సమావేశానికి మరియం అజీమ్ అధ్యక్షత వహించగా, ప్రముఖ ఐఏఎస్ కోచ్ బాలలత, రెవరెండ్ శాంతి రాబర్ట్ నతా నియల్, ఉపేందర్ కౌర్ పాల్గొని దిశా నిర్దేశం చేశారు. మహిళలు చైతన్యవంతమై విద్య, విజ్ఞానాన్ని సంపాదించుకున్నప్పుడే సమసమాజ నిర్మాణం తో పాటు శాంతివనగోరుతోందని మరికంటి భవాని రెడ్డి, విశ్వ వైఖ, ఆశా పటేల్, వీకే ఉమారాణి పేర్కొన్నారు. ప్రపంచ శాంతిని కాంక్షి స్తూ, చైతన్యాన్ని నింపేందుకు సంస్థను స్థాపించడం జరిగిందని హజ్రత్ మీర్జా తెలిపారు.

# బీహెచ్ఈఎల్‌లో ఉచిత మెగా వైద్య శిబిరం




**విశ్వంభర, హైదరాబాద్ జూన్ 2:** శ్రీ షిర్డీ సాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఇపియాన్ సెంటర్ ఫర్ పెయిన్ రిలీఫ్, బియాండ్ వారు ఉచిత మెగా మెడికల్ క్యాంపు ఆదివారం బీహెచ్ఈఎల్‌లోని శ్రీ షిర్డీ సాయి బాబా మందిరం వద్ద నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా గౌరవ డాక్టర్ మినాల్ చంద్ర పా ల్గొన్నారు. ఈ క్యాంపులో గుడి పరిసర ప్రాంతంలోని ప్రజలకు ఇపియాన్ సెంటర్ ఫర్ పెయిన్ రిలీఫ్ వారి సభ్యుల ద్వారా బీడీఎం, ఎముకలు, కాల్షియం, బీపీ, షుగర్, హైట్, వెయిట్ పరీక్షలు చేశారు. డాక్టర్ అనిత వైద్య పరీక్షల అనంతరం వచ్చిన ప్రజలందరికి తమ ఆరోగ్య సమస్యలు అడిగి తెలుసుకుని తగిన వైద్య సేవలు అందించారు.

# త్వరలో 3వేల ఉద్యోగాలు..

**ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ప్రకటన**



**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనర్ కీలక ప్రకటన చేశారు. హైదరాబాద్‌లోని బస్ భవన్ ప్రాంగణంలో ఆదివారం తెలంగాణ రాష్ట్ర అవతరణ ఆవిర్భా వ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సజ్జనార్ జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం టీజీఎస్ఆర్టీసీ భద్ర తా సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరిం చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కొత్త బస్సులకు అనుగుణంగా 3 వేల ఉ ద్యోగాలను భర్తీ చేయాలని టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం నిర్ణయించిందని తెలిపారు. ప్రభుత్వ అనుమతితో వాటిని వీలైనంత త్వరగా భర్తీ చేస్తామని వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ఆర్టీసీ ఉద్యోగుల పాత్ర చిరస్మరణీయమని కొనియాడారు. 'బస్ కా పయ్యా నహీ ఛలేగా' నినాదంతో చేపట్టిన సమ్మె తెలంగాణ ఉద్యమానికి ఊపిరిలూదిందని ఆయన గుర్తు చేశారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితోనే సంస్థలో విప్లవాత్మక మార్పులను తీసుకువచ్చినట్లు తెలిపారు. టీజీఎస్ఆర్టీసీ కుటుంబం తరపున అమరులకు ఘన నివాళులర్పిస్తున్నామని తెలిపారు. ఆర్టీసీ ఉద్యోగులు 2011లో 29 రోజులపాటు 'మేము సైతం' అంటూ సకల జనుల సమ్మెను కొనసాగించారని గుర్తు చేశారు. అతి పెద్ద సమ్మెగా నిలిచిన సకల జనుల సమ్మెలో పెద్ద ఎత్తున 56,604 మంది ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొని స్వరాష్ట్ర సాధనకు నిర్విరామంగా కృషి చేశారని తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో ఆర్టీసీ ఉద్యోగుల పాత్ర చరిత్రలో నిలిచిపోయింది." అని అన్నారు. మహాలక్ష్మి–మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్య పథకాన్ని ప్రభుత్వం ప్రకటించిన 48 గంటల్లోనే అమలు చేశామని చెప్పారు. మహాలక్ష్మి పథక అమలుకు ముందు ప్రతి రోజు సగటున 45 లక్షల మంది ప్రయాణిస్తే.. ప్రస్తుతం రోజుకి సగటున 55 లక్షల మంది టీజీఎస్ఆర్టీసీ బస్సుల్లో రాకపోకలు సాగిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో దాదాపు 7 ఏళ్లకుపైగా పెండింగ్ లో ఉన్న 2017 వేతన సవరణను చేసి.. ఉద్యోగులకు 21 శాతం ఫిట్ మెంట్ ను సంస్థ ప్రకటించిందన్నారు.




# ఓఆర్ఆర్‌పై ట్యాంకర్ బీభత్సం..

**ఇద్దరు విద్యార్థులు మృతి**

**విశ్వంభర, శంషాబాద్:** ఔటర్ రింగ్ రోడ్డుపై ట్యాంకర్ బీభత్సం సృష్టించింది. పోలీస్ అకాడమి వద్ద ఆగి ఉన్న రెండు కార్లను ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఇద్దరు విద్యార్థులు తీవ్రగాయాలపాలై అక్కడికక్కడే మృతిచెందారు. ఈ ఘటనలో మరో 10మంది విద్యార్థులు గాయాలపాలయ్యారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. నగరానికి చెందిన ఓ 10 మంది విద్యార్థులు వీకెండ్ కావటంతో శంషాబాద్ ఎయిర్‌పోర్టులోని ఓ ఫుడ్ కోర్టుకు వెళ్లారు. రాత్రి అక్కడ భోజనం చేసిన విద్యార్థులు రెండు కార్లలో తిరుగు ప్రయాణమయ్యారు. మార్గమధ్యలో పోలీస్ అకాడమి వద్ద కార్లు రోడ్డు పక్కన నిలిపారు. ఔటర్ రింగు రోడ్డులో సెల్ఫీలు తీసుకుంటున్నారు. ఇదే సమయంలో అటుగా వచ్చిన ఓ ట్యాంకర్ అదుపు తప్పి ఒక్కసారిగా వారిపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో యువతి, యువకుడు అక్కడికక్కడే మృతిచెందారు. ప్రమాదం ధాటికి వారి శరీరాలు నుజ్జు నుజ్జయ్యాయి. మరికొందరు విద్యార్థులకు తీవ్ర గాయాలు కాగా వారిని ఆసుపత్రికి తరలించారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు. ప్రమాదంలో మృతిచెందినవారి వివరాలు తెలియాల్సివుంది.

# సీఎం రేవంత్‌రెడ్డిపై టీడీపీ మాజీ ఎమ్మెల్యే ప్రసూన ఆగ్రహం

**విశ్వంభర, జూబ్లీహిల్స్ :** సీఎం రేవంత్‌రెడ్డిపై టీడీపీ మాజీ ఎమ్మెల్యే కాట్రగడ్డ ప్రసూన ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ లోగో మార్పును ఆమె తప్పుబట్టారు. రేవంత్ చిత్రకారుడు అనుకున్నానే కానీ చరిత్రను వక్రీకరించే చాతుర్యమున్న నాయకుడని అనుకోలేదని ఎద్దేవా చేశారు. చరిత్రను మార్చివేసి రాబోయే తరాలకి విషం నింపబోతున్నారా? అని ప్రశ్నించారు. కాకతీయులు ఢిల్లీ రాజులను ఎదిరించి దేశంలోనే రాజకీయ చరిత్రను మార్చిన గొప్ప వ్యక్తులని గుర్తు చేశారు. అలాంటి చరిత్ర కలిగిన వ్యక్తి, శిల్ప కళ కలిగిన వ్యక్తులు కాకతీయులను ప్రసూన చెప్పుకొచ్చారు. రైతుల సంక్షేమానికి ఎన్నో గొప్ప కార్యక్రమాలు చేసి పరిపాలనలో అనేక సంస్కరణలు తీసుకొచ్చారని గుర్తుచేశారు. కాకతీయ కళా తోరణాన్ని తీసివేయడంలో సీఎం రేవంత్ రెడ్డి పాత్ర ఉన్నట్లు స్పష్టంగా తెలుస్తోందన్నారు. సమ్మక్క, సారక్కలను చంపింది కాకతీయులు అని ములుగు సామ్రాజ్యం గురించి మాట్లాడేలా చేస్తున్నారని మండిపడ్డారు. కమ్మ వారు లేకపోతే ములుగు ఉందా? అని ప్రశ్నించారు. గణపతి దేవుడు కమ్మ వ్యక్తి అని, యాదవ కులస్తూరాలిని పెళ్ళాడి రెండు కులాల మధ్య బంధం పెంచారని చరిత్రకు వన్నె తెచ్చరాని తెలిపారు. అలాంటి కాకతీయ చరిత్రను వక్రీకరిస్తారా? అని మండిపడ్డారు. ఈ మార్పు వెనుక చంద్రబాబు కడిగిన ముత్యం సీతక్క ఉన్నారని అర్థమవుతోందన్నారు. కాకతీయులు క్రూరులని రేవంత్ రెడ్డితో మాట్లాడించడం సమంజసం కాదన్నారు. ములుగులో ఒక కమ్మ అభ్యర్థిగా తాను నిలబడతానని దమ్ముంటే సీతక్క తనపై గెలుపొందగలరా? అంటూ బహిరంగ సవాల్ చేశారు.









విశ్వంభర
V3 NEWS

# నేషనల్ హైవే రోడ్డు నిర్మాణ పనులను
# వేగవంతం చేస్తాం

## ఎమ్మెల్యే పాయల్ శంకర్



**విశ్వంభర, ఆదిలాబాద్ :** జైనథ్ మండలంలోని బోరజ్ నుంచి బేల మండలంలోని మహారాష్ట్ర సరిహద్దు వరకు, కర్రోడా బ్రిడ్జి వద్ద చేపట్టే నేషనల్ హైవే రోడ్డు నిర్మాణ సర్వే పనులను వేగవంతం చేస్తాం అని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ ఈ మేరకు ఆదివారం నేషనల్ హైవే నిర్మాణ పనులను ఆయన సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బ్రిడ్జిపై నీటి సరఫరా లైన్ ఉండటంతో పాటు ఎన్నికల కోడ్ ఉండడం వల్ల నేషనల్ హైవే రోడ్డు నిర్మాణ పనుల్లో ఆలస్యం అయిందన్నారు. సంబంధిత నేషనల్ హైవే అధికారులు, ఇరిగేషన్ శాఖ అధికారులతో సమావేశం పూర్తయ్యిందని తెలిపారు. వర్షాకాలంలో సైతం రాకపోకలు కొనసాగే విధంగా తరోడ బ్రిడ్జి పక్కనుంచి మూడు కోట్ల నిధుల వ్యయం తో డైవర్షన్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వానికి ప్రపోజల్ పంపుతామన్నారు. గతంలోనే ప్రధాని నరేంద్ర మోడీ శంకుస్థాపన చేసిన రోడ్డు నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభమై కార్యరూపం దాల్చే విధంగా కృషి చేస్తామన్నారు. కుంగిపోయిన టువంటి తరోడ బ్రిడ్జి తీసేసి నూతన బ్రిడ్జి నిర్మించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఎమ్మెల్యేతో పాటు అధికారులు, నాయకులు ఉన్నారు.

## మిర్యాలగూడ ఎమ్మెల్యే బీఎల్ఆర్ సంచలన నిర్ణయం



**విశ్వంభర, మిర్యాలగూడ :** మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి సంచలన నిర్ణయం తీసుకున్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ కీలక ప్రకటన చేశారు. నియోజకవర్గంలోని 29 ప్రభుత్వ హైస్కూల్లో పనిచేస్తున్న స్వీపర్లకు తన జీతం నుంచి వేతనాలు చెల్లించేందుకు నిర్ణయం తీసుకుంటున్నట్లు ఆయన వెల్లడించారు. గతంలో జీతాలు ఇవ్వలేక విద్యాశాఖ స్వీపర్లను పక్కన పెట్టిందన్నారు. తన ఎమ్మెల్యే పదవి ఉన్నంత కాలం స్వీపర్లకు జీతాలు అందించేందుకు ఏర్పాట్లు చేస్తానని స్పష్టం చేశారు. వారంలో మూడు రోజులు ఊరు, వాడ, తండా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో సమస్యలను తెలుసుకుని వాటిని సత్వరమే పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానని అన్నారు.



– మాధవశేషు స్వామి,
వాస్తు, జ్యోతిష్యం
పురోహిత్, సెల్:
9059308808

## రాశి ఫలాలు

**26-05-2024 నుండి 03-06-2024 వరకు**



**మేష రాశి :** సామాన్యంగా ఉన్నది. ఆలోచనలు లేక కొంత అనిశ్చితిని కలిగి ఉంటారు. నిలకడలేని తనము ఎక్కువగా ఉండును. కుటుంబ ఆర్థిక విషయాలు చికాకు కల్గించును. నిదానంగా శుభంగా పూర్తి అగును. నిద్రలేమి అధికమగును.



**వృషభ రాశి :** వ్యాపారాభివృద్ధి కల్గును. శరీరం అలసటగా ఉండును. కుటుంబ విషయాలలో ఆర్థికంగా ఆలోచించి ముందుకు సాగుతారు. పుత్రా సంతానం అభివృద్ధి ఎక్కువగా ఉండును. ఈ వారం ఇతరులకు డబ్బు ఇవ్వరాదు. ఇచ్చినచో తిరిగిరావు.



**మిథున :** సానుకూలంగా ఉన్నది. కొత్త వ్యాపారం ప్రారంభానికి ఆలోచిస్తారు. భార్య ఆరోగ్యం మెరుగుపడును. ఆకస్మిక ప్రయాణం చేయుదురు. దాచిన విలువైన కాగితాలు, డబ్బులు మరచిపోగలరు. బంధు వర్గం వారితో జాగ్రత్త అవసరం. విరోధాలు ఉండును.



**కర్కాటక :** విశేష యోగవంతంగా ఉంది. తలచిన వెంటనే పనులు పూర్తగును. విదేశీ ప్రయాణాలు లాభిస్తాయి. ఆర్థిక పరిస్థితి యోగవంతంగా ఉండును. స్వంత ఆలోచనతో వ్యాపారం చేయుట మంచిది. శుభ వార్తలు వింటారు.



**సింహరాశి :** సామాన్యంగా ఉన్నదని చెప్పొచు. నూతన వస్తువులు కొనుగోలు చేస్తారు. భార్య వలన మాట పట్టింపులు ఏర్పడును. అభివృద్ధికి ఆటంకాలు ఏర్పడిననూ వారం చివరిలో శుభం కల్గును.



**కన్యారాశి :** అనుకూలంగా ఉన్నది. నూతన ప్రయత్నాలు ఫలించును. నిరుద్యోగులకు ఉద్యోగం ప్రాప్తించును. పుత్ర సంతానంతో ఆనందంగా కాలక్షేపం చేస్తారు. డబ్బు ఖర్చు అధికంగా ఉండును.



**తులరాశి :** ఏ విషయం ఎలా ఉన్ననూ ఆరోగ్య విషయంలో తగిన శ్రద్ధ అవసరం. శారీరకంగా ఎక్కువ కష్టాన్ని కలిగి ఉందురు. సంతానం ద్వారా ధన నష్టం కల్గును. ఆర్థిక పరిస్థితి సామాన్యంగా ఉండును.




**వృశ్చికరాశి :** సామాన్యంగా ఉన్ననూ, అనుకున్న కోర్కెలు నెరవేరును. కుటుంబ ఆర్థిక పరిస్థితి మెరుగుపడి సంతోషంగా ఉంటారు. కీర్తి ప్రతిష్ఠలు మేరుగుపడును. శారీరక శ్రమ అధికం కావటం వల్ల శిరో బాధలు ఏర్పడును.



**ధనుస్సురాశి :** గడ్డుకాలంగా ఉన్నది. కోరుకున్న పనులు అవ్వక తీవ్ర నిరాశతో ఉంటారు. ఏ పని చేసిననూ ఒకటికి మూడు సార్లు తిరగవలసి వస్తుంది. వాహనం నడపడంలో జాగ్రత్త అవసరం.



**మకరరాశి :** శ్రమకు తగిన ఫలితాన్ని సాధిస్తారు. స్నేహితులతో విరోధాలు, అకాల భోజనం, సోదర విరోధం, మాట విలువ తగ్గును. ఆర్థిక విషయాలు చికాకు కలిగిస్తాయి. కోర్టు వివాదం ఒక కొలిక్కి వస్తుంది.



**కుంభరాశి :** రాజయోగంగా ఉన్నది. వ్యాపారాభివృద్ధి చెందుతారు. చేసే కృషి ఫలిస్తుంది. ఆర్థిక విషయల్లో జాగ్రత్త అవసరం. కొంత చికాకుగా ఉన్ననూ వారం చివరి వరకు అన్ని పనులు పూర్తి అగును. సోదర, బంధు వర్గం వారికి విశేష సహకారం అందించగలరు.



**మీనరాశి :** విశేషంగా ఉన్నదని చెప్పొచ్చు. కార్య దీక్షతో అన్ని పనులు పూర్తి చేస్తారు. ద్రవ్యం నిల్వ చేస్తారు. స్నేహితులతో విహారయాత్రలు చేయుదురు. ఆర్థిక విషయాలలో సంతోషంగా ఉంటారు.



## నాటక కళాకారులకు ప్రోత్సాహకం అందజేత

**విశ్వంభర, ఆమనగల్లు జూన్ 2 :** తలకొండపల్లి మండలం చౌదర్‌పల్లి గ్రామంలో శ్రీ మల్లికార్జున స్వామి వీధి నాటకం ప్రదర్శించారు. అంతరించి పోతున్న కళలను ప్రోత్సహిస్తూ కళాకారులకు బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సీఎల్ శ్రీనివాస్ యాదవ్ రూ. 5,000 విరాళం అందజేశారు. ఈ సందర్భంగా కళాకారులు శ్రీనివాస్ యాదవ్ ని సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు ద్దుడ్డు మల్లేష్ కురుమ, యాదయ్య, శ్రీకాంత్, మల్లయ్య, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.



## ఆదర్శ ప్రాయుడు ఎస్ఐ సంతోష్‌కుమార్

**విశ్వంభరి, పరిగి జూన్ 2 :** మున్సిపాలిటీ పరిధిలో కోర్టు చౌరస్తా నుంచి పోలీస్ స్టేషన్ వెళ్లే మార్గంలో ప్రధాన రహదారిపై గుంతలు ఏర్పడడంతో అటు నుంచి వెళ్లే వాహనదారులు గత కొన్ని రోజులుగా తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. పలువురు వాహనదారులు అదుపుతప్పి క్రింద పడ్డారు. ఆ విషయాన్ని తెలుసుకున్న పరిగి ఎస్ఐ సంతోష్ కుమార్ తన సొంత డబ్బులతో ఆదివారం దగ్గరుండి రోడ్డుపై ఉన్న గుంతల్లో కంకర వేసి రోడ్డు మరమ్మతులు చేయించారు. దీంతో అటు నుంచి వెళ్లే వాహనదారులు, పట్టణవాసులు ఎస్ఐ సంతోష్ కుమార్ పట్ల సంతోషం వ్యక్తం చేశారు.

## అయోధ్యలో తెలంగాణ
## నృత్యకారులకు బహుమతులు



**విశ్వంభర, పరిగి జూన్ 2:** అభినయ డాన్స్ అకాడమి నృత్యకారులు అయోధ్యలో బహుమతులను గెలుచుకున్నారు. ఆదివారం అయోధ్యలో రామసేతు వరల్డ్ ట్రావెల్స్ ఆర్గనైజర్ శ్రీకాంత్ గోచాదే ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన నృత్య పోటీల్లో వికారాబాద్ జిల్లా పరిగి పట్టణానికి చెందిన అభినయ డాన్స్ అకాడమి నృత్యకారులు పాల్గొన్నారు. చిన్నారుల నృత్య ప్రదర్శన చూపరులను ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా అభినయ డాన్స్ అకాడమి ట్రైనర్ వడ్ల కవిత (గురువు) చేసిన నృత్య ప్రదర్శనకు గాను సీనియర్ క్లాసికల్ డాన్స్ విభాగంలో మొదటి బహుమతిని సాధించారు. మైనర్ క్లాసికల్ గ్రూప్ డాన్స్ విభాగంలో పరిగి పట్టణానికి చెందిన చిన్నారులు సాయిపల్లవి, శ్రావణభార్గవి, లలితాశ్రీ, మోక్షరెడ్డి, శర్వాణీ గుప్త, అక్షర, హారతి, సాయి ప్రత్యూష, ఉమారాణీ, స్వస్తీ ఆరాధ్య, సమీక్ష రెడ్డి, అనూష, రిషిక. మొదటి బహుమతిని గెలుచుకున్నారు. చిన్నారుల ప్రదర్శనకు గాను పలువురి ప్రశంసలు పొందారు.

# దంపతుల గంజాయి దందా

## అరెస్ట్ చేసిన పోలీసులు



**విశ్వంభర, మెహిదీపట్నం :** సులభంగా డబ్బులు సంపాదించేందుకు దంపతులు గంజాయి దందాను ఎంచుకున్నారు. తమ స్వస్థలం వెస్ట్ బెంగాల్ నుంచి తక్కువ ధరకు తీసుకొచ్చి నగరంలో ఎక్కువ ధరకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. వారి దందాకు హుమాయన్ నగర్ పోలీసులు చెక్ పెట్టారు. కేసు వివరాలను ఇన్స్పెక్టర్ సైదీశ్వర్ ఆదివారం రాత్రి మీడియాకు వెల్లడించారు. వెస్ట్ బెంగాల్ కు చెందిన సిరాజ్ ఖాన్, రింకు డోలాయ్ భార్యభర్తలు. ఇదిలా ఉండగా సిరాజ్ ఖాన్ సంగారెడ్డి జిల్లాలోని ముత్తంగి వద్ద ఓ హొటల్లో పని చేస్తుండేవాడు. దంపతులు సులభంగా డబ్బులు సంపాదించేందుకు తమ స్వస్థలం నుంచి గంజాయిని తీసుకొచ్చి నగరంలో ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే గత నెల 27న వెస్ట్ బెంగాల్ నుంచి కిలో వంద గ్రాములు తీసుకొచ్చారు. అదివారం ఉదయం 9 గంటల 45 నిమిషాలకు మెహిదీపట్నం రైతు బజార్ వద్ద పిల్లర్ నెంబర్ 12 సమీపంలో ఉద్యోగదారులకు విక్రయించేందుకు సిద్ధంగా ఉన్నారు. విశ్వసనీయ సమాచారంతో ఆసిఫ్ నగర్ ఏసీపీ ఆదేశాల మేరకు హుమాయున్ నగర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని దంపతులిద్దరిని అరెస్టు చేశారు. వారి నుంచి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను న్యాయమూర్తి ఎదుట హాజరుపరచి రిమాండ్ కు తరలించారు.

### 30 కేజీల నిషేధిత గంజాయి పట్టివేత

**విశ్వంభర, పాల్వంచ టౌన్ :** ఒరిస్సా నుంచి విజయవాడ తరలిస్తున్న 30 కేజీల నిషేధిత గంజాయి పట్టుబడ్డ సంఘటన చోటు చేసుకుంది. పాల్వంచ పోలీస్ సిబ్బంది మధ్యాహ్నం రెండు గంటల సమయంలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా.. పాల్వంచలోని సి కాలనీ గేటు వద్ద గల కార్ ట్రావెల్స్ షెడ్ల వద్ద ఇద్దరు అనుమానాస్పదంగా కనిపించారు. దీంతో వారిని అదుపులోకి తీసుకొని విచారించి వారి వద్ద ఉన్న రెండు బ్యాగులను తనిఖీ చేయగా అందులో బ్రౌన్ కలర్ టేపు చుట్టబడిన గంజాయి ప్యాకెట్లు కనిపించాయి. పట్టుబడిన గంజాయి సుమారుగా 30 కేజీలు ఉంటుంది. దాని విలువ సుమారు 7,50,000, వెంటనే పోలీసులు వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## ఎన్ఎస్‌యూఐ నాగర్ జిల్లా
# ఉపాధ్యక్షుడిగా శ్రీను నాయక్

**శ్రీను నాయక్‌ను అభినందించిన ఎమ్మెల్యే కసిరెడ్డి**

**విశ్వంభర, కల్వకుర్తి జూన్ 2 :** జరుపుల శ్రీను నాయక్ ఎన్ఎస్‌యూఐ నాగర్ జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యాడు. ఈ సందర్భంగా కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శ్రీను నాయక్ అభినందించారు. కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని ఉదాహరణ జరుపుల శ్రీను నాయక్ ఎన్ఎస్‌యూఐ కార్యకర్త నుంచి జిల్లా ఉపాధ్యక్షుడి వరకు ఎదగడం గర్వనీయమన్నారు. ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ జిల్లా జడ్పీ వైస్ చైర్మన్ ఠాగూర్ బాలాజీ సింగ్, కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్, జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు నిజామొద్దీన్, మిర్యాల శ్రీనివాస్ రెడ్డి మాజీ జడ్పీటీసీ సభ్యులు హరిదాసు, యువజన కాంగ్రెస్ తాలుకా అధ్యక్షుడు అనిల్ గౌడ్, నాయకులు లింగారెడ్డి, మగ్బుల్, కల్మిచర్ల రమేష్, కృష్ణ ముదిరాజ్, మహమూద్, జీడిపల్లీ అంజి, వసురం నాయక్ పాల్గొన్నారు.

## పిడుగుపాటుతో ఎద్దు మృతి

**విశ్వంభర, చింతపల్లి జూన్ 2:** చింతపల్లి మండలం బద్ధవారిగూడెం గ్రామంలో కొంతం అభిమాని రెడ్డి రైతు తన సొంత పొలంలో వ్యవసాయ పనులు ముగించుకొని రెండు ఎద్దులను తన వ్యవసాయ బాయి వద్ద చెట్టుకు కట్టి వెళ్లిపోయాడు. ఆదివారం కురిసిన వర్షంతో పాటు ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులు రావటం వల్ల ఒక ఎద్దు తాడు తెంపుకొని కొంతం అభిమాని రెడ్డి ఇంటికి చేరుకుంది. దానితోపాటు ఇంకొక్క ఎద్దు ఎందుకు రాలేదు అని రైతు వెళ్లి చూడగా పిడుగుపాటుతో చెట్టుకు కట్టేసిన స్థలంలోనే మరణించింది. ప్రభుత్వం తనను ఆదుకోవాలని రైతు కొంతం అభిమాని రెడ్డి కన్నీరుమున్నీరయ్యాడు.

# రెండు గూడ్స్ రైళ్లు ఢీ..!

- గాయపడ్డ లోకో పైలట్లు
- విచారణకు ఆదేశించిన అధికారులు

**విశ్వంభర, పంజాబ్ :** ఈ నడుమ రైలు ప్రమాదాలు భయపెడుతున్నాయి. దానిపై రైల్వే కేంద్ర డిపార్టుమెంట్ పటిష్టమైన చర్యలు తీసుకుంటున్న తరుణంలో తాజాగా మరో ప్రమాదం ముంచేసింది. పంజాబ్‌లోని మాధోపూర్, సిర్హింద్ సమీపంలో రెండు రైల్వే గూడ్స్ రైళ్లు ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో రైలులోని ఇద్దరు డ్రైవర్లు తీవ్రంగా గాయపడ్డారు. పంజాబ్‌లోని సిర్హింద్‌లో ఆదివారం ఉదయం ఘోర ప్రమాదం జరిగింది. సిర్హింద్ లోని మాధోపూర్ సమీపంలో తెల్లవారుజామున 3:30 గంటలకు రెండు గూడ్స్ రైళ్లు ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఆ తర్వాత గూడ్స్ రైలు ఇంజిన్ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఇద్దరు లోకో పైలట్లకు గాయాలయ్యాయి. ఇద్దరు లోకో పైలట్లను ఆసుపత్రిలో చేర్చారు. వీరిని శ్రీ ఫతేగర్ సాహిబ్ సివిల్ ఆసుపత్రిలో చేర్పించారు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో పాటియాలాలోని రాజిందర్ ఆసుపత్రికి తరలించారు. రైల్వే అధికారులు, రెస్క్యూ టీం ఘటనాస్థలికి చేరుకున్నాయి. గూడ్స్ రైళ్ల కోసం నిర్మించిన డిఎఫ్‌సిసి ట్రాక్‌పై బొగ్గుతో కూడిన రెండు గూడ్స్ రైళ్లు ఆగి ఉన్నాయి. ఈ గూడ్స్ రైళ్లు రోపర్ వైపు వెళ్లాల్సి ఉంది. కానీ, ఆదివారం ఉదయం అకస్మాత్తుగా గూడ్స్ రైలు ఇంజిన్ విరిగిపోయి మరో రైలును ఢీకొట్టింది. అంబాలా నుంచి జమ్ముతావి వెళ్తున్న ప్యాసింజర్ రైలులో ఇంజన్ బోల్తా పడి ఇరుక్కుపోయింది. దీంతో సమ్మర్ స్పెషల్ ప్యాసింజర్ రైలు కూడా దెబ్బతింది.



ప్రమాదం తర్వాత, సమ్మర్ స్పెషల్ ట్రైయిన్‌ను రాజ్‌పురాకు రెండవ ఇంజన్‌ను అమర్చారు. ప్రస్తుతం ట్రాక్ మరమ్మతు పనులు కొనసాగుతున్నాయి. రైల్వే ఉద్యోగులు అక్కడికక్కడే ట్రాక్ మరమ్మతులు చేసే పనిలో నిమగ్నమయ్యారు. ప్రమాదంలో గాయపడిన లోకో పైలట్‌లు ఇద్దరూ ఉత్తరప్రదేశ్‌లోని సహరాన్‌పూర్ జిల్లా వాసులు. వారిని వికాస్ కుమార్, హిమాన్షు కుమార్‌లుగా గుర్తించారు. ఇంజిన్ అద్దాలు పగలగొట్టి లోకో పైలట్‌లిద్దరినీ బయటకు తీశారు. ఆ తర్వాత అంబులెన్స్ సహాయంతో సివిల్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. కానీ అతని పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు వారిని పాటియాలాలోని రాజింద్ర ఆసుపత్రికి రెఫర్ చేశారు. సిర్హింద్ పోలీస్ స్టేషన్ ఇన్‌ఛార్జ్ రతన్‌లాల్ ప్రమాదంపై దర్యాప్తు ప్రారంభించినట్లు చెప్పారు.



### ఎల్ఓసీ నుంచి భారత్‌లోకి ప్రవేశించడానికి
## ఉగ్రవాదుల ప్రయత్నం

**విశ్వంభర, జమ్మూకశ్మీర్ :** భారత్‌లోకి అక్రమంగా అడుగుపెట్టి దేశంలో విధ్వంసం సృష్టించడానికి, దాడులు చేయడానికి నియంత్రణ రేఖ వద్ద 60-70 మంది ఉగ్రవాదులు సిద్ధంగా ఉన్నారని సమాచారం అందిందని జమ్మూకశ్మీర్ డీజీపీ రశ్మీ రంజన్ స్వైన్ తాజాగా చెప్పారు. వారంతా కూడా ఐదు లేదా ఆరు బృందాలుగా ఏర్పడి వేరు వేరు చోట్ల దాడుల చేయడానికి చాలా కాలంగా ప్రణాళికలు రచిస్తున్నారని, ఏ సమయంలోనైనా వారు ఎల్ఓసీ దాటి దాడులు చేసే అవకాశం ఉందని తెలిపారు. పాకిస్తాన్‌లో ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉంది. అయినప్పటికి కూడా ఆ దేశం జమ్మూకశ్మీర్‌కు మనుషులు, డ్రోన్లు వంటి వస్తువులను పంపడం ఆపడం లేదు. ఆయుధాలు, మందుగుండు సామాగ్రి, పేలుడు పదార్థాలు, నగదు, మాదక ద్రవ్యాల అక్రమ రవాణాకు డ్రోన్లు వంటివి తరుచుగా పాక్ నుంచి భారత్ సరిహద్దు గ్రామాల్లోకి వస్తున్నాయి. వీటిన్నింటిని మన సైన్యం అడ్డుకుంటుందని, ఉగ్రవాదులపై భారత భద్రతా సిబ్బంది విజయం సాధించడానికి ఖచ్చితంగా కష్టపడతారని డీజీపీ చెప్పారు. ఇంతకు ముందు మే 27న కుప్వారాలో భారత సైన్యం, జమ్మూకశ్మీర్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో పెద్ద ఎత్తున ఆయుధాలు, మందుగుండు సామాగ్రి, దాడులకు ఉపయోగించే వస్తువులను స్వాధీనం చేసుకున్నారు.

### అరుణాచల్ ప్రదేశ్‌లో బీజేపీ, సిక్కింలో
## ఎస్‌కేఎం ఘన విజయం




**విశ్వంభర, అస్సాం :** 2024 లోక్సభ ఎన్నికల ఫలితాల్లో బీజేపీ తిరుగులేని విజయం దిశగా దూసుకెళ్తోంది. ఇప్పటికే ఎగ్జిట్ పోల్స్ అన్నీ బీజేపీ గెలుపు ఖాయమని తెలిపాయి. ఈ నేపథ్యంలో ఆదివారం అరుణాచల్ ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో బీజేపీ గెలుపు ఖాయమైంది. ఉదయం 6 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రక్రియ మొదలవ్వగా మొదటి నుంచే బీజేపీ హవా కొనసాగింది. అటు సిక్కింలో అధికారంలో ఉన్న ఎస్కేఎం విజయ తీరాలకు చేరుకుంది. అరుణాచల్ అసెంబ్లీకి 60 స్థానా లు ఉండగా ఇప్పటికే మేజిక్ ఫిగర్ 31సీట్లను గెలుచుకుంది. మరో 14 స్థానాల్లో లీడింగ్‌లో ఉంది. దీంతో కమలం పార్టీ మరోసారి ప్రభు త్వ ఏర్పాటును ఖరారు చేసుకుంది. ఎన్‌పీపీ రెండు, పీపీఏ, ఇండిపెండెంట్‌లు చెరో స్థానం లో విజయం సాధించారు. 2019 అరుణా చల్ ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి 41 సీట్లు దక్కించుకుంది. జేడీయూకి ఏడు సీట్లు, ఎన్పీపీకి ఐదు సీట్లు వచ్చాయి. కాంగ్రెస్ నాలుగు చోట్ల గెలిచింది. 2024 సిక్కిం అసెం బ్లీ ఎన్నికల ఫలితాల్లో అధికార ఎస్కేఎం భారీ విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. 32 అసెంబ్లీ సీట్లకు ఆది వారం ఉదయం 6 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రక్రియ మొదలవ్వగా మొదటి నుంచి ఎస్కేఎం దూకుడును ప్రదర్శించింది. మెజారిటీ 17గా ఉండగా.. పీవాల్యూ ప్రకారం.. ఎస్కేఎం ఇప్ప టికే 13 చోట్ల గెలిచింది. సిక్కిం డెమొక్ర టిక్ ఫ్రంట్ ఒక్క స్థానానికే పరిమితమైంది. బీజేపీ, కాంగ్రెస్ ఖాతానే తెరవలేదు. ప్రేమ్ సింగ్ తమాంగ్ మరోసారి సీఎం పదవి చేపట్టడం ఖాయమైంది.

### అవి ఎగ్జిట్ పోల్స్ కావు..
## మోదీ మీడియా పోల్స్

**రాహుల్ గాంధీ**



**విశ్వంభర, ఢిల్లీ :** శనివారం విడుదలైన ఎగ్జిట్ పోల్స్‌లో చాలావరకు లోక్ సభ ఎన్నికల్లో ఎన్డీయే కూటమిదే జయకేతనం అని పేర్కొన్నాయి. దేశవ్యాప్తంగా మళ్లీ బీజేపీదే హవా అని ఎగ్జిట్ పోల్స్ పేర్కొనడం పట్ల కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. ఆ ఎగ్జిట్ పోల్స్ వాస్తవ పరిస్థితులకు చాలా దూరంగా ఉన్నాయని అన్నారు. అవి ఎగ్జిట్ పోల్స్ కాదు... మోదీ మీడియా పోల్స్ అని విమర్శించారు. నిన్న వచ్చిన ఎగ్జిట్ పోల్స్ అన్నీ మోదీ మనసు నుంచి పుట్టుకొచ్చిన ఊహాజనితాలు... అంతా కల్పితం... ఎగ్జిట్ పోల్స్ పూర్తిగా బోగస్... అంతా నాటకం అని రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఇండియా కూటమి మనో ధైర్యం తగ్గించేందుకు మోదీ ఆడుతున్న ఆట ఇది అని కాంగ్రెస్ పార్టీ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఒత్తిడి పెంచే వ్యూహాలతో ప్రధాని మైండ్ గేమ్ ఆడుతున్నారని పేర్కొంది.

### ఈసీ నోటీసులు..
## చిక్కుల్లో జైరాం రమేశ్!



**విశ్వంభర, ఢిల్లీ:** కేంద్ర హోం మంత్రి అమిత్ షాపై సంచలన ఆరోపణలు చేసిన జైరాం రమేశ్ చిక్కుల్లో పడ్డారు. తాజాగా ఈసీ ఆయనకు నోటీసులు జారీ చేసింది. అమిత్ షాపై ఆరోపణల తాలూకు ఆధారాలు చూపాలని కోరింది. ఓట్ల లెక్కింపు నేపథ్యంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా 150 మంది జిల్లా కలెక్టర్‌లకు ఫోన్ చేశారని జై రామ్ రమేశ్ సంచలన ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. "మీరు బాధ్యతాయుతమైన స్థానంలో ఉన్నారు. ఒక జాతీయ పార్టీలో సీనియర్ నాయకులు. మీరు చేసే ఆరోపణలు ప్రజల్లో సందేహాలు రేకెత్తిస్తాయి. వాటిపై విచారణ జరిపేందుకు తగిన ఆధారాలు సమర్పించండి. కౌంటింగ్ కు ముందు 150 మంది జిల్లా కలెక్టర్లకు హోం మంత్రి ఫోన్ కాల్స్ చేశారనడానికి తగిన ఆధారాలు చూపండి. ఆ తరువాత తగిన చర్యలు తీసుకుంటాం" అని ఈసీ తన లేఖలో పేర్కొంది. "హోం మంత్రి ఇప్పటివరకూ 150 మంది కలెక్టర్లతో మాట్లాడారు. వారిపై నిఘా పెట్టారు. బెదిరింపులకు దిగుతున్నారు. విజయంపై బీజేపీ ఎంత నిరాశలో ఉందో దీని ద్వారా అర్థమవుతోంది. ప్రజల అభీష్టమే గెలుస్తుంది. ఇండియా కూటమి విజయం సాధిస్తుంది" అని జై రామ్ రమేశ్ ఎక్స్ లో పోస్టే చేసిన విషయం తెలిసిందే.

## ముగ్గురి ప్రాణం తీసిన పుట్టగొడుగులు

- ఒకే కుటుంబానికి చెందిన చిన్నారుల మృతి
- మరో 9 మందికి అస్వస్థత



**విశ్వంభర, మేఘాలయ :** పుట్టగొడుగులు ఓ కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపాయి. ఎంతో ఇష్టంగా పుట్టగొడుగులు వండుకుని తినాలనుకున్న ఆ కుటుంబాన్ని ఛిద్రం చేసేసింది ఆ వంటకం. పుట్టగొడుగులు తిని ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు చిన్నారులు చనిపోయారు. వారితో పాటు అదే కుటుంబంలోని మరో 9 మంది తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వీరంతా పలు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఈ విషాదకరమైన ఘటన మేఘాలయలోని పశ్చిమ జైంతియా హిల్స్ జిల్లాలో శనివారం చోటు చేసుకుంది. డిప్యూటీ కమిషనర్ బీఎస్ సోహ్లియా తెలిపిన వివరాల ప్రకారం.. మేఘాలయలోని పశ్చిమ జైంతియా హిల్స్ జిల్లా సఫాయ్ గ్రామంలోని ఒక కుటుంబానికి చెందిన 12 మంది అడవి పుట్టగొడుగులు తిన్నారు. అనంతరం కాసేపటికే తీవ్ర అస్వస్తతతో వారిలో ముగ్గురు పిల్లలు చనిపోయారు. అదే కుటుంబంలోని మరో తొమ్మిది మంది తీవ్ర అస్వస్థతకు గురవడంతో వారందరినీ వివిధ ఆస్పత్రులకు తరలించారు. పుట్టగొడుగులు తిని మరణించిన చిన్నారులను రివాన్సక సుచియాంగ్ (8), కిట్లాంగ్ సుచియాంగ్ (12), వాన్సాలన్ సుచియాంగ్ (15)గా గుర్తించారు. అయితే ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన వివరించారు.

## ఎన్డీయే గెలిస్తే గుండు కొట్టించుకుంటా..

- ఆప్ నేత సంచలన ప్రకటన
- మోడీకి భయపడి ఎగ్జిట్ పోల్స్ మార్చారంటూ ఆరోపణ



**విశ్వంభర, ఢిల్లీ :** ఎగ్జిట్ పోల్స్ దేశ వ్యాప్తంగా విడుదల అయిన సందర్భంలో కొందరు రాజకీయ నేతలు సంచలన ప్రకటనలు చేస్తున్నారు. ఇప్పుడు ఢిల్లీ ఆప్ పార్టీ నేత కూడా ఇలాంటి ప్రకటన చేశారు. నరేంద్ర మోడీ మూడోసారి ప్రధానమంత్రి అయితే తాను గుండు కొట్టించుకుంటానని ఆప్ నేత సోమ్‌నాథ్ భారతి తేల్చి చెప్పారు. ఎగ్జిట్ పోల్ ఫలితాలు వెలువడిన వెంటనే ఆయన ఈ ట్వీట్ చేశారు. కచ్చితంగా ఈ ఎన్నికల్లో ఇండియా కూటమి విజయం సాధిస్తుదని తెలిపారు. ఎగ్జిట్ పోల్ అంచనాలను కొట్టి పారేశారు. బ్యాలెట్ బాక్స్‌లు లెక్కించిన తరవాత ఎగ్జిట్ పోల్ అంచనాలు తారుమారు అవుతాయని స్పష్టం చేశారు. న్యూ ఢిల్లీ లోక్‌సభ ఎంపీ అభ్యర్థిగా బరిలోకి దిగిన సోమ్‌నాథ్ భారతి చేసిన ట్వీట్ వైరల్ అవుతోంది. ఎగ్జిట్ పోల్ అంచనాలు తప్పు అని తాము నిరూపించబోతున్నామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఇప్పుడొచ్చిన ఎగ్జిట్ పోల్ అంచనాలన్నీ తప్పు అని జూన్ 4వ తేదీన రుజువవుతుందన్నారు. ఢిల్లీలో 7 స్థానాల్లోనూ కూటమిదే విజయం. మోదీకి భయపడి కొందరు ఇలా ఎగ్జిట్ పోల్ అంచనాలను బీజేపీకి అనుకూలంగా ఇచ్చారు. అసలు ఫలితాలు వచ్చేంత వరకూ ఎదురు చూడాలి. బీజేపీకి వ్యతిరేకంగా భారీ ఎత్తున ఓట్లు పోల్ అయ్యాయని నమ్ముతున్నట్టు ఆయన చెప్పారు.

## యూపీలో వడదెబ్బతో 60 మంది మృతి

- రెండు రోజుల్లోనే ఈ మరణాలు
- మార్చురీల్లో కిక్కిరిసిపోయిన మృతదేహాలు




**విశ్వంభర, కాన్పూర్ :** ఎండదెబ్బకు ప్రజలు పిట్టల్లా రాలిపోతున్నారు. అందులోనూ ఉత్తర భారతదేశంలో అగ్గిలా ఎండలు మండుతున్నాయి. దాంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. చాలా మంది బయటకు వెళ్లి ప్రాణాలు కోల్పోతున్నారు. ఇక ఉత్తర ప్రదేశ్ లో ఇదీ మరీ ఎక్కువగా ఉందనే చెప్పుకోవాలి. యూపీలోని కాన్పూర్‌లో పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. గత రెండు రోజుల్లో అక్కడ 60 మందికిపైగా మరణించారు. వీరిలో చాలా వరకు అనుమానాస్పదంగా మృతి చెందారు. దీంతో లాలా లజపత్ రాయ్ ప్రభుత్వ ఆసుపత్రుల్లోని పోస్ట్‌మార్టం గదికి మృతదేహాలను భారీగా తీసుకొచ్చారు. గదంతా నిండిపోవడంతో కొన్ని మృతదేహాలను గది బయట వేడి వాతావరణంలో ఉంచారు. లోపల కేవలం 4 ఫ్రీజర్‌లు మాత్రమే ఉన్నాయి. స్థలం లేకపోవడంతో మృతదేహాలను నేలపై ఉంచారు. తగినంత ఎయిర్ కండిషనింగ్ లేకపోవడంతో మృతదేహాలు వేగంగా కుళ్లిపోతున్నాయి. ఫలితంగా ఆస్పత్రికి 300 మీటర్ల వరకు దుర్వాసన వ్యాపిస్తుంది. ఇదిలా ఉంటే.. శుక్రవారం మృతదేహాలకు పోస్ట్‌మార్టం చేస్తున్న ఇద్దరు డాక్టర్లు తీవ్రమైన పరిస్థితుల కారణంగా స్పృహతప్పి పడిపోయారు. ఆస్పత్రిలోని మృతదేహాల నుంచి వస్తున్న దుర్వాసన అటు వైద్యులతోపాటు బంధువులు కూడా ఇబ్బందులు పడుతున్నారు. మార్చురీలో పెరిగిపోతున్న మృతదేహాల అంశంపై అధికారులు స్పందించారు. క్లెయిమ్ చేయని మృతదేహాల గురించి వివిధ పోలీసు స్టేషనుల నుంచి ఇంకా సమాచారం సేకరిస్తున్నామని, కచ్చితమైన గణాంకాలను అందించడం కష్టతరంగా మారిందని జాయింట్ కమీషనర్ ఆఫ్ పోలీస్ హరిశ్‌చంద్ర తెలిపారు. అనేక మరణాలు హీట్‌స్ట్రోక్, వడదెబ్బ కారణంగా సంభవించి ఉండవచ్చని ప్రాథమికంగా




## జైలుకు వెళ్లే ముందు మరో బిగ్ బాంబ్ పేల్చిన సీఎం కేజ్రీవాల్

**విశ్వంభర, ఢిల్లీ :** సార్వత్రిక ఎన్నికల ఎగ్జిట్ పోల్స్ పై ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ స్పందించారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో మధ్యంతర బెయిల్ ముగియడంతో తిరిగి జైలులో సరెండర్ అయ్యే ముందు కేజ్రీవాల్ మీడియాతో మాట్లాడారు. లోక్ సభ ఎన్నికల ఫలితాలను అంచనా వేస్తూ వెలువడిన ఎగ్జిట్ పోల్స్ అన్ని ఫేక్ అని సంచలన వ్యాఖ్యలు చేశారు. 25 పార్లమెంట్ స్థానాలు ఉన్న రాజస్థాన్ లో బీజేపీ 33 సీట్లు గెలుస్తోందని ఓ సర్వే సంస్థ చెప్పిందని...అసలు ఇది ఎలా సాధ్యమని ఎద్దేవా చేశారు. ఎగ్జిట్ పోల్స్ ఫేక్ అనడానికి ఈ ఘటనే బెస్ట్ ఎగ్జామ్ పుల్ అని చమత్కరించారు. ఫలితాల విడుదలకు మూడు రోజుల ముందే తప్పుడు ఎగ్జిట్ పోల్స్ ఇవ్వాల్సిన అవసరం ఏంటని అసహనం వ్యక్తం చేశారు. ఎగ్జిట్ పోల్స్ ఫలితాలకు పూర్తి భిన్నంగా కౌంటింగ్ రోజు రిజల్ట్స్ వస్తాయని కేజ్రీవాల్ ధీమా వ్యక్తం చేశారు. అంతేకాకుండా కొందరు ఈవీఎంలను మార్చడానికి ట్రై చేస్తున్నారని జైలుకు వెళ్లేముందు కేజ్రీవాల్ మారో బిగ్ బాంబు పేల్చారు.



## మణిపూర్‌లో భూకంపం..
### రిక్టర్ స్కేల్‌పై 3.5తీవ్రత

**విశ్వంభర, మణిపూర్ :** మణిపూర్‌లో స్వల్ప భూకంపం సంభవించింది. నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ (ఎన్‌సీఎస్) తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మణిపూర్‌లోని చందేల్‌లో ఆదివారం తెల్లవారుజా మున 2.28గంటలకు భూమి కంపించింది. దీంతో ప్రజలు భయాందోళనకు గురై ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. ఈ భూకంప తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 3.5గా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. భూకంప కేంద్రం 77కిలోమీటర్ల లోతులో ఉన్నట్లు ఎన్‌సీఎస్ గుర్తించింది. ఇది అక్షాంశం 23.9ఎన్, రేఖాంశం 94.10ఈ వద్ద జరిగిందని పేర్కొంది. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని అధికారులు స్పష్టం చేశారు. భూకంప తీవ్రత స్వల్పంగానే ఉండటంతో ప్రాణనష్టం జరగలేదని తెలిపారు.



# ఏపీలో కూటమిదే అధికారం

- చంద్రబాబు ధీమా
- కూటమి నేతలతో వీడియో కాన్ఫరెన్స్

**విశ్వంభర, విజయవాడ :** ఏపీలో కూటమి అధికారంలోకి వస్తుందని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. కౌంటింగ్ కు మరికొన్ని గంటలు మాత్రమే మిగిలి ఉండటంతో కూటమి నేతలు అలెర్ట్ అయిపోయారు. ఈ సందర్భంగా కౌంటింగ్ ఏజెంట్ల విషయంలో తీసుకోవాల్సిన విషయాలపై కూటమి నేతలతో ఆయన జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మీటింగ్ లో ఏపీలో ఎన్డీయే కూటమి 21 ఎంపీ సీట్లు గెలవబోతుందని ఎగ్జిట్ పోల్స్‌లో వచ్చిందని.. రాష్ట్రంలో కూడా 53 శాతం ఓట్లతో కూటమి తిరుగులేని విజయం సాధిస్తుందని బీజేపీ జనరల్ సెక్రటరీ అరుణ్ సింగ్ చెప్పారు. అటు చంద్రబాబు సైతం కూటమి తిరుగులేని విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

**అందరూ కష్టపడ్డారు..**

అభ్యర్థులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో చంద్రబాబు పలు సూచనలు చేసారు. కూటమి విజయం కోసం మూడు పార్టీల నేతలు, కార్యకర్తలు మంచి సమన్వయంతో పనిచేశారని అన్నారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురంధేశ్వరితో పాటు మూడు పార్టీల నేతలు, కార్యకర్తలు బాగా కష్టపడ్డారన్నారు. కౌంటింగ్ ప్రక్రియలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలపై నేతలకు పలు సూచనలు చేశారు. ఎగ్జిట్ పోల్స్ అన్నీ కూటమి విజయం వైపే మొగ్గు చూపించాయి. కేంద్రంలో, రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతోంది. ఓటమి భయంతో కౌంటింగ్‌పై వైసీపీ అర్థం లేని ఆరోపణలు చేస్తోందన్నారు చంద్రబాబు. పోస్టల్ బ్యాలెట్ డిక్లరేషన్‌పై ఈసీ ఇచ్చిన ఆదేశాలపైనా కోర్టుకు వెళ్లి హంగామా చేయాలని చూశారన్న చంద్రబాబు.. కౌంటింగ్ రోజు కూడా అనేక అక్రమాలు, దాడులకు పాల్పడే అవకాశం ఉందన్నారు.

**అప్రమత్తంగా ఉండాలి..**

కౌంటింగ్ రోజున అభ్యర్థులు, ఏజెంట్లు చాలా జాగ్రత్తగా వ్యవహరించాలి. కౌంటింగ్ ఏజెంట్లు, చీఫ్ ఎలక్షన్ ఏజెంట్లు కౌంటింగ్ కేంద్రానికి సమయానికి చేరుకోవాలని.. అధికారులు నిబంధనలు పాటించేలా కౌంటింగ్ కేంద్రాల్లో ఏజెంట్లు పని చేయాలన్నారు. ఈవీఎంలను స్ట్రాంగ్ రూమ్‌ల నుండి తీసుకొచ్చే సమయంలో అప్రమత్తంగా వ్యహరించాలన్నారు. పూర్తి స్థాయి ఫలితాలు వచ్చే వరకు ఎవరూ అశ్రద్ధ వహించొద్దని సూచనలు చేశారు. కౌంటింగ్ పూర్తయ్యే వరకు ప్రతి ఏజెంట్ కౌంటింగ్ కేంద్రంలోనే ఉండాలని చంద్రబాబు దిశా నిర్దేశం చేశారు. ప్రతి అభ్యర్థి లీగల్ టీంను అందుబాటులో ఉంచుకోవాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురంధరేశ్వరి, జనసేన పీఏసీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ సూచించారు.



## ఏపీ తీరాన్ని తాకిన నైరుతి రుతుపవనాలు

- రెండు రోజుల ముందే ప్రవేశం
- రాయలసీమలో ఎంటర్

**విశ్వంభర, విశాఖపట్నం :** ఆంధ్రప్రదేశ్ రైతులకు వాతావరణ శాఖ గుడ్ న్యూస్ చెప్పింది. నైరుతి రుతుపవనాలు ఏపీ తీరాన్ని తాకినట్లు వెల్లడించింది. తాజాగా రాయలసీమలోకి ప్రవేశించిన నైరుతి రుతుపవనాలు కొన్ని ప్రాంతాల్లో విస్తరించాయని.. త్వరలోనే రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించనున్నాయని తెలిపింది. రాష్ట్రంలోకి నైరుతి రుతుపవనాలు ఎంటరైన నేపథ్యంలో ఏపీలో పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. అక్కడక్కడ పిడుగులు పడే ఛాన్స్ ఉందని, భారీ వర్షాలు కురిసే సమయాల్లో ప్రజలు ఎవరూ బయటకు వెళ్లొద్దని హెచ్చరించింది. అయితే, ఈ నెల 4, 5 తేదీల్లో రుతుపవనాలు ఆంధ్రప్రదేశ్‌లోకి ప్రవేశిస్తాయని మొదట వాతావరణ శాఖ అంచనా వేయగా.. అంచనాలకు రెండు రోజులు ముందే నైరుతి ఏపీ తీరాన్ని తాకింది. ఖరీఫ్ సీజన్ వ్యవసాయ పనులు స్టార్ట్ చేస్తోన్న రైతులు వాతావరణ శాఖ చెప్పిన స్వీట్ న్యూస్‌తో ఖుష్ అవుతున్నారు.

## కూటమి గెలవకుంటే నాలుక కోసుకుంటా..

- బుద్దా వెంకన్న సంచలన వ్యాఖ్యలు
- వైసీపీ గెలవకుంటే నువ్వు కోసుకుంటావా
- ఆరా మస్తాన్‌కు సవాల్

**విశ్వంభర, విజయవాడ :** ఏపీలో ఎగ్జిట్ పోల్స్ పై రచ్చ జరుగుతోంది. మొన్న శనివారం నాడు విడుదలైన ఎగ్జిట్ పోల్స్ మీద పెద్ద రచ్చ జరుగుతోంది. ఎందుకంటే కొన్ని ఎగ్జిట్ పోల్స్ వైసీపీ గెలుస్తుందని చెబుతుంటే.. ఇంకొన్ని మాత్రం టీడీపీ కూటమి గెలుస్తుందని చెబుతున్నాయి. ఎక్కువగా టీడీపీ కూటమి గెలస్తుందని చెప్పడంతో వాటిపై గందగోళం నెలకొంది. ఈ క్రమంలోనే ఆరా మస్తాన్ సర్వేలో వైసీపీ అధికారంలోకి వస్తుందని ఆ సంస్థ ఎగ్జిట్ పోల్ ను ప్రకటించింది. అయితే దానిపై టీడీపీ సీనియర్ నేత బుద్దా వెంకన్న సంచలన వ్యాఖ్యలు చేశా రు. టీడీపీ కూటమి అధికారంలోకి రాకపోతే నేను నాలుక కోసుకుంటా అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. విజయవాడలో బుద్ధా వెంకన్న ఆదివారం మీడియాతో మాట్లాడుతూ.. ఆరా



మస్తాన్ వైసీపీ గెలుస్తుందని ఫేక్ ఎగ్జిట్ పోల్స్ విడుదల చేశారని మండిపడ్డారు. వైసీపీ చెప్పినట్లు ఆరా మస్తాన్ ఎగ్జిట్ పోల్ ఫలితాలు ఇచ్చారని ఆరోపించారు. ఒకవేళ ఏపీలో కూటమి అధికారంలోకి రాకపోతే తాను నాలుక కోసుకుంటా అన్నారు. ఒకవేళ కూటమి ప్రభుత్వం ఏర్పడితే ఆరా మస్తాన్ నాలుక కోసుకుంటాడా అని సవాల్ విసిరారు. ఎలాగూ ఎన్నికల్లో ఓడిపోతామని తెలిసిన వైసీపీ నేతలు బెట్టింగ్ కాయటానికి ఫేక్ ఎగ్జిట్ పోల్స్ ప్రకటనలు ఇచ్చి ప్రజలతో మైండ్ గేమ్ ఆడుతున్నారని ఆరోపించారు.

# షర్మిలతో వైసీపీకి కోలుకోలేని దెబ్బ పడిందా..?

**కడప ఎంపీ సీటులోనూ ప్రభావం.. కాంగ్రెస్‌కు పడ్డ ఓటు బ్యాంకు వైసీపీదే**

**విశ్వంభర, కడప :** ఏపీ ఎన్నికల్లో ఈ సారి వైసీపీని షర్మిల పెద్ద దెబ్బ కొట్టినట్టు తెలుస్తోంది. ఆ ప్రభావమే ఎగ్జిట్ పోల్స్ లో స్పష్టంగా కనిపించింది. చాలా ఎగ్జిట్ పోల్స్ లో వైసీపీ కంటే టీడీపీ కూటమికే అధికారం దక్కుతుందని చెబుతున్నాయి. అయితే అందులోనూ వైసీపీ కంటే టీడీపీకి రెండు శాతం ఓటింగ్ ఎక్కువ వచ్చింది. దీంతో ఆ రెండు శాతం తేడాతో టీడీపీ కూటమి అధికారంలోకి రావడం ఖాయం అంటున్నారు. కానీ ఇక్కడ గమనించాల్సిన విషయం ఏంటంటే.. జీరో శాతం ఓటింగ్ ఉన్న కాంగ్రెస్ కు ఈ సారి 3 శాతం ఓటింగ్ నమోదు అయింది. ఇదంతా వైసీపీదే అంటున్నారు. దాంతో వైసీపీ కేవలం నాలుగు ఎంపీ సీట్లలోనే గట్టి పోటీ ఇస్తోంది. మిగతా 21 సీట్లు టీడీపీ ఖాతాలోనే పడిపోయాయి. ఆ నాలుగు సీట్లలో కడప నియోజకవర్గం కూడా ఉండి ఉండవచ్చు. కడప ఇలా రిస్క్ లో పడటానికి కారణం ఎవరో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు షర్మిల అని. వైఎస్ రాజశేఖర్ రెడ్డి రాజకీయ వారసురాలిగా అడుగు పెట్టిన ఆమె.. ఏపీ కాంగ్రెస్ చీఫ్ గా బాధ్యతలు తీసుకున్నారు. విస్తృతంగా పర్యటించారు. కడప లోక్ సభకు పోటీ చేశారు. కొంగు చాపి న్యాయం చేయాలని ప్రజల్ని అడిగి సెంటిమెంట్ రాజకీయాలు చేశారు.





**వారి ఓట్లు కాంగ్రెస్‌కు..**

షర్మిల దూకుడుగా చేసిన రాజకీయాల వల్ల కాంగ్రెస్ పార్టీ ఓటు బ్యాంక్ 3.3 శాతానికి చేరుకుంటుందని స్పష్టమయింది. గత ఎన్నికల్లో ఇది ఒక్క శాతం కూడా లేదు. కాంగ్రెస్‌కు పెరిగిన ప్రతి ఒక్క ఓటు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీదే అవుతుంది. ఎందుకంటే వైసీపీ ఓటు బ్యాంక్ మొత్తం కాంగ్రెస్ పార్టీదే. దళితులు, ముస్లింలు, గిరిజనుల్లో ఈ సారి కొంత కాంగ్రెస్ వైపు మళ్లినట్లుగా కనిపిస్తోంది. ఇది వైసీపీని భారీగా దెబ్బతీస్తున్నట్లుగా చెబుతున్నారు. షర్మిల భర్త అనిల్ కుమార్ కు క్రైస్తవ వర్గాల్లో ఉన్న నెట్ వర్క్ కూడా ఇందుకు ఉపయోగపడిందని అనుకోవచ్చు. కడప లోక్ సభ నియోజకవర్గంలో షర్మిల కూడా గట్టి పోటీ ఇచ్చారు. ఆమెకు ఆ లోక్ సభ నియోజకవర్గ పరిధిలో భారీగా ఓట్లు పోలయ్యాయని ఎగ్జిట్ పోల్ అంచనాలను బట్టి అర్థం చేసుకోవచ్చు. షర్మిల గెలవలేకపోవచ్చు కానీ అధికార వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి ఎక్కువగా నష్టం చేయడం ఖాయంగా కనిపిస్తోంది.

## హైదరాబాద్‌ను ఏపీ నుంచి విడదీయొద్దు

- ఇంకో పదేండ్లు ఉమ్మడి రాజధానిగా కొనసాగించాలి
- మాజీ మంత్రి శైలజానాథ్ వ్యాఖ్యలు



**విశ్వంభర, విజయవాడ :** ఏపీ నుంచి హైదరాబాద్ ను విడదీయొద్దని మాజీ మంత్రి,మాజీ పీసీసీ చీఫ్ డా సాకే శైలజానాథ్ అన్నారు. జూన్ 2తో హైదరాబాద్ తో ఏపీకి ఉన్న ఉమ్మడి రాజధాని సంబంధం ముగుస్తుందని ఆయన విచారం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌ను ఉమ్మడి రాజధానిగా మరో 10 సంవత్సరాలు పొడిగించాలని డిమాండ్ చేశారు. జూన్ 2న తెలంగాణ స్వరాష్ట్రంగా ఆవిర్భవించిన విషయం తెలిసిందే. రాష్ట్రం విభజన సమయంలో ఇచ్చిన హామీలు పరిష్కరింపబడకుండానే శాశ్వత ముగింపు పడిందని ఆయన అన్నారు. రాష్ట్ర విభజన చట్టంలో హైదరాబాద్‌ను తెలంగాణకు శాశ్వత రాజధానిగా, ఏపీ రాష్ట్రానికి పదేండ్ల పాటు తాత్కాలిక, ఉమ్మడి రాజధానిగా కేంద్రం ప్రకటించిందని ఆయన తెలియజేశారు. విభజన చట్టం సెక్షన్-8 ప్రకారం హైదరాబాద్ ఉమ్మడి రాజధాని ప్రాంతంలో పౌరుల రక్షణ బాధ్యతను గవర్నర్‌కు అప్పగించారన్నారు. ఉమ్మడి రాజధానిలో నివసించే ప్రజల ప్రాణ, ఆస్తి, రక్షణ భద్రతలను కాపాడే బాధ్యతలను గవర్నర్ చేతిలో ఉంటాయన్నారు. అందుకే ఆంధ్రప్రదేశ్ ప్రాంతం నుండి చాలా మంది ప్రజలు హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో తాత్కాలిక నివాసం ఏర్పరుచుకున్నాట్లు వివరించారు. మరి రేపటినుండి ఈ ప్రజల, ఆస్తులు రక్షణ బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం ఏమేరకు బాధ్యత తీసుకుంటుందని శైలజానాథ్ ప్రశ్నించారు. సెక్షన్-95 ప్రకారం విద్యార్థులకు పదేండ్ల పాటు ఉన్నత విద్యలో అవకాశాలు కల్పించాలన్నారు. ఆర్టికల్ -317 డీ ప్రకారం అడ్మిషన్ల కోటా పదేండ్ల వరకు కొనసాగించాలని, ఎమ్సెట్ సహా 7 రకాల ప్రవేశ పరీక్షల కూడా ఉమ్మడిగా నిర్వహించేవారని ఆయన గుర్తుచేశారు.

## కౌంటింగ్ రోజున టీడీపీ కుట్రలు చేస్తుందేమో

- వాటితోనే గెలవాలని చూస్తోంది
- వ్యవస్థలను మేనేజ్ చేస్తున్న చంద్రబాబు
- సజ్జల రామకృష్ణారెడ్డి ఆరోపణలు



**విశ్వంభర, గుంటూరు :** ఏపీలో ఎగ్జిట్ పోల్స్ మీద వైసీపీ, టీడీపీ నేతలు పరస్పర ఆరోపణలతో హొరెత్తిస్తున్నారు. తాజాగా ఏపీ ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. కౌంటింగ్ రోజున కుట్రలు చేసి టీడీపీ కూటమి అధికారంలోకి రావాలని చూస్తోందంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. వ్యవస్థలను మేనేజ్ చేయడంలో టీడీపీ అధినేత చంద్రబాబు ఆరితేరిన వ్యక్తి అని, జూన్ 4న ఓట్ల లెక్కింపు రోజున కుట్ర జరిగే అవకాశం ఉందని సజ్జల రామకృష్ణారెడ్డి అనుమానాలు వ్యక్తం చేశారు. ఎన్ని కుట్రలు, అక్రమాలు చేసైనా గెలిచేందుకు కూటమి నేతలు ప్రయత్నిస్తారని సజ్జల ఆరోపించారు. అందుకే వైసీపీ నేతలు, పోలింగ్ ఏజెంట్స్ కౌంటింగ్ సమయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కూటమి నేతలు కుట్రలకు తెరతీసినా, ధైర్యంగా పోరాడాలి కానీ సంయమనం కోల్పోవద్దని సజ్జల వైసీపీ కౌంటింగ్ ఏజెంట్లకు దిశానిర్దేశం చేశారు.

**వైసీపీ ఏజెంట్లతో జూమ్ మీటింగ్**

జూన్ 4న కౌంటింగ్ సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయం నుంచి జూమ్ మీటింగ్‌లో సజ్జల రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు. కౌంటింగ్ సమయంలో కూటమి నేతలు, కార్యకర్తలు కుట్రలకు వెనుకాడరని.. అయినా సంయమనంగా ఉండి, ఏదైనా తప్పు జరిగినట్లు గుర్తిస్తే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని తెలిపారు. మనం అప్రమత్తంగా లేకపోతే కుట్రలు, అక్రమాలు చేసైనా కూటమి గెలుస్తుందని సజ్జల ఆరోపణలు చేశారు. పోస్టల్ బ్యాలెట్‌పై ఏమైనా అనుమానం వస్తే కచ్చితంగా అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని, ఇంకా అవసరమైతే పార్టీ అధిష్టానానికి సమాచారం ఇవ్వాలని పార్టీ ఏజెంట్లకు సూచించారు. ఈ ఎన్నికల్లో కచ్చితంగా వైసీపీ గెలుస్తుందని, వరుసగా రెండోసారి జగన్ ఏపీ సీఎంగా ప్రమాణస్వీకారం చేస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఎగ్జిట్ పోల్స్ ఫలితాలలో స్థానికంగా ప్రముఖ సర్వే సంస్థలన్నీ ఆంధ్రప్రదేశ్‌లో వైసీపీ గెలిచే అవకాశం ఉందని వెల్లడించాయి. కానీ రాష్ట్రం గురించి అవగాహనా లేని కొన్ని నేషనల్ మీడియా సర్వే సంస్థలు ఇచ్చిన ఎగ్జిట్ పోల్ ఫలితాలు చూస్తే నవ్వొస్తుందన్నారు. ఒడిశాలో బీజేడీకి 0 సీట్లు ఇచ్చారు, తమిళనాడులో 9 సీట్లలో పోటీ చేస్తే 14 చోట్ల గెలుస్తుందని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇలా పలు రాష్ట్రాల్లో బీజేపీకి అనుకూలమైన ఫలితాలు ఇచ్చినట్లు ప్రజలు గుర్తించారని చెప్పుకొచ్చారు సజ్జల.

**సుప్రీంకోర్టుకు వెళ్తాం..**

చంద్రబాబు, పవన్ కళ్యాణ్ చర్చలు జరిపి బీజేపీ పంచన చేరారు. అంతా ఏకమై సీఎం జగన్‌ను ఓడించాలని గట్టిగా ప్రయత్నాలు చేశారని, అయినా మేం పేదల కోసం పని చేసినట్లు పేర్కొన్నారు. అన్ని పార్టీలు ఏకం కావడంతో సౌండ్ పెద్దగా వచ్చింది. దాంతో ఎన్నికల కమిషన్ పై సైతం ఒత్తిడి పెంచి రాష్ట్రంలో మార్పులు చేర్పులు జరిగాయా అని అనుమానాలు కలిగినట్లు చెప్పారు. పోస్టల్ బ్యాలెట్లపై ఆఖరికి సుప్రీంకోర్టును ఆశ్రయించి న్యాయం కోసం పోరాడతామన్నారు. అన్ని పార్టీలు కలవడంతో కౌంటింగ్ పై ఏమైనా ప్రభావం చూపిస్తుందేమోనని అనుమానాలు వ్యక్తం చేశారు. ఎగ్జిట్ పోల్ సర్వే ప్రకారం.. ఫీల్డ్ లో వచ్చిన ఫలితాల కంటే జూన్ 4న ఓట్ల లెక్కింపులో వైసీపీ మెరుగైన ఫలితాలు సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఇతర రాష్ట్రాల నుంచి ఓటు వేసేందుకు వచ్చినవారు ఏపీలో జరిగిన అభివృద్ధిని గమనించి ఓటు వేయడం శుభపరిణామం. ప్రజల తీర్పు ఈవీఎంలో ఉంది, కౌంటింగ్ లో భారీ మెజార్టీతో వైసీపీ అఖండ విజయం సాధించే ఛాన్స్ ఉందన్నారు.

## ఏపీలో కూటమిదే అధికారం

- ఇండియా టుడే ఎగ్జిట్ పోల్స్
- వైసీపీకి దారుణమైన సీట్లు

**విశ్వంభర, అమరావతి :** ఎన్ని ఎగ్జిట్ పోల్స్ వచ్చినా సరే ఇండియా టుడే ఎగ్జిట్ పోల్స్ పైనే అందరి దృష్టి ఉంటుంది. ఎందుకంటే ఈ సంస్థ ప్రకటించే ఫలితాలు దాదాపు నిజమే ఉంటాయని అందరూ నమ్ముతుంటారు. ఇక తాజాగా ఏపీ అసెంబ్లీ ఫలితాలపై ఇండియా టుడే ఎగ్జిట్ పోల్స్ ను ప్రకటించింది. ఏపీలో కూటమిదే అధికారం అని ఈ సంస్థ తేల్చింది. కూటమికి 98 నుంచి 120 సీట్లు వస్తాయని తెలిపింది. వైసీపీకి 55 నుంచి 77 సీట్లు వచ్చే అవకాశం ఉందని వెల్లడించింది. పార్టీల వారీగా చూస్తేటీడీపీకి 78 నుంచి 96, జనసేన 16 నుంచి 18, బీజేపీకి 4 నుంచి 6 సీట్లు వస్తాయని ఈ సంస్థ ఎగ్జిట్ పోల్స్ ప్రకటించింది. ఇక అధికార వైసీపీకి 55 నుంచి 77 సీట్లు మాత్రమే వస్తాయని చెప్పింది. ఈ సారి వైసీపీ ప్రతిపక్షానికే పరిమితం అవుతుందని చెప్పింది. కాంగ్రెస్‌కు 0 నుంచి 2 సీట్లు వచ్చే అవకాశం ఉందని అంచనా వేసింది. ఇక వైఎస్సార్‌సీపీకి 44 పర్సెంట్ ఓటు వస్తుందని చెప్పింది. అలాగే టీడీపీకి 42 పర్సెంట్, జనసేనకు 7 పర్సెంట్, బీజేపీకి 2 పర్సెంట్, కాంగ్రెస్ కు 2 పర్సెంట్, ఇతరులకు 3 పర్సెంట్ ఓట్లు వస్తాయని తెలిపింది.



## పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపులో ఆ రూల్ పాటించాల్సిందే

**రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముకేష్ కుమార్**

**విశ్వంభర, విజయవాడ:** కౌంటింగ్ కు సమయం దగ్గర పడుతుండటంతో ఎన్నికల సంఘం అధికారులు అప్రమత్తం అవుతున్నారు. పార్టీల నుంచి తీవ్రమైన ఒత్తిడి ఉండటంతో ఎలాంటి పొరపాట్లుకు తావు లేకుండా చూస్తున్నారు. ఈ క్రమంలోనే ఏపీ ఎన్నికల ప్రధాన అధికారి ముకేష్ కుమార్ మీనా కీలక సూచనలు చేశారు. జిల్లాల వారీగా కౌం టింగ్ ఏర్పాట్లపై వివరాలు అడిగి తెలుసుకు న్నారు. ఎన్నికల్లో తీవ్రమైన పోటీ నెలకొన్నందున ఓట్ల లెక్కింపు రోజు పూర్తి స్థాయి భద్రత ఏర్పాటు చేయాలన్నారు. శాంతి భద్రతల పరిరక్షణ విషయంలో ఏమాత్రం రాజీ పడకుండా కఠినంగా వ్యవహరించాలని సూచించారు. ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో ఎటువంటి అవాంతరాలకు తావు లే కుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అవాంతరా లు కలిగించేందుకు ప్రయత్నించే వారిని నిర్ధా క్షిణ్యంగా బయటకు పంపడమే కాకుండా వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశిం చారు. పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపులో కేంద్ర ఎన్నికల సంఘం ఇచ్చిన ఆదేశాలను పాటించాలని ముకేష్ కుమార్ మీనా సూచించారు. కౌంటింగ్ విషయం లో తీసుకోవల్సిన జాగ్రత్తలపై మరోసారి సూచన లు చేసారు సీఈవో. ఈవీఎంల కౌంటింగ్ పూర్తి అయిన వెంటనే అదే రోజు ప్రతి ఈవీఎంకు సీల్ వేసి భద్రపర్చాలని, ఆ పనిని వాయిదా వేయవద్దన్నారు. ఫలితాల ప్రకటనకు సంబంధించిన ఫారం-21సి/21ఇ లు ఓట్ల లెక్కింపు మరుసటి రోజే ఈసీఐకి చేరేలా చేపట్టాల్సిన చర్యలపై పలు సూచనలు చేసారు.

## భారత్‌పాక్ మ్యాచ్.. మాకూ టెన్షనే

### పాక్ కెప్టెన్ బాబర్



**విశ్వంభర, స్పోర్ట్స్ :** భారత్ పాక్ మ్యాచ్ అంటే యావత్ క్రికెట్ ప్రపంచంలో ఉత్కంఠ తారాస్థాయికి చేరుతుంది. ఇక వరల్డ్ కప్ లో దాయాదీ దేశాల పోరు ఇరు జట్ల ఆటగాళ్లపై ఒత్తిడిని అమాంతం పెంచేస్తాయనడంలో ఎటువంటి సందేహం అక్కర్లేదు. తాజా టీ20 వరల్డ్ కప్‌లో కూడా భారత్, పాక్ లు తలపడనున్న నేపథ్యంలో దాయాదీ దేశం కెప్టెన్ బాబర్ ఆజమ్ స్పందించాడు. పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు.

"భారత్ పాక్ జట్ల మధ్య మ్యాచ్ ఎప్పుడు జరిగినా చర్చ భారీ స్థాయిలో ఉంటుంది. ఆటగాళ్లలోనూ ఉత్సాహం వేరే స్థాయిలో ఉంటుంది. తమ అభిమాన జట్టు గెలవాలని ఆయా దేశాల ఫ్యాన్స్ కోరుకుంటారు. ప్లేయర్లుగా మాకూ కాస్త టెన్షన్ రావడం సహజమే. అయితే, ప్రాథమిక సూత్రాలకు లోబడి మాదైన శైలిలో క్రికెట్ ఆడేందుకు ప్రయత్నిస్తాం. తీవ్ర ఒత్తిడి ఉండే మ్యాచ్. కూల్ గా ఆడగలిగితే ఫలితం అనుకూలంగా వస్తుందని నమ్ముతా. దానికి తగ్గట్టు సాధన చేయాల్సిందే"

"కెప్టెన్ గా నాపై అంచనాలు భారీగానే ఉంటాయి. ఇలాంటి మెగా టోర్నీల్లో అవి మరింత ఎక్కువ. భావోద్వేగాలను నియంత్రించుకోవాలి. ఆటగాళ్లకు మద్దతుగా నిలిచి అత్యుత్తమ ప్రదర్శన రాబట్టేలా చేయాలి. ఆత్మవిశ్వాసం కలిగేలా ప్రయత్నిస్తే చాలు. భారత్ పాక్ జట్లను చూస్తే సమతూకంగానే ఉన్నాయి. ఆ రోజు ఎవరు ఆడితే వారిదే విజయం" అని బాబర్ వ్యాఖ్యానించాడు.

## మైదానంలోకి దూసుకొచ్చిన రోహిత్‌శర్మ అభిమాని..



తమ అభిమాన క్రికెటర్లను ప్రత్యక్షంగా కలవడానికి అభిమానులు ఉవ్విళ్లూరుతుంటారు. మ్యాచ్ జరుగుతోన్న సమయంలో సెక్యూరిటీని దాటుకొని గ్రౌండ్ వచ్చే సీన్స్ చాలా సార్లు కనిపిస్తూనే ఉంటాయి. తాజాగా టీ20 ప్రపంచకప్ 2024కు ముందు భారత్ ఆడిన వార్మప్ మ్యాచులో అలాంటి సంఘటనలో జరిగింది. ఈ మ్యాచ్‌లో సెక్యూరిటీ కళ్లుగప్పి ఓ అభిమాని గ్రౌండ్‌లోకి దూసుకొచ్చాడు. ఫీల్డింగ్ చేస్తున్న రోహిత్ శర్మ వద్దకు నేరుగా వెళ్లి హగ్ చేసుకున్నాడు.దీంతో పోలీసులు వెంటనే అప్రమత్తమయ్యారు. గ్రౌండ్‌లోకి దూసుకొచ్చి సదరు అభిమానిని నేలపై పడుకోబెట్టి చితకబాదారు. ఇది గమనించిన రోహిత్ శర్మ.. వద్దని చెబుతున్నా పోలీసులు వినిపించుకోలేదు. సదరు వ్యక్తిపై తమ కోపాన్ని ప్రదర్శించారు. ఇది గమనించిన మ్యాచ్ నిర్వాహకులు రోహిత్ శర్మ చేస్తున్న రిక్వెస్ట్‌ను పోలీసులు తెలిపారు. అయినా అతడిని ఈడ్చుకుంటూ గ్రౌండ్ నుంచి తీసుకెళ్లారు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కాగా సదరు అభిమానిని రక్షించేందుకు టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ చేసిన ప్రయత్నంపై నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు. వార్మప్ మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌ను చిత్తుగా ఓడించింది టీమ్ ఇండియా. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన టీమిండియా ఇరవై ఓవర్లలో 182 రన్స్ చేసింది. దాదాపు ఏడాదిన్నర తర్వాత టీమిండియాలోకి రీఎంట్రీ ఇచ్చిన వికెట్ కీపర్ రిషబ్ పంత్ హాఫ్ సెంచరీతో అదరగొట్టాడు. 32 బాల్స్‌లో నాలుగు ఫోర్లు, నాలుగు సిక్సర్లతో 53 రన్స్ చేశాడు. హార్దిక్ పాండ్య 40, సూర్యకుమార్ యాదవ్ 31 రన్స్‌తో రాణించారు. లక్ష్య ఛేధనలో తడబడిన బంగ్లాదేశ్ 122 పరుగులు మాత్రమే చేసింది.

## సులువుగా ఏదీ వదిలిపెట్టను.. చివరిదాకా పోరాడుతా

### హార్దిక్ పాండ్యా



**విశ్వంభర, స్పోర్ట్స్ :** టీమిండియా ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యాను వరుస వివాదాలు చుట్టుముడుతున్నాయి. ఇప్పటికే ఐపీఎల్ 2024లో కెప్టెన్‌గా విఫలమైన బాధలో ఉండగా ఇప్పుడు టీ 20 ప్రపంచ కప్‌లో ఎందుకు ఎంపిక చేశారనే విమర్శలను ఎదుర్కొంటున్నాడు. కెరీర్ పరంగా సవాళ్లు ఎదుర్కొంటున్న పాండ్యా వ్యక్తిగత జీవితంలోనూ ఆటుపోట్లను ఎదుర్కొంటున్నాడు. ఈ నేపథ్యంలో జట్టుతో కలిసిన హార్దిక్ బంగ్లాతో జరిగిన వార్మప్ మ్యాచ్‌లో చెలరేగాడు. 40 పరుగులు చేయడంతో పాటు ఒక వికెట్ తీశాడు. మ్యాచ్ అనంతరం మాట్లాడిన హార్దిక్ తాను ఎదుర్కొంటున్న కొన్ని క్లిష్టపరిస్థితులను మీడియాతో పంచుకున్నాడు. ఏ సమస్యను సులువుగా వదిలిపెట్టనని చెప్పాడు. చివరి వరకూ పోరాడేందుకే ప్రయత్నిస్తానని తెలిపాడు. 'జీవితం అయినా మైదానం అయినా.. ఈ యుద్ధంలో చివరి వరకూ పోరాడుతూనే ఉండాలి. క్లిష్ట పరిస్థితుల్లో వాటిని వదిలేస్తే అనుకున్న ఫలితాలను సాధించలేం. నేను సాధించడంపైనే దృష్టి పెడతా. ఇలాంటి పరిస్థితి నాకు కొత్తేం కాదు. పోరాడుతూ ఉంటే పరిస్థితుల్లో మార్పు వస్తుంది. జీవితంలో బ్యాడ్ డేస్ మాత్రమే కాదు.. గుడ్ డేస్ కూడా ఉంటాయి. త్వరలోనే అన్నీ అనుకూలంగా మారుతాయని ఆశిస్తున్నా' అని పాండ్యా అన్నాడు.

## టీ20 ప్రపంచకప్ ఆరంభం.. అమెరికాతో కెనడా ఢీ!



క్రికెట్ అభిమానులు ఎంతగానో ఎదురుచుస్తున్న టీ20 ప్రపంచకప్ 2024 ఆరంభమైంది. ఈ మ్యాచ్‌లు స్టార్ స్పోర్ట్స్, హాట్ స్టార్లలో ప్రత్యక్ష ప్రసారం అవుతున్నాయి. మెగా టోర్నీ తొలి మ్యాచ్‌లో అమెరికాతో కెనడా ఢీకొడుతోంది. ఈ మ్యాచ్ భారత కాలమానం ప్రకారం.. ఆదివారం (జూన్ 2) ఉదయం 6గంటలకు ఆరంభం అయింది. టాస్ గెలిచిన అమెరికా బౌలింగ్ ఎంచుకుంది. కెనడా 15 ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 137రన్స్ చేసింది. 2028 లాస్ ఏంజెల్స్ ఒలింపిక్స్‌లో క్రికెట్ భాగంగా ఉండటంతో ఈ ప్రపంచకప్ ద్వారా అక్కడి అభిమానులను ఆకర్షించేందుకు ఐసీసీ ప్రయత్నిస్తోంది. 20 జట్లను 5 టీమ్స్ చొప్పున 4 గ్రూప్లుగా విభజించారు. ఒక్కో జట్టు తమ గ్రూప్‌లోని ఇతర నాలుగు జట్లతో పోటీకి దిగుతాయి. టాప్2లో నిలిచిన రెండు టీమ్‌లు సూపర్ ఎయిట్‌కు చేరుకుంటాయి. సూపర్ ఎయిట్‌లో ఎనిమిది టీమ్‌లను రెండు గ్రూప్‌లుగా విడదీస్తారు. ఒక్కో టీమ్ మిగిలిన మూడు జట్లతో మ్యాచ్‌లు ఆడుతుంది. ఒక్కో గ్రూప్ నుంచి టాప్ 2లో నిలిచిన రెండు టీమ్‌లు సెమీస్ ఆడుతాయి. చివరగా ఫైనల్ మ్యాచ్ జరుగుతుంది. వెస్టిండీస్‌తో ఆరు, అమెరికాలలో మూడు వేదికలలో మ్యాచ్‌లు జరగనున్నాయి. కాగా, క్రికెట్'కు అంతగా ప్రాధాన్యం లేని అమెరికా వెస్టిండీస్‌తో కలిసి టీ20 ప్రపంచకప్‌నకు ఆతిథ్యస్తోంది. వెస్టిండీస్‌తో 2010లో మెగా పోరు జరిగింది. క్రికెట్‌ను మరిన్ని దేశాలకు విస్తరింపజేయడంలో భాగంగా ఐసీసీ తొలిసారి 20 జట్లతో ప్రపంచకప్ నిర్వహిస్తోంది. ర్యాంకింగ్, ఆతిథ్య జట్టు హోదాలో టీమ్‌లు ముందుగా అర్హత సాధించగా క్వాలిఫయింగ్ టోర్నీల ద్వారా మరిన్ని జట్లు బరిలో నిలిచాయి.

## వందల్లో పెట్టుబడితో లక్షల్లో రాబడి..



### పోస్టాఫీసులో అదిరిపోయే పథకం

**విశ్వంభర, బిజినెస్ :** భారతదేశంలో గ్రామాల్లో పెట్టుబడిపై ఆసక్తిని కలిగించాలనే పోస్టాఫీసుల ద్వారా వివిధ పొదుపు పథకాలను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇందులో నేషనల్ సేవింగ్స్ రికరింగ్ డిపాజిట్ ఖాతా అత్యంత ప్రజాదరణ పొందింది. పెట్టుబడుల్లో చిన్న పొదుపు పథకాలు కీలక పాత్ర పోషిస్తాయి. ఎందుకంటే అవి మార్కెట్‌అనుసంధానం కాని పథకాలలో డబ్బును డిపాజిట్ చేయడానికి ప్రజలను అనుమతిస్తాయి. పొదుపు పథకాలు వారికి హామీనిచ్చే రిటర్న్‌లను అందిస్తాయి. మెచ్యూరిటీపై అసలు మొత్తాన్ని తిరిగి ఇస్తాయి. మారుమూల గ్రామాల నుండి పెద్ద నగరాల వరకు ప్రజలకు అందించే అనేక చిన్న పొదుపు పథకాలను పోస్ట్ ఆఫీస్ నిర్వహిస్తుంది.నేషనల్ సేవింగ్స్ రికరింగ్ డిపాజిట్ ఖాతా (ఆర్‌డీ), లేదా పోస్ట్ ఆఫీస్ ఆర్‌డీ అలాంటి పథకంగా నిలుస్తుంది. ఇక్కడ ఒకరు వారి ఖాతాలో చిన్న మొత్తాలను డిపాజిట్ చేయవచ్చు మరియు దానిపై వడ్డీ పొందవచ్చు.

**పదేళ్ల మైనరూ అర్హులే..**

ఆర్‌డీ ఖాతాకు ఐదు సంవత్సరాల మెచ్యూరిటీ వ్యవధి ఉంది. దానిని మరింత పొడిగించవచ్చు. ఈ పథకం రుణ సదుపాయాన్ని కూడా అందిస్తుంది. ముందస్తుగా డిపాజిట్లు చేయవచ్చు లేదా అకౌంట్‌ను ముందుగానే మూసివేయవచ్చు. ఈ పోస్టాఫీసు యొక్క హామీతో కూడిన రిటర్న్ స్కీమ్‌కు సంబంధించిన ఫీచర్లను తెలుసుకోవాలి. ఆర్‌డీ ఖాతాలో రూ. 5,000, రూ. 10,000, రూ. 15,000, రూ. 20,000 నెలవారీ డిపాజిట్ల గురించి తెలుసుకుందాం. ఆర్‌డీ పథకం త్రైమాసికానికి కలిపి 6.7 శాతం వార్షిక వడ్డీని అందిస్తుంది. ఖాతాలో కనీస పెట్టుబడి రూ. 100 నుంచి రూ.10 గుణిజాలలో, గరిష్ట డిపాజిట్లకు పరిమితి ఉంటుంది. ఒక వ్యక్తి ఒక సింగిల్, జాయిన్ అకౌంట్ కలిగి ఉండవచ్చు లేదా ఒక సంరక్షకుడు మైనర్ లేదా మానసిక స్థితి సరిగా లేని వ్యక్తి తరపున ఖాతాను తెరవవచ్చు. 10 ఏళ్లు పైబడిన మైనర్ కూడా వారి పేరు మీద ఖాతాను తెరవవచ్చు.

**ఐదేళ్లపాటు అడ్వాన్స్ డిపాజిట్లు**

ఒక నెలలో డిపాజిట్ చేయకపోతే రూ.100 డినామినేషన్ ఖాతాకు రూ.1 రుసుము విధించబడుతుంది. నాలుగు సాధారణ డిఫాల్ట్‌ల తర్వాత, ఖాతాను నిలిపివేయవచ్చు. రెండు నెలల్లోపు పునరుద్ధరించవచ్చు. దాన్ని తెరిచే సమయంలో మరియు ఆ తర్వాత వారి ఖాతాలో ఐదేళ్లపాటు అడ్వాన్స్ డిపాజిట్లు చేయవచ్చు. ఒకరు 12 వాయిదాలు జమ చేసి, ఒక సంవత్సరం పాటు ఖాతాను కొనసాగిస్తే వారు ఖాతాలోని బ్యాలెన్స్ క్రెడిట్‌లో 50 శాతానికి అర్హత ఉంటుంది. ఆర్‌డీ ఖాతాకు వర్తించే రుణంపై వడ్డీ 2 శాతం ఆర్‌డీ వడ్డీ రేటుగా వర్తిస్తుంది. ఖాతా తెరిచిన తేదీ నుండి 3 సంవత్సరాల తర్వాత కూడా ఆర్డీ ఖాతాను ముందుగానే మూసివేయవచ్చు.

**నెలకు రూ.5,000 డిపాజిట్ చేస్తే**

మీ నెలవారీ డిపాజిట్ రూ. 5,000 లేదా ఐదేళ్లలో మొత్తం రూ. 300,000 అయితే, 6.70 శాతం చొప్పున, మీకు రూ. 56,830 వడ్డీ లభిస్తుంది. మెచ్యూరిటీ మొత్తం రూ. 3,56,830 అవుతుంది.

**నెలకు రూ.10,000 డిపాజిట్ చేస్తే**

మీ నెలవారీ డిపాజిట్ రూ. 10,000 లేదా ఐదేళ్లలో మొత్తం రూ. 600,000 అయితే, మీ వడ్డీ రూ. 1,13,659 అవుతుంది. మీరు మెచ్యూరిటీపై రూ. 7,13,659 పొందుతారు.

**నెలకు రూ.15,000 డిపాజిట్ చేస్తే**

మీ నెలవారీ కంట్రిబ్యూషన్ రూ. 15,000 లేదా ఐదేళ్లలో మొత్తం రూ. 900,000 అయితే, మీకు వడ్డీ రూ. 1,70,492గా ఉంటుంది. మెచ్యూరిటీ మొత్తం రూ. 10,70,492 అవుతుంది.

**నెలకు రూ.20,000 డిపాజిట్ చేస్తే**

మీ నెలవారీ డిపాజిట్ రూ. 20,000 లేదా ఐదేళ్లలో మొత్తం రూ. 12,00,000 అయితే, మీకు రూ. 2,27,315 వడ్డీ లభిస్తుంది మరియు మెచ్యూరిటీ మొత్తం రూ. 14,27,315 అవుతుంది.

## ఇన్సూరెన్స్ పాలసీలో జాగ్రత్తలు అవసరం




**విశ్వంభర, బిజినెస్:** ఇన్సూరెన్స్ పాలసీ తీసుకునేటప్పుడు ఇన్సూరెన్స్ అగ్రిమెంట్ లేదా ఫారమ్‌లలో ఉండే అన్ని కాలమ్స్ మనం చదవడానికి మనం సాధారణంగా ఇబ్బంది పడతాము. ఎందుకంటే, అవి చాలా పేజీలు ఉంటాయి.. అన్నీ ఎక్కడ చదువుతాములే.. టైమ్ వేస్ట్ అని అనుకుంటాం. అయితే, ఇందులో ఉండే చాలా నియమాల గురించి మనకు ఇన్సూరెన్స్ ఏజెంట్ వివరణ ఇవ్వడు లేదా వివరంగా చెప్పడు. ఇన్సూరెన్స్ విషయంలోనే కాకుండా అనేక ఆర్థిక లావాదేవీల్లో కూడా మన విధానం ఇలాగే ఉంటుంది. ఏజెంట్‌పై ఉదాసీనత లేదా నమ్మకం మనల్ని అప్రమత్తంగా ఉండకుండా చేయవచ్చు. అలాంటి పరిస్థితిలో చాలా సార్లు ఏజెంట్లు వ్యాపారాన్ని తప్పుదారి పట్టించే కొన్ని అంశాలను ప్రస్తావించరు. దీని వల్ల భవిష్యత్తులో మనకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంటుంది.

**క్లెయిమ్‌ను కంపెనీ ఎప్పుడు తిరస్కరిస్తుంది**

ఉదాహరణకు, ఇన్సూరెన్స్ చేయించుకున్న వ్యక్తికి దీర్ఘకాలిక గుండె జబ్బు ఉంటుంది. వారు ఇన్సూరెన్స్ చేస్తారు. పాలసీ తీసుకున్న ఏడాదిలోపే వ్యాధి బారిన పడి మరణిస్తారు. అప్పుడు కుటుంబ సభ్యులు ఇన్సూరెన్స్ సొమ్మును క్లెయిమ్ చేసేందుకు ఇన్సూరెన్స్ కంపెనీని సంప్రదిస్తారు. కానీ, అతని దురదృష్టవశాత్తు ఆ క్లెయిమ్‌ను కంపెనీ తిరస్కరిస్తుంది. కారణం ఏమిటంటే, మరణించిన పాలసీదారు ఇన్సూరెన్స్ చేస్తున్నప్పుడు చాలా కాలంగా తనకు ఉన్న ఈ వ్యాధిని వెల్లడించలేదు.

**ప్రతి అంశాన్ని అడిగి తెలుసుకోవాలి**

చాలా మంది ఈ తప్పు చేస్తుంటారు. ఇన్సూరెన్స్ క్లెయిమ్‌లు రిజెక్ట్ అవడానికి ఇది చాలా సాధారణ కారణాలలో ఒకటిగా ఉంటుంది. ఇన్సూరెన్స్ పాలసీ డాక్యుమెంట్ అనేది ఇన్సూరెన్స్ కంపెనీ - పాలసీదారు మధ్య ఒప్పందం లాంటిది. దీనిలో చాలా నిబంధనలు.. షరతులు ఉంటాయి. ఆయా కంపెనీల పాలసీల ఆధారంగా ఇటువంటి పరిస్థితులు మారవచ్చు. ఇక్కడ కొన్ని నిబంధనలు - షరతులు అర్థం కాకపోవచ్చు. మీకు అర్థం కాకపోతే సంతకం చేయవద్దు. ఏజెంట్‌ని అడిగి క్లియర్ గా ఆవిషయాన్ని అర్థం చేసుకున్నాకే సంతకం చేయండి.

**అనారోగ్యం గురించి సమాచారాన్ని దాచవద్దు**


ఇన్సూరెన్స్ పాలసీ తీసుకునేటప్పుడు మీరు ఏదైనా దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యను ఎదుర్కొంటున్నట్లయితే, దానిని తప్పనిసరిగా పేర్కోవడం మంచిది. ఏజెంట్ చెప్పిన దానితో సరిపెట్టుకోవద్దు. మీరు అందించిన ఏదైనా తప్పుడు సమాచారం మీ పాలసీ రద్దుకు దారితీయవచ్చు. ఇన్సూరెన్స్ కొనుగోలు చేసేటప్పుడు వినియోగదారులు దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలను మాత్రమే ప్రస్తావించడం సరిపోదు. అంతే కాకుండా సిగరెట్ తాగడం వంటి చెడు అలవాట్లు ఉంటే వాటి గురించి కూడా తప్పకుండా తెలియజేయాలి.

**చివరగా ఒక మాట..**

పాలసీ తీసుకునేటప్పుడు, మీరు ఒప్పందాన్ని జాగ్రత్తగా పరిశీలించాలి. మీ పాలసీ కవరేజీని నిలిపివేసే లేదా పరిమితం చేసే అంశాలు ఉన్నాయని గమనించండి. దీని గురించి మీ ఏజెంట్‌ని అడగండి, ప్రతి విషయాన్ని గుడ్డిగా విశ్వసించకండి. పన్ను ప్రయోజనం, లాక్‌ఇన్ పీరియడ్, నామినీ వంటి అనేక అంశాలు పాలసీ డాక్యుమెంట్‌లలో ఉంటాయి. అలాంటి వాటి గురించి అడగండి. బాగా అర్థం చేసుకోండి. లేకుంటే అది మీకు నష్టాన్ని కలిగించవచ్చు.

### ఈ విషయాలు తెలియకపోతే పాలసీదారు మరణించినపుడు నష్టపోతారు..

- పాలసీ పత్రంలో పాలసీదారు మరణ ప్రయోజనాలపై ఒక విభాగం ఉంటుంది. దానిని శ్రద్ధగా చదవాలి. పాలసీదారు మరణిస్తే క్లెయిమ్ డబ్బులో కొంత భాగాన్ని ఎందుకు నిలిపివేస్తారో తెలుసుకోవడానికి దీన్ని ముందుగా చదవండి.
- నిర్ణీత వ్యవధిలోగా పాలసీదారు ఆత్మహత్య చేసుకుంటే, అటువంటి సందర్భంలో చాలా పాలసీలలో డెత్ క్లెయిమ్ చెల్లించరు.
- చట్టవిరుద్ధమైన, నేరపూరిత కార్యకలాపాలలో పాలుపంచుకున్నప్పుడు ఇన్సూరెన్స్ చేసుకున్న వ్యక్తి మరణిస్తే మరణ ప్రయోజనం కోసం క్లెయిమ్ కూడా ఉండదు. అలాగే ప్రసవ సమయంలో తల్లి చనిపోయినా చాలా పాలసీలు కవరేజీని అందించవు.
- కొన్ని విమానయాన సంస్థలు ప్రైవేట్ విమాన ప్రయాణంలో ప్రమాదం కారణంగా మరణిస్తే మరణ పరిహారం క్లెయిమ్‌లను అందించవు.
- కొన్ని ఇన్సూరెన్స్ కంపెనీలు మందు తాగి డ్రైవింగ్ చేయడం లేదా సీటు బెల్ట్ ధరించకుండా వేగంగా నడపడం వల్ల ప్రమాదవశాత్తు మరణిస్తే కవరేజీని అందించడం లేదు.
- చాలా పాలసీలు యుద్ధం కారణంగా మరణిస్తే కవర్ అందించవు.



# రీరిలీజ్‌కు సిద్ధమైన ప్రభాస్ 'చక్రం'

**విశ్వంభర, సినిమా:** సినీ ఇండస్ట్రీలో ప్రస్తుతం రీరిలీజ్ ట్రెండ్ నడుస్తోంది. హీరోల జన్మదిన వేడుకలు లేదా సినిమా వార్షికోత్సవాల సందర్భంగా ఇదివరకు సూపర్ హిట్‌గా నిలిచిన చిత్రాలను విడుదల చేస్తున్నారు. దీంతో థియేటర్లలో అభిమానుల సందడి అంతాఇంతా కాదు. ఇదిలా ఉంటే యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ కెరీర్‌లోనే బిగ్గెస్ట్ హిట్‌గా నిలిచిన వర్షం, మిస్టర్ పర్‌ఫెక్ట్ సినిమాలు ఇప్పటికే రీరిలీజ్ అయిన విషయం తెలిసిందే. తాజాగా ప్రభాస్ నటించిన క్లాసికల్ మూవీ 'చక్రం' సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. జూన్ 8వ తేదీన గ్రాండ్‌గా రీరిలీజ్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. కృష్ణవంశీ దర్శకత్వంలో 2005లో విడుదలైన ఈ సినిమా అప్పట్లో మిశ్రమ ఫలితాలను అందుకుంది. అయినప్పటికీ చాలా మంది గుండెల్లో ఈ సినిమా ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది. టీవీల్లో ఈ సినిమా ప్రసారమయ్యాక ప్రేక్షకాదరణ పెరిగింది. అయితే ఈ సినిమాలో మ్యూజిక్ డైరెక్టర్ చక్రి అందించిన పాటలు హైలెట్ అని చెప్పాలి. ఇప్పటికీ చాలా మంది తమ ప్లేలిస్ట్‌లో ఈ సినిమా పాటలు వింటుంటారంటే అతిశయోక్తికాదు. ఈ క్లాసికల్ సినిమాలో ఛార్మి, ఆసిన్‌లు హీరోయిన్లుగా నటించారు. అదేవిధంగా ప్రకాష్‌రాజ్ హీరో తండ్రి పాత్రలో నటించి మెప్పించారు.



## గిల్ తో ప్రముఖ నటి పెళ్లి.. క్లారిటీ వచ్చేసిందోచ్!

సోషల్ మీడియా వచ్చిన తర్వాత సెలబ్రిటీల గురించి ఏదో ఒక రూమర్ వినిపిస్తూనే ఉంది. అందులో కొన్ని నిజాలు కూడా ఉంటాయి. ఇంకొన్ని అబద్ధాలు కూడా ఉంటాయి. అయితే తాజాగా ఆదివారం ఉదయం నుంచి ఓ స్టార్ సెలబ్రిటీ పెళ్లి వార్త సోషల్ మీడియాను కుదిపేస్తోంది. టీవీ నటి రిధిమా పండిట్, టీం ఇండియా ప్లేయర్ శుభ్‌మన్ గిల్ పెళ్లి చేసుకోబోతున్నారనే వార్త సోషల్ మీడియాలో తెగ హల్ చల్ చేస్తోంది. ఈ వార్తను ఎవరు మొదట లీక్ చేశారో తెలియదుకానీ.. ఇప్పుడైతే ఈ న్యూస్ అంతటా హాట్ టాపిక్ అవుతోంది. వీరి వివాహం డిసెంబర్ 2024లో జరుగుతుందని కూడా మరో టాక్ వినిపిస్తోంది. ఇక్కడ ఇంకో ఇంట్రెస్టింగ్ విషయం ఏంటంటే.. వీరిద్దరి మధ్య వయసు గ్యాప్ 9 ఏళ్లు ఉంది. రిధిమాకు 33 ఏళ్లు. శుభ్‌మన్ వయసు 24 ఏళ్లు. మరి ఇంత ఏజ్ గ్యాబ్ ఉన్న వీళ్లిద్దరూ సీక్రెట్ ప్రేమ ద్వారా ఒక్కటవుతున్నారా? లేక పెద్దల కారణంగా ఒక్కటవుతున్నారా చర్చ జరగుతోంది. అయితే ఓ పక్క ఈ చర్చ జోరుగా జరుగుతున్న క్రమంలోనే.. రంగంలోకి దిగిన రిధిమా ఈ న్యూస్‌కు చెక్ పెట్టే ప్రయత్నం చేసింది. ఇందులో వాస్తవం లేదంటూ క్లారిటీ ఇచ్చింది. తాను పొద్దున్నే లేచేసరికి జర్నలిస్టుల నుంచి చాలా ఫోన్ కాల్స్ వచ్చాయని చెప్పిన ఈమె... వాళ్లందరూ తన పెళ్లి గురించి ఒక ప్రశ్న అడిగారని చెప్పుకొచ్చింది. అయితే అది అవాస్తమని చెప్పడంతో దీనికి చెక్ పడింది.

# పిఠాపురంలో శర్వానంద్ భారీ ఈవెంట్..

## మనమే సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ ప్లాన్

## ముఖ్య అతిథిగా రామ్ చరణ్



పిఠాపురం పేరు మొన్నటి వరకు ఎవరికీ పెద్దగా తెలియదు. కానీ ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో ఆ పేరు మార్మోగిపోతోంది. దానికి ముఖ్య కారణం జనసేన పార్టీ అధినేత, పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ఈ నియోజకవర్గం నుంచి పోటీ చేయడమే. దాంతో ఒక్కసారిగా ఏపీ, తెలంగాణ ప్రజల్లో ఆ ఊరి పేరు రచ్చ చేస్తోంది. అయితే ఇక్కడ నుంచి పవన్ కల్యాణ్ భారీ మెజార్టీతో గెలుస్తారని అంతా అంటున్నారు. ఈ క్రమంలోనే ఇప్పుడు ఇక్కడ మెగా ఫ్యామిలీకి అత్యంత సన్నిహితుడు అయిన శర్వానంద్ ఇక్కడ ఓ సినిమా ఈవెంట్ ను ప్లాన్ చేస్తున్నారు. అది కూడా ఎలక్షన్ రిజల్ట్ వచ్చిన తర్వాత రోజునే ఆయన ఇలా ఈవెంట్ ను ప్లాన్ చేయబోతున్నారు. జూన్ 4న ఎలక్షన్ రిజల్ట్ వస్తుంది. జూన్ 5న పిఠాపురంలో 'మనమే' ప్రీ రిలీజ్ ఈవెంట్ చేయాలని శర్వానంద్ అండ్ 'మనమే' టీమ్ ప్లాన్ చేస్తున్నట్లు తెలిసింది. మెగాస్టార్ చిరంజీవి తనయుడు, గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ కు శర్వానంద్ క్లోజ్ ఫ్రెండ్. అలాగే, 'మనమే' నిర్మిస్తున్న యూవీ క్రియేషన్స్ బ్యానర్ కీలక వ్యక్తుల్లో ఒకరైన నిర్మాత విక్రమ్ కూడా వాళ్లిద్దరికీ క్లోజ్. స్నేహితుల కోసం 'మనమే' ప్రీ రిలీజ్ వేడుకకు రామ్ చరణ్ అతిథిగా హాజరు కానున్నారని తెలుస్తోంది. ఎన్నికల ఫలితాలు వచ్చిన మరుసటి రోజు... అదీ పిఠాపురంలో... రామ్ చరణ్ ముఖ్య అతిథిగా... అంటే ఈ సినిమా ఈవెంట్ కాస్తా పవన్ కళ్యాణ్ విజయోత్సవ సభ అవుతుందని ఫిల్మ్ నగర్ వర్గాల్లో డిస్కషన్ జరుగుతోంది. పవన్ కల్యాణ్ ఎఫెక్ట్ తో ఇక్కడ రాబోయే రోజుల్లో మరిన్ని సినిమా ఈవెంట్లు జరుగుతాయని అంటున్నారు.

# సమ్మర్ టూర్‌లో ప్రేమ పక్షులు..




సౌత్ ఇండియాలో ప్రేమ పక్షులు అంటే ఇప్పుడు అందరికీ టక్కున హీరో సిద్దార్థ్‌అదితి రావు హైదరీ పేర్లే గుర్తుకు వస్తాయి. అంతగా వీరిద్దరూ చెక్కర్లు కొడుతున్నారు. వీరిద్దరూ రెండేళ్లుగా డేటింగ్ లో ఉన్నారు. మహాసముద్రం సినిమా సమయం నుంచే ఇద్దరూ డేటింగ్ చేసుకుంటున్నారు. అయితే వీరిద్దరూ ఇటీవల నిశ్చితార్థం చేసుకున్నారు. కొంత కాలంగా సీక్రెట్ డేటింగ్‌లో ఉన్న ఈ ప్రేమ పక్షులు త్వరలో పెళ్లి పీటలు కూడా ఎక్కబోతున్నారు. అయితే పెళ్లికి ముందే ఈ లవ్ బర్డ్స్ సమ్మర్ వెకేషన్ కోసం ఇటలీ వెళ్లిపోయారు. ఇటలీలోని టస్కనీ వెకేషన్ కు వెళ్లిన సిద్ధార్థ్, అదితీ రావు అక్కడి అందమైన ప్రదేశాలను ఆస్వాదించారు. అనంతరం తమ వెకేషన్ కు సంబంధించిన ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఇటలీలోని ప్రకృతి అందాలను ఎంజాయ్ చేస్తూ క్లోజ్‌గా దిగిన ఫొటోలను తమ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాల్లో షేర్ చేశారీ లవ్ బర్డ్స్. దీంతో ఈ ఫొటోలు ఇప్పుడు నెట్టింట వైరల్ గా మారాయి. వీటిని చూసిన అభిమానులు, నెటిజన్లు మేడ్ ఫర్ ఈజ్ అదర్ అంటూ ఈ జంటకు విషెస్ చెబుతున్నారు. అలాగే పెళ్లి కబురు ఎప్పుడు చెబుతారంటూ కామెంట్స్ చేస్తున్నారు. గత మార్చిలో సిద్దార్థ్, అదితిలో వనపర్తిలోని ఓ ప్రముఖ దేవాలయంలో చాలా సీక్రెట్‌గా నిశ్చితార్థం చేసుకున్నారు. అయితే చాలామంది మొదట ఈ వేడుకను పెళ్లి అనుకున్నారు. కానీ వారిద్దరూ తాము ఎంగేజ్ మెంట్ చేసుకున్నామని చెపారు. మరి పెళ్లిఎప్పుడు చేసుకుంటారో చూడాలి.

# మహేశ్- జక్కన్న మూవీ మొదలయ్యేది అప్పుడే

తెలుగు సినిమా ప్రపంచం అంతా ఇప్పుడు ఒక పెద్ద కాంబో గురించి ఎదురు చూస్తోంది. అదేంటంటే దర్శక ధీరుడు రాజమౌళి, సూపర్ స్టార్ మహేశ్ బాబు సినిమా గురించే. వాస్తవానికి ప్రతి ఏడాది మే 31 కు మహేష్ సినిమా అప్‌డేట్ ఒకటి వచ్చేది.. కానీ ఈసారి అలాంటిదేం రాలేదు. రాజమౌళి సినిమా కాబట్టి అలాంటిది ఎక్స్‌పెక్ట్ చేయలేదు ఫ్యాన్స్. కానీ వాళ్లకు కూడా ఆశ ఉంటుంది కదా..? ఆ ఆశతోనే అడుగుతున్నారు SSMB29 అప్‌డేట్ ఎక్కడా అని.. త్రిబుల్ ఆర్ సినిమా వచ్చి కూడా రెండేళ్లు దాటిపోయింది. కానీ ఇంకా రాజమౌళి మహేశ్ బాబు మూవీని పట్టాలెక్కించలేదు. SSMB29లో వాళ్లు నటిస్తున్నారు.. వీళ్లు నటిస్తున్నారంటూ వస్తున్న వార్తలకు ఇదివరకే చెక్ పెట్టారు జక్కన్న. అంతేకాదు.. స్క్రిప్ట్ వర్క్ పూర్తైందని.. ప్రీ ప్రొడక్షన్ జరుగుతుందని మాత్రమే అప్‌డేట్ ఇచ్చారు. దానికి మించిన ఏ అప్‌డేట్ ఇవ్వలేదు. ఇప్పటికే హైదరాబాద్‌లోని అల్యుమినియం ఫ్యాక్టరీలో SSMB29 కోసం సెట్ వర్క్ జరుగుతుంది.

# పురుషుల్లో నపుంసకత్వం

- ఆందోళన కలిగిస్తోన్న అధ్యయనం
- మానవ స్పెర్మ్‌లో మైక్రోప్లాస్టిక్‌లు
- భవిషత్తులో సంతానం కలగడం కష్టమే..
- లంచ్ బాక్సులు, వాటర్ బాటిల్సే కారణం
- న్యూ మెక్సికో యూనివర్సిటీ పరిశోధకుల వెల్లడి



**విశ్వంభర, ఫీచర్ :** అమెరికన్ జర్నల్ ఆఫ్ టాక్సికోలాజికల్ సైన్సెస్‌లో ప్రచురించబడిన ఒక కొత్త అధ్యయనం మానవ వృషణాలు, స్పెర్మ్‌లలో మైక్రోప్లాస్టిక్ కణాల ఉనికిని వెల్లడించింది. ఇప్పుడు ఈ విషయం.. ప్లాస్టిక్ కాలుష్యం యొక్క ప్రభావాల గురించి ఆందోళనలను పెంచుతుంది. న్యూ మెక్సికో విశ్వవిద్యాలయంలోని పరిశోధకులు కుక్కలు మరియు మానవుల నుండి కణజాల నమూనాలను విశ్లేషించారు. వాటిలో మైక్రోప్లాస్టిక్‌లను కనుగొన్నారు. మైక్రోప్లాస్టిక్ కణాలు నపుంసకత్వాన్ని పెంచుతాయని ఈ అధ్యయనం సూచిస్తుంది.

**మానవ శరీరంలో మైక్రోప్లాస్టిక్స్**

యూఎన్ఎం కాలేజ్ ఆఫ్ నర్సింగ్‌లోని ప్రొఫెసర్ జియాంగ్‌జోన్ జాన్ యు నేతృత్వంలోని పరిశోధన బృందం ఈ అధ్యయనాన్ని నిర్వహించింది. అధ్యయనంలో 47 కుక్కలు మరియు 23 మానవ వృషణాలలో 12 రకాల మైక్రోప్లాస్టిక్‌లు కనుగొనబడ్డాయి. "మా అధ్యయనం అన్ని పరీక్షలలో మానవ స్పెర్మ్‌లో మైక్రోప్లాస్టిక్స్ ఉనికిని వెల్లడించింది" అని అధ్యయనంలో పాల్గొన్న శాస్త్రవేత్త చెప్పారు. "ఈ మధ్యన పురుషుల్లో నపుంసకత్వ సమస్య ఎందుకు వస్తోందో ఆలోచిస్తే.. అందుకు కారణం ఇదే అయి ఉంటుందనిపిస్తోంది" అని వారి భావిస్తున్నారు. సాధారణంగా ఉపయోగించే ప్లాస్టిక్ రకం పాలిథిలిన్, దీనిని ప్లాస్టిక్ సంచులు, సీసాలలో ఉపయోగిస్తారు. తదుపరిది పీవీసీ. పాలీవినైల్ క్లోరైడ్ అని పిలుస్తారు. "ప్రారంభంలో, మైక్రోప్లాస్టిక్‌లు పునరుత్పత్తి వ్యవస్థలోకి చొచ్చుకుపోగలవు. కుక్కలలో చేసిన అధ్యయన ఫలితాలను చూసి ఆశ్చర్యపోయినట్లు శాస్త్రవేత్తలు తెలిపారు. మానవులలో ఇలాంటి ఫలితాలను చూసినప్పుడు ఆందోళన కలిగిస్తుందని పేర్కొన్నారు.

**ప్లాస్టిక్ లంచ్ బాక్సులు, వాటర్ బాటిల్స్‌తో ప్రమాదమే..**

"ఈ పరిశోధన మైక్రోప్లాస్టిక్‌లు మన వాతావరణంలో తిరుగుతున్నాయని మరియు మానవ శరీరంలోని అత్యంత సున్నితమైన భాగాలకు చేరుతున్నాయని నిర్ధారిస్తుంది. నపుంసకత్వంపై మైక్రోప్లాస్టిక్‌ల ప్రభావాన్ని గుర్తించడానికి మరిన్ని అధ్యయనాలు అవసరం. గతంలో కూడా చేసిన అధ్యయనాలు ఇదే విషయాన్ని వెల్లడించాయి. ప్లాస్టిక్ మనకు తెలియకుండానే మన శరీరంలోకి రోజు కొద్ది కొద్దిగా వెళ్తుంది. లంచ్ బాక్సులు, వాటర్ బాటిల్స్, వంట గదిలో సామాన్లు ఇలా ఎన్నో రకాలుగా ప్లాస్టిక్ మన శరీరంలోకి వెళ్తుంది. దీన్ని నివారించగలకపోతే భవిష్యత్తులో పురుషులు తండ్రి కావడం అనేది కలే అయ్యే ప్రమాదం ఉంది.

# ఏటా 24 మిలియన్ల మందికి పిచ్చి

## వెల్లడించిన ప్రపంచ ఆరోగ్య సంస్థ



స్కిజోఫ్రెనియా .. దీన్నే వాడుక భాషలో పిచ్చి లేదా మెంటల్ లేదా మతిభ్రమణం అంటారు. ఈ వ్యాధి ఉన్న వాళ్ళు వింతగా ప్రవర్తిస్తూ భ్రమల్లో జీవిస్తుంటారు. దీని నిర్ధారణకు ప్రత్యేకమైన వైద్య పరీక్షలేమీ లేవు. వ్యక్తి ప్రవర్తనలో మార్పులు ఎలా సంభవించాయి, దైనందిన జీవితంపై వీటి ప్రభావం ఎలా ఉంది అనే విషయాలను కుటుంబ సభ్యులనుంచి సేకరిస్తారు. స్కిజోఫ్రెనియా అనేది మెదడు యొక్క అభిజ్ఞా పనితీరును ప్రభావితం చేసే మానసిక ఆరోగ్య రుగ్మత. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఈ వ్యాధి సుమారు 24 మిలియన్ల మందిని ప్రభావితం చేస్తుందని నివేదించింది. స్కిజోఫ్రెనియా అనేది మహిళల కంటే పురుషులనే ఎక్కువగా ప్రభావితం చేస్తుందని నిపుణులు కూడా చెబుతున్నారు. స్కిజోఫ్రెనియాకు ప్రధాన కారణం మెదడులోని రసాయన అసమతుల్యత, ముఖ్యంగా డోపమైన్ పెరుగుదల, ఇది నరాల కణాల మధ్య సందేశాలను ప్రసారం చేయడానికి ఉపయోగించే పదార్థం. ఇవే కాకుండా మానసికపరమైన అంశాలు, కుటుంబ సమస్యలు, సంఘర్షణలతో కూడిన జీవితం ఈ వ్యాధి ముప్పును పెంచుతుందని ఆరోగ్య నిపుణులు అంటున్నారు.స్కిజోఫ్రెనియా అనేది చికిత్స చేయగల మానసిక వ్యాధి, ఇది ప్రపంచవ్యాప్తంగా 20 మిలియన్లకు పైగా ప్రజలను ప్రభావితం చేస్తుంది. ఈ వ్యాధి ఇరవైల ప్రారంభంలో కనిపించడం ప్రారంభమవుతుంది. బాల్యం మరియు కౌమారదశలో లక్షణాలు కనిపించవచ్చు.



**లక్షణాలు ఏమిటి?**

1. దేనిపైనా ఆసక్తి లేకుండా ఉండటం. (ఇతరుల నుండి ఉపసంహరించుకోవడం, బద్ధకం మరియు చదువులు, పని, శుభ్రత, ఆహారం పట్ల ఆసక్తి లేకపోవడం).
2. ఎల్లప్పుడూ అనుమానాస్పదంగా ఉండటం (ఎవరైనా మీపై దాడి చేయడానికి ప్రయత్నిస్తున్నట్లు భావించడం, భాగస్వామితో సంబంధం కలిగి ఉండటం మొదలైనవి)
3. భావోద్వేగ మార్పులు - భయం, ఆందోళన, కారణం లేకుండా నవ్వడం, ఏడుపు.
4. కనిపించని వ్యక్తులతో మాట్లాడటం, అద్దంలో చూసుకోని చిలిపి పనులు చేయటం. ఈ వ్యాధికి ప్రత్యేకంగా చికిత్స లేదు.. ఏళ్ల తరబడి వారిని సమాజానికి దూరంగా ఉంచుతారు. ఎందుకంటే కొన్నిసార్లు ఈ వ్యాధి బారిన పడిన వాళ్లు వింతంగా ప్రవర్తించి ఇతరులకు హాని చేయొచ్చు. లేదా వారికి వారే హాని కలిగించుకోవచ్చు.

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com